# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

### 1. తెలుగు, బైబులు సామెతలు: మానవ స్వభావం

## II. తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

ప్రస్తుత పరిశోధనాంశం తులనాత్మక సాహిత్యానికి చెందినది. అందువలన తులనాత్మక సాహిత్యం గురించి స్థూలంగా తెలుసుకుందాం.

**తులనాత్మక సాహిత్యం:** అభివృద్ధి చెందుతున్న సాహిత్య విభాగాలలో తులనాత్మక సాహిత్యం ముఖ్యమైనది. ఇది జర్మన్ జానపద సాహిత్యంలో చిన్న శాఖగా ప్రారంభమైనది. నేడు పండితుల ఆదరణను పొంది ప్రపంచమంతటా ఆధునిక సాహిత్య పరిశోధనగా అభివృద్ధి చెందినది. గత ఆరు దశాబ్దాలుగా మన దేశంలో కూడా తులనాత్మక సాహిత్య పరిశోధనలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

ఒక వస్తువును మరొక వస్తువుతో, ఒక వ్యక్తిని వేరొక వ్యక్తితో, ఒక ప్రదేశాన్ని మరొక ప్రదేశంతో, ఒక అంశాన్ని మరొక అంశంతో పోల్చి పరిశీలించడం మానవ సహజ స్వభావం. ఒక అంశాన్ని స్పష్టంగా అవగతం చేసుకోవడానికి, దాని విలువలను ఖచ్చితంగా అంచనా వేయడానికి, వేరొక అంశంతో వేరుపరచి దాని స్థానాన్ని నిర్ధారించడానికి పోల్చి చూడడం అనే పద్ధతి చాలా ఉపకరిస్తుంది.

తులనాత్మక సాహిత్యం ఈ పోల్చి చూడడమనే ప్రాతిపదిక మీదనే పుట్టింది. 'పోల్చి చూడడం', 'తులనాత్మక సాహిత్యం' రెండూ ఒక కుదురులోనే పుట్టినప్పటికీ ప్రాథమికంగా ఇవి రెండూ భిన్నమైనవి. పోల్చడం ఆత్మాశ్రయమైనదైతే, తులనాత్మక సాహిత్యం వస్త్వాశ్రయమైనది. పోల్చడం అనుభూతి ప్రధానమైనదైతే, తులనాత్మక సాహిత్యం శాస్త్రీయమైనది. పోల్చడానికి వైజ్ఞానిక పద్ధతి ఉండదు. తులనాత్మక సాహిత్యం వైజ్ఞానిక పద్ధతులను పాటిస్తుంది.

'తులనాత్మక సాహిత్యమంటే నిర్దేశిత దేశ సరిహద్దులకు అతీతంగా ఒక సాహిత్యాన్ని మరొక సాహిత్యంతోనో, సాహిత్యాలతోనో, సాహిత్యేతర వైజ్ఞానిక శాఖలతోనో తులనాత్మకంగా పరిశీలించడం' అని తులనాత్మక సాహిత్య పరిశోధకుడైన H.H. Remak నిర్వచించారు.[1]

ఈ నిర్వచనాన్ని అనుసరించి తులనాత్మక సాహిత్య పరిశోధనను స్థూలంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి: 1. సాహిత్యాన్ని సాహిత్యంతో పోల్చడం,

---

[1] జయప్రకాశ్, ఎన్. తులనాత్మక సాహిత్యం, శ్రీ దివ్య పబ్లికేషన్స్, మదురై, 1998, పుట 6

2. సాహిత్యాన్ని ఇతర శాఖలతో పోల్చడం. ఈ రెండిటిలోనూ అనేక అంతర్విభాగాలు ఉన్నాయి.

భాషలు, దేశాలు, జాతులు మొదలగువాటి మూలంగా మనుష్యులు విడిపోయేటప్పుడు వాటిని భౌతికమైన స్వల్ప విషయాలుగా చూపుతూ వాటి వెనుక ఉన్న చిరంతన మానవ మౌల్యాలను ప్రస్ఫుటం చేస్తూ మానవులలో విశాల దృక్పథాన్ని పెంపొందింపజేయడమే తులనాత్మక సాహిత్య ప్రధాన లక్ష్యం.

ప్రస్తుత పరిశోధనాంశం 'తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం' తులనాత్మక సాహిత్య పరిశోధనంలో రెండవ భాగానికి చెందిన ప్రత్యేక సాహిత్య ప్రక్రియల తులనాత్మక పరిశీలనానికి చెందినది.

ఈ నేపథ్యంలో తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనాన్ని ప్రారంభిద్దాం. ఈ తులనాత్మక పరిశీలనంలో సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలను ఏడు అధ్యాయాలలో పొందుపరిచాను. అవి:

1. తెలుగు, బైబులు సామెతలు: మానవ స్వభావం
2. తెలుగు, బైబులు సామెతలు: ఉపదేశం
3. తెలుగు, బైబులు సామెతలు: సార్వత్రిక సత్యాలు
4. తెలుగు, బైబులు సామెతలు: నమ్మకాలు, విశ్వాసాలు
5. తెలుగు, బైబులు సామెతలు: స్త్రీ
6. తెలుగు, బైబులు సామెతలు: వ్యవసాయం
7. తెలుగు, బైబులు సామెతలు: ఇతరాలు

ఇప్పుడు మొదటి అధ్యాయంతో ముందుకు సాగుదాం.

# 1. తెలుగు, బైబులు సామెతలు: మానవ స్వభావం

'లోకో భిన్న రుచిః అని ఆర్యోక్తి. 'జిహ్వాకొక రుచిః పుఱ్ఱెకొక బుద్ధి' అంటున్నది ఒక తెలుగు సామెత. మనిషికి మనిషికీ మధ్య శారీరకముగానే కాక బుద్ధులలోను, స్వభావాలలోను ఉండే వ్యత్యాసాలకు ఈ సామెతలు అద్దం పడుతున్నాయి.

ఒక తల్లి కడుపున పుట్టిన పిల్లలందరూ ఒకేలాగా ఉండరు కదా! అంతెందుకు ఒకే చేతికున్న వ్రేళ్లే సమంగా ఉండవు. అలాగే లోకంలో ఉన్న మనుషుల స్వభావాలు కూడా ఒకేలాగా ఉండవు. అందుకే భిన్న స్వభావాలను ఉద్దేశించే విభిన్నమైన సామెతలు ఆ యా భాషలలో ఉన్నాయి.

ఈ అధ్యాయంలో విభిన్న మానవ స్వభావాలకు చెందిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలను పరిశీలిద్దాం. ఇవి 77 ఉన్నాయి. సౌలభ్యం కొరకు వీటిని 16 ఉపవర్గాలుగా పునర్విభజించాను. అవి సహనశీలత, స్నేహము, మూర్ఖత్వము, దౌష్ట్యము, వాక్శుద్ధి-వాచాలత్వము, కపటము, డంబము, సోమరి తనము, దురాశ, కృతఘ్నత, లోభము, తారతమ్యము, చిన్నచూపు, అహము, ద్వంద్వ ప్రమాణము, భోజన ప్రియత్వము. ఈ 16 ఉపవర్గాలలో మానవుల మంచితనమును గురించి చెప్పేవి రెండు మాత్రమే. మిగిలినవి మానవుల దుష్ట స్వభావాలకు చెందినవి. దీని అర్థం పరిశోధనలో దొరికిన అధిక సమానార్థక తెలుగు, బైబులు సామెతలు ఈ వర్గాలకు చెందినవి మాత్రమే కావడం. అంతేకాని తెలుగు, బైబులు సామెతలు మనిషి దౌష్ట్యమును గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయని కాదు అని గ్రహించాలి. మంచిని గురించి మాటలాడే తెలుగు, బైబులు సామెతలు విడివిడిగా చాలా ఉన్నాయని కూడా తెలుసుకోవడం మంచిది.

# సహనశీలత

**1**

తెలుగు సామెత : గంజాయి తోటలో తులసి మొక్కవలె

బైబులు సామెత : ముండ్ల తుప్పలలో లిల్లీ పుష్పములాగా (పరమగీతం 2:2)

భారతదేశంలో తులసి మొక్కకున్న పవిత్ర స్థానం అందరికీ తెలిసిందే. నిత్యం వచ్చే ఎన్నో ఆరోగ్య సమస్యలకు చక్కని పరిష్కారం ఇస్తుంది తులసి మొక్క. మరో ప్రక్క గంజాయి అనేది మత్తు మందునిచ్చే మొక్క. అది మనుష్యులను వ్యసనపరులను చేస్తుంది. కొన్నిసార్లు గంజాయి తోటలో తులసిమొక్క రావచ్చు. చుట్టూ ఉన్న ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ధైర్యంగా తన అస్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తుంది తులసిమొక్క. తన చుట్టూ ఉన్నవాళ్ళు తనవాళ్ళు హాని చేసే ప్రయత్నం చేసినా ధైర్యంగా తమ అభిప్రాయాన్ని వెల్లడి చేస్తారు కొందరు. అటువంటివారిని చూచి, వాడు గంజాయి వనంలో తులసి మొక్కలాంటివాడంటారు పెద్దలు. అదే విషయాన్ని 'ముండ్ల తుప్పలలోని లిల్లీ పుష్పము' అనే మరో చక్కని ఉపమాన రూపంలో చెబుతుంది బైబులు సామెత. ప్రతికూల పరిస్థితులు ఎదురైనవారు క్రుంగిపోకుండా ఈ సామెతలను చెబుతారు. ప్రతికూల పరిస్థితులకు సర్వశక్తులు ఎదురొడ్డి నిలవాలన్న విషయాన్ని ఈ సామెతల నుండి నేర్చుకోవచ్చు.

ఇదిగాక మరింత ప్రస్ఫుటంగా వేరొక అర్థం అటు బైబులు సామెతలోనూ, ఇటు తెలుగు సామెతలోనూ ద్యోతకమవుతున్నది. అంతగా పేరు లేని వంశంలో ఒక మహానుభావుడు జన్మించి లబ్ధప్రతిష్ఠుడైతే గంజాయి తోటలో తులసిమొక్కలా పుట్టాడంటారు. రావణ కుంభకర్ణాది దుర్మార్గులున్న వంశంలో విభీషణుడు అలాటివాడే. ఈ సామెతనే వ్యతిరేకార్థంలో ప్రయోగించడం కూడా కద్దు. తులసి వనంలో గంజాయి మొక్క చందాన అని కూడా అంటారు. పవిత్ర వంశమొకదానిలో అంతకు ముందెన్నడూ లేని చందాన దుష్టుడొకడు జన్మించి వంశ ప్రతిష్ఠనంతా మంట గలుపుతాడు. మా కడుపున చెడబుట్టావని తల్లిదండ్రులు నిందిస్తారు. నిజానికి ప్రతి కుటుంబంలోనూ ఇలాటి కొరకరాని కొయ్య ఒకడుండడం సామాన్యమే.

**2**

తెలుగు సామెత : పుటము వేసినదే బంగారం

బైబులు సామెత : వెండి బంగారములను కుంపటి పరీక్షించును (సామెతలు 17:3)

వెండి, బంగారములు మానవుల దృష్టిలో అమూల్యమైనవి, శ్రేష్ఠమైనవి. కానీ అవి ఎప్పుడంత విలువను సంతరించుకున్నాయి? నిప్పులో వాటిని కాల్చి వాటిలోని మలినాలన్నింటినీ తొలగించినప్పుడే అవి స్వచ్ఛముగా తయారవుతాయి. లేకపోతే వాటికి అంత విలువ ఉండదు. ఎవరూ వాటిని మక్కువతో కొనుక్కోరు కూడా! అట్లాగే కష్టాలు, కన్నీళ్ళు మానవుని ధీరత్వాన్ని పరీక్షించడానికే వస్తాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొన్న వ్యక్తి ఉన్నతమైన వ్యక్తిత్వముతో, ఇతరుల కష్టాలను అర్థం చేసుకునే వ్యక్తిగా ఎదుగుతాడు. కాబట్టి కష్టాలు, కడగండ్లు వచ్చినపుడు క్రుంగిపోకుండా వాటిని అధిగమించి మరింత మెరుగైన ఆత్మ విశ్వాసముతో ముందుకు సాగేందుకు వాటిని ఉపయోగించుకోవాలి. వాటిని దాటి ముందుకు సాగినవారు విజయాన్ని పొందుతారు. కష్టాలు వచ్చినప్పుడు క్రుంగిపోకుండా, వాటి నుండి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని రెండు సామెతలూ బోధిస్తున్నాయి.

ఉదాహరణకు హరిశ్చంద్రుణ్ణి సత్యవాక్పరిపాలకుడని మనం శ్లాఘించేది అతడు షట్చక్రవర్తులలో ఒకడై వైభవోపేతంగా పరిపాలన నెరపుతున్న కాలానికి పరిమితమైనందుకు కాదు. అతడు రాజ్యభ్రష్టుడై కానలపాలై, భార్యా వియోగం పుత్రశోకాదులతో తల్లడిల్లిన సమయంలో కూడా అతని సత్య నిష్ఠ అకుంఠితంగా నిలిచినందుకే అతడు శ్లాఘనీయుడు. అలాగే మహా సంగ్రామం ముంచుకువచ్చిన తరుణంలో కర్ణుడు తన సహజ కవచ కుండలాలను విప్రునికి దానమియ్యవలసిన పరిస్థితి. ఆ అగ్ని పరీక్షే అతనికి దానకర్ణుడనే బిరుదును సార్థకం చేసింది అని గ్రహించాలి.

## స్నేహము

**1**

తెలుగు సామెత : అక్కరకు వచ్చినవాడే అయినవాడు

బైబులు సామెత : స్నేహితుల కొరకు ప్రాణమిచ్చువాడే నిజమైన స్నేహితుడు (యోహాను 15:13)

చుట్టము, లేక స్నేహితుడు అనేవాడు అన్ని సమయాలలోను తన స్నేహితునికి అండగా ఉండాలి. కేవలం తనకు ఆపద, లేక అవసరం వచ్చినప్పుడే స్నేహితుని కోసం పరుగెత్తుకొని వచ్చేవారు అసలైన మిత్రులు కారు. ఇలాంటివారు "మీ ఇంటికొస్తే మాకేమిస్తారు? మా ఇంటికొస్తే మీరేం తెస్తారు?" అనే స్వభావం గలవారు. స్నేహమనేది యేకపక్షంగా ఉండకూడదు. అలా ఉంటే అది అక్కర తీరడానికి నటించడమౌతుంది గానీ స్నేహమనిపించుకోదు. అక్కరకు వచ్చేవాడే, లేక ఆపదలో ఆదుకొనేవాడే నిజమైన స్నేహితుడు. ఆ విధంగా కాకుండ కేవలం తన స్వార్థం కోసమే స్నేహితుని ఉపయోగించుకొని, అతడు ఆపదలలో చిక్కుకొనగానే ఆదుకొన కుండా ముఖం దాటవేసేవాడిని వెంటనే విడిచిపెట్టాలి. వాని వల్ల ఎటువంటి మేలు కలుగదు. ఈ విషయాన్నే బద్దెన సుమతీ శతకంలో –

'అక్కరకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున దా
నెక్కిన బారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయుగదరా సుమతీ' అంటాడు.

కాగా స్నేహితుడనేవాడు కష్ట సుఖాలలో, కలిమి లేముల్లో ఒకే విధంగా ఉండి అవసరమైనట్టు చేదోడువాదోడుగా ఉండాలి. అందుకే స్నేహితునికి, స్నేహానికి జీవితంలో ఉన్నత స్థానం కల్పించారు ప్రాజ్ఞులు! "చెడి స్నేహితుని ఇంటికి వెళ్ళవచ్చును గాని సోదరుని ఇంటికి వెళ్ళకూడదు" అంటారు పెద్దలు. అందుకే రక్త సంబంధుల కంటే నిజమైన స్నేహితుడే ఆప్తుడని అంతరార్థం. స్నేహమంత తీయనిది మరేదీ లేదని అనుభవజ్ఞులు చెబుతుంటారు. కనుక అక్కరకు వచ్చినవాడే, లేక ఆపదలలో కూడా ఆదుకొనేవాడే నిజమైన స్నేహితుడని ఈ సామెత భావం!

మంచి మిత్రుడు, నిస్వార్థ ప్రేమ ఎలా ఉండాలో తెలియజేస్తున్నది బైబులు సూక్తి. ఈ లోకంలో ఒకరి కోసం ఇంకొకరు మరణించరు. ఒకరి తప్పు వేరొకరు భరించరు. సాధారణంగా ఆపదలలో చిక్కుకున్న నాడు ఎవరూ దగ్గరకు కూడా రారు (లూకా సువార్త 10:36 'మంచి సమరయుని' ఉపమానం). యేసుక్రీస్తు ఈ లోకంలో సంచరిస్తూ ఉన్నప్పుడు ఒక ధర్మశాస్త్ర బోధకుడు ఆయనతో స్నేహితుడు, లేక పొరుగువాడు ఎవడు అని ప్రశ్నించాడు. అందుకు యేసు ఒక కథ చెప్పాడు, ఒకడు యెరూషలేము నుండి ఎరికో పట్టణానికి పోతున్నాడు. దారిలో అతణ్ణి దొంగలు

దోచుకొని, కొట్టి, కొనప్రాణాలతో విడిచిపెట్టి పోయారు. అతడు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్నాడు. ఆ సమయంలో ఒక యాజకుడు (పూజారి), మరొక లేవీయుడు (దేవుని సేవకు నియమించబడినవాడు) ఆ దారివెంటనే వెళుతూ, దొంగల చేతిలో దెబ్బలు తిని ఆపదలో ఉన్నవాణ్ణి చూస్తూ, ఉదాసీనంగా వెళ్ళిపోయారు. తరువాత ఒక సమరయుడు (తక్కువ వానిగా చూడబడేవాడు) ఆ దారిన పోతూ, ఆపదలో ఉన్న ఆ బాటసారిని చూచి జాలిపడి, అతనికి ప్రథమ చికిత్స చేసి ఆదరించి బాగు చేయగల ఒక గృహానికి చేర్చాడు. నిజానికి దొంగల చేతిలో చిక్కిన బాటసారికి స్నేహితుడు, లేక పొరుగువాడు ఆ సమరయుడేనని ధర్మశాస్త్రోపదేశకుడు ఒప్పు కున్నాడు. ప్రతివాడూ తన స్నేహితుని కోసం ప్రాణమును సైతం అర్పించాలని బైబులు ప్రబోధిస్తున్నది. కనుక ఆపదలో అడ్డుపడేవాడే చుట్టము అనే తెలుగు సామెత, స్నేహితుల కోసం ప్రాణం పెట్టేవాడే నిజమైన స్నేహితుడనే బైబులు సామెత ఒకే భావాన్ని బోధిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : కలసిరాని కాలంలో కలిసొచ్చేవాడే స్నేహితుడు

బైబులు సామెత : సంపదలలో మంచి మిత్రుని గుర్తింపజాలము. కాని ఆపదలలో చెడ్డ స్నేహితుని తప్పక గుర్తించవచ్చును (సీరా 12:8)

ఒక వస్తువు పదికాలాల పాటు మన్నుతుందో లేదో తెలుసుకొనేందుకు దానిని వివిధ పరీక్షలకు గురిచేస్తారు.

మనిషి మంచితనాన్ని, నాణ్యతను గుర్తించడానికి కూడా కొన్ని పరీక్షలుంటాయి. దేవుడు అనేకసార్లు తన భక్తులను పరీక్షిస్తుంటాడు. మన స్నేహితుడని చెప్పుకొంటున్న వాడు నిజంగా స్నేహితుడో కాదో నిర్ణయించేది కాల పరీక్షే.

ఏ అవసరమూ రాకుంటే అందరూ ఉత్తములే. ఎవరెలాటివారో తెలిసేది కష్టమొచ్చినప్పుడే. తుఫాను రానంత కాలం అన్ని కట్టడాలూ బాగానే ఉంటాయి. పెనుగాలీ, వరదలే నిర్మాణం దార్ఢ్యాన్ని బయటపెట్టేది. ఆపద వచ్చినప్పుడు ముఖం చాటువేసే మిత్రుడు హీనుడు. అతని అసలు రంగు బయటపడేది అప్పుడే. వీరు మెరమెచ్చులతో నోటి మాటలతో మురిపిస్తారు. అలా కాకుండా ప్రమాదం ముంచు కొచ్చినప్పుడు నిలబడిన వారే నిజమైన మిత్రులు. ఈ సత్యాన్నే పై తెలుగు, బైబులు సామెతలు ప్రతిపాదిస్తున్నాయి.

# 3

తెలుగు సామెత : చెడి స్నేహితుని ఇంటికి పోవచ్చు గానీ సోదరునింటికి పోరాదు

బైబులు సామెత : ఆపదలు వచ్చినప్పుడు స్నేహితునింటికి పొమ్ముగాని
సోదరునింటికి పోవలదు (సామెతలు 27:10)

నెత్తురు  నీటికన్నా చిక్కన అని ఓ ఆంగ్ల సామెత. స్నేహాలు, అనుబంధాలు ఎన్నున్నా రక్త సంబంధం రక్త సంబంధమే అని దీని భావం. అయితే ఇక్కడ మానవ సంబంధాలలో ఒక విచిత్రమైన వైరుధ్యాన్ని బైబులు, తెలుగు సామెతలు రెండూ ప్రతిపాదిస్తున్నాయి.

తమ్ముడు కష్టాలలో ఉంటే చేయూతనివ్వడం అన్నగారి విధి, బాధ్యత. అన్నను ఆశ్రయించడం తమ్ముని హక్కు. ఇందుకు భిన్నంగా తెలుగు, బైబులు సంస్కృతులు రెంటిలోనూ మన పూర్వికులు ఈ విచిత్రాన్ని గుర్తించారు. అది సామెతగా అవతరించింది. ఇబ్బందులలో ఉన్నప్పుడు సోదరుని ఇంటికి వెళ్ళడం కంటే స్నేహితుని ఇంటికి వెళ్ళడానికే మనసు మొగ్గు చూపుతుంది. దీనికి అనేక కారణాలుండవచ్చు. గతంలో తాను చేసిన అనేకమైన తప్పటగులు సోదరునికి తెలిసి ఉండడం వాటిలో ఒకటి. ఇప్పుడు ఇక్కట్లలో ఉండి సోదరుణ్ణి ఆశ్రయిస్తే 'మరి, నేను చెబితే విన్నావా? అని అతడు ఈసడించవచ్చు. అప్పటికే అనేకమార్లు సోదరుని వద్ద సాయం పొందిన సందర్భాలూ ఉండి ఉండవచ్చు. అన్న దగ్గరికి వెళ్ళడం ఫర్వాలేదు గానీ వదినెగారి వ్యంగ్యాలూ మూతి విరుపులూ సహించడం కష్టం కావచ్చు. తానున్న కష్టస్థితి కుటుంబమంతటికీ తెలిసిపోతుందన్న సంకోచం కావచ్చు. స్నేహితునితో ఈ బాధలుండవు. అతడు నిన్ను నిన్నుగా స్వీకరిస్తాడు. తిట్లు, ఉపదేశాలు, కోపాలు ఉండవు. పైగా ధనమున్నప్పుడే బంధుత్వం. పేదవాడిని, అవసరంలో ఉన్నవాడిని స్వంత తమ్ముడైనా చేరదీయదు మానవ స్వభావం. అందుకే

'విత్తహీనమైన వేళలందును తల్లి
దనయులాలి సుహృదులనెడి వార
లెల్ల శత్రులగుదు రెండైన నిజమిది' అని అంటాడు వేమన.

సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అన్నట్టు తోడబుట్టినవారి కంటే కూడా

ఆత్మీయంగా మసలుకొనే స్నేహితులుంటారు. జంకు గొంకు లేకుండా దేనికైనా సిద్ధపడి ఆపన్న హస్తమందించి ఆదరిస్తారు. మొత్తంమీద సోదరునింటికి పోవడం కన్నా స్నేహితునింటికి పోవడమే మేలన్న నానుడిని తార్కికంగా సమర్థించడం కొంత కష్టమైనా జన సామాన్యంలో వాడుకగా జరిగేది ఇదే. అన్నదమ్ముల మధ్య ఏదో వికర్షణ, బెరుకు ఉంటాయి. స్వేచ్ఛగా మాట్లాడుకోవడం, సహాయాలు పరస్పరం చేసుకోవడం స్నేహితుల్లోనే సాధ్యం. ఇది తేటతెల్లమైన ధోరణి. దీనినే తెలుగు, బైబులు సామెతలు తెలుపుతున్నాయి.

అయితే ఒకే రక్తం పంచుకుని పుట్టిన సోదరుల మధ్య చనువు, పరస్పర ఆసరా ఉండడం అత్యావశ్యకం. ఒక తల్లి ప్రేమను పంచుకుని, ఒక ఇంట్లో బాల్య దినాలు గడిపి, కుటుంబంలో కలిమి లేములు కలిసి సహించి, అనుభవించి, అనితర సాధ్యమైన బంధం పెంపొందించుకున్నవారు కడగండ్ల సమయంలో ఒకరికొకరు చేయూతనిచ్చు కోవడం అతి సహజంగా జరిగితే బావుంటుంది.

బైబులు, తెలుగు సామెతలు రెండూ లోక వ్యవహారంలో కనిపించే ధోరణులనే వ్యాఖ్యానిస్తున్నాయి.

## మూర్ఖత్వం

**1**

తెలుగు సామెత : ఎత్తెత్తిపోసినా ఇత్తడి బంగారమగునె?

బైబులు సామెత : మూర్ఖుని రోటబెట్టి దంచినను వాని మూర్ఖత్వమును తొలగింపజాలము (సామెతలు 27:22)

సామెతలను పద్యాలలో పొదిగి తన సుమతీ శతకం ద్వారా వాటికి జన బాహుళ్యంలో అమితంగా ప్రచారం కలిగించినవాడు బద్దెన. ఈ సామెత ఇమిడి ఉన్న పద్యం –

‘ఉత్తమ గుణములు నీచున
కెత్తెరగున కలుగ నేర్చునెయ్యడలందా
నెత్తిచ్చికరగబోసిన
ఇత్తడి బంగారమగునె యిలలో సుమతీ!”

ఈ సామెతలో ఉత్తమునికి ఉత్తమ గుణాలే తప్ప నీచమైన గుణాలు రావనీ, అలానే నీచునికి నీచమైన గుణాలే తప్ప ఉత్తమ గుణాలు రావని వివరించాడు బద్దెన. ఇత్తడిని ఎన్నిమార్లు కరగించి శుద్ధి చేసినా అది ఇత్తడిగానే ఉంటుంది గాని పుత్తడి (బంగారం) గా మారదని ఉపమానంగా చెప్పాడు. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే, అంటే కాష్టంలో కాలేటప్పుడే పోతుందని మరొక తెలుగు సామెత తెలుపుతున్నది. సహజ గుణం ఎన్నడూ మారదని దీని భావం.

బైబులు సామెతలో మూర్ఖునికి ఎన్ని చెప్పినా తన మూర్ఖత్వాన్ని విడిచిపెట్టడనీ, బోధించినా, బాధించినా అతడు మారడనీ, వాని సహజ గుణం మానుకోలేడనీ గ్రహిస్తున్నాము.

తెలుగు సామెత కూడా ఎన్నిసార్లు కరగించినా ఇత్తడి పుత్తడి కానట్లే, నీచునికి ఉత్తమ గుణాలు ఏ విధంగానూ రావని చెబుతున్నది. ఇత్తడిని కరగించినా బంగారం కాదు. మూర్ఖుని రోటిలో వేసి దంచినా వాని మూర్ఖత్వం పోదు. ఇవి రెండూ సమానార్థకాలైన సామెతలు. ఇదే అర్థాన్నిచ్చే సామెతలు అటు బైబులులోనూ, మన సంస్కృతిలోనూ కూడా మరెన్నో ఉన్నాయి.

## 2

తెలుగు సామెత : ఏటివంకలెవరు తీరుస్తారు? కుక్కతోక నెవరు చక్కజేస్తారు?

బైబులు సామెత : వంగినదాని వంకర తీయలేము (ఉపదేశకుడు 1:15)

పొట్లకాయ పిందెకు బరువు కడితే నిటారుగా పెరుగుతుంది. వక్రబుద్ధి గల నరుని ఆంతర్యాన్ని సూటి చేయగలవారెవరు? పై సామెతలలో నిగూఢంగా ఉన్న భావమిదే.

జీవితకాలమంతా పాతకాలు మూటగట్టుకొన్న వాడు మరణశయ్యపై ఉన్నాడట. అవసాన దశలో వాడిచేత ఒక్కసారి నారాయణా అనిపించాలని శ్రేయోభిలాషులు ప్రయత్నిస్తున్నారు. 'నారా' అనమంటే ఏదో అన్నాడట వాడు. 'యణా' అనమంటే ఇంకేదో అన్నాడట. కొందరికి ఏదీ ముక్కుసూటిగా అర్థం చేసుకోవడం అనడం చేతగాదు. అలాటివారు తపోధనుని డాంబికునిగానూ, శుచిగలవానిని వేషధారిగాను, శూరుని కర్కశునిగాను, ప్రియభాషణం చేసేవాడిని దీనునిగానూ సభలో యుక్తి యుక్తంగా మాట్లాడేవానిని వదరుబోతుగాను అభివర్ణిస్తారు.

నీరు పల్లంవైపు ప్రవాహంగా పారుతుంది. ఇలా ప్రకృతి సహజమైన ఎత్తుపల్లాల్లో వంపులతో నదీనదాలు ప్రవహిస్తుంటాయి. తెలుగు సామెత ఈ ప్రకృతి సత్యం నుండి పుట్టింది. ఆ ఏటి వంకలను సరిజేయడం ఎవరి తరమూ కాదు. ఇక కుక్కతోక సామెత తెలియనిదెవరికి?

కొన్ని చెట్టు కాండాలు ప్రకాండాలు వంపు తిరిగి ఉంటాయి. అవి విరగనైనా విరుగుతాయి గానీ తిన్ననివి కానేరవు. ప్రకృతిసిద్ధంగా వక్రబుద్ధి గల కుటిలుడు ఎంత చదివినా నాగరికత నేర్చినా అతని బుద్ధి మారదని ఈ సామెతల భావం.

### 3

తెలుగు సామెత : కాకిని తెచ్చి పంజరంలో ఉంచితే చిలుక పలుకులు పలుకుతుందా

బైబులు సామెత : కూషు దేశస్తుడు (నల్ల జాతివాడు) తన చర్మమును మార్చుకొన గలడా? చిరుతపులి తన మచ్చలను మార్చుకొనగలదా? (యిర్మీయా 13:23)

సహజ గుణాలను, శారీరక వర్ణాన్నీ, తత్త్వాన్నీ మార్చడం సాధ్యపడదని తెలియ జేయడానికి ఈ సామెతలు వాడతారు. ఇదే అర్థాన్ని తెలిపే నానుడులు తెలుగు భాషలో చాలా ఉన్నాయి. "ఎలుక తోలు తెచ్చి ఎందాక రుద్దినా నలుపు నలుపే గాని తెలుపు రాదు" అంటాడు ప్రజాకవి వేమన. "కాకి కోకిల కాదు, వెలయాలు ఇల్లాలు కాదు" అంటారు విజ్ఞులు. కోకిల గుడ్లు పెడితే కాకి వాటిని పొదిగి పిల్లలు చేస్తుందని, కాకీ కోకిలా ఒకే గూటిలో పెరిగినా, ఆకారం నల్లగా ఉన్నా కంఠం విప్పితే కాకి కూతలు, కోకిల గీతాలు వేరువేరుగా ఉంటాయని ఒక కథనం. కాకికి కోకిల కంఠంలోని మాధుర్యం రాదు. ఇవి మారని గుణాలు. ప్రకృతి సిద్ధంగా పుట్టుకతో

వచ్చే సహజ లక్షణాలు. నల్ల జాతివారు ఎంత ప్రయత్నం చేసినా వారి రంగును మార్చుకోలేరు.

"పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోద"ని మరొక తెలుగు సామెత. ఎంత ప్రయత్నం చేసినా పుట్టుకతో వచ్చిన సహజ స్వభావాన్ని మానవులు మార్చుకోలేరు. అయితే ఇది ఒక్క దైవానికే సాధ్యమని బైబిలు వక్కాణిస్తున్నది. శునకాన్ని తెచ్చి కనకపు సింహాసనం మీద కూర్చోబెట్టినా, దానికి రాజసం గానీ, ఠీవి, హుందాతనంగానీ రావు సరికదా, తన సహజ గుణాన్ని మార్చుకోలేదు. అంటే "చెప్పు తినెడు కుక్క చెఱకు తీపి యెరుగునా" అన్నట్లు తన సహజత్వం మీరకుండ నడుచుకుంటుంది. "వెల్ల వేసినంత మాత్రాన వెన్నెల కాదు" అంటారు కొందరు. గోడలకు సున్నంకొట్టినంత మాత్రాన వెన్నెల కాస్తుందని, సృష్టి ప్రకాశిస్తుందని భావించడం ఎంత పొరపాటో, కాకి కోకిలౌతుందని, వాతలు పెట్టుకొని నక్క పులిగా మారుతుందని భావించడం అంతే పొరపాటు.

యిర్మీయా గ్రంథంలో పైని పేర్కొన్న బైబులు సామెత ఉన్నది. కీడు చేయుటకు అలవాటు పడిన జనాంగం, మేలు చేయలేదని, పులి తన మచ్చలను, నల్లవాడు తన దేహచ్ఛాయను మార్చుకోలేనట్లే దుష్టులు తమ దుష్టత్వం నుండి బయటపడలేరనీ ఈ సూక్తి అంతరార్థం.

"ఎంత ప్రయత్నించినా ఉల్లి మల్లి కాదు" అనే మరొక సామెత దీనికి సమానమైదే.

"బొగ్గు పాల గడుగ బోవునా మలినంబు" అంటాడు వేమన. బొగ్గును తెచ్చి పాలలో కడిగినా దాని నలుపు పోయి తెలుపు రాదు. అలాగే ఎంత చదువు చదివి ఎన్ని విన్నను గాని హీనుడు తన అవగుణాన్ని మానుకోలేడు.

## 4

తెలుగు సామెత : కూర్చున్న కొమ్మను నరుకుకొన్నట్లు (పట్టు గొమ్మను నరుకుకొన్నట్టు)

బైబులు సామెత : మూఢురాలు తన చేతితో తన ఇల్లు ఊడబెరుకును (సామెతలు 14:1)

కొంతమందికి తమకు మేలుచేసే వారెవరో, కీడు చేసేవారెవరో తెలియదు. ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణ కూడ ఉండదు. ఒక్కొక్కసారి తమ హితులను, స్నేహితులను కూడా తూలనాడి, దూరం చేసుకుంటారు. పిచ్చివాళ్ళు తమకు ఆధారమైనదాన్నే జారవిడుచుకుంటారు. అన్నం పెట్టేవాళ్ళనే అలక్ష్యం చేసి దూరం చేసుకుంటారు. ఇటువంటి అవివేకులను గూర్చి తెలియజేయడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా ఈ కోవకు చెందినదే. మూఢురాలు తన ఇంటిని తానే ఊడబెరుకుతుంది. ఇల్లు కట్టడం చాలా కష్టం. జ్ఞానంతో ఇల్లు కట్టుకునేవారు కొందరైతే మూర్ఖులు తమ ఇళ్ళను తామే పడగొట్టుకుంటారు. అంటే తమను తామే నాశం చేసుకుంటారు. ఈ బైబులు సామెత కూడా తెలుగు సామెతకు సమానార్థకమే.

ఈనాడు ఆత్మహత్యా సదృశ్యమైన అనేక కార్యాలు మానవులు చేస్తున్నారు. చేజేతులా జీవితాలను నాశం చేసుకుంటున్నారు. తమ ఆధారాలను తామే పోగొట్టుకుంటున్నారు. తాము కూర్చున్న, తమకు ఆధారమైన కొమ్మలను తామే నరుక్కుంటున్నారు. తమ ఇళ్ళను తామే పడగొట్టుకుంటున్నారు. కనుకనే ఈ తెలుగు సామెత, బైబులు సామెతలు సంఘంలో అధిక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 5

తెలుగు సామెత : కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు

బైబులు సామెత : ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ఆత్మను పోగొట్టుకొనిన అతనికేమి ప్రయోజనము? (మత్తయి 16:26)

అనవసరంగా, నిరుపయోగంగా శ్రమపడినపుడు శ్రమ నిష్ఫలదాయకమైనప్పుడు పై సామెతలను ఉపయోగిస్తారు. ఎలుకలు పట్టడం కోసం కొండలు, గుట్టలు ఎక్కనవసరం లేదు. వాటిని తవ్వనవసరమూ లేదు. మన ఇంటిలోను, పరిసర ప్రాంతాలలోనూ ఎక్కడబడితే అక్కడే ఉంటాయి ఎలుకలు. వాటి కోసం కొండను తవ్వడమంటే వృధా శ్రమ చేయడమన్నమాటే. మన పని ప్రయోజనకరంగా ఉండాలి.

“ఎన్నడూ ఎరుగనివాడు తిరునాళ్ళకు వెళ్ళితే ఎక్కా దిగా సరిపోయిందట.” తిరునాళ్ళకు వెళ్ళి ఏదైనా చూడాలి, ఆనందించాలి, లబ్ధి పొందాలి. ఊరికే కొండనెక్కి దిగివస్తే లాభమేముంది? వృథా శ్రమే కదా! గుప్తనిధుల కోసం, గొప్ప ప్రయోజనం కోసం శ్రమించి కొండను తవ్వాలి. కేవలం ఎలుకల కోసం కొండను తవ్వడం వృథా ప్రయత్నం!

ఒక మానవుడు లోకమంతా సంపాదించుకున్నాడు. తాను తన ఆత్మను కోల్పోవు – నరకమునకు వెళ్ళు – స్థితిలో మరణించాడు. ఇది వృథా శ్రమ. తన ప్రాణానికి బదులుగా మానవులు ఏమి ఇచ్చినా అది తక్కువే అవుతుంది. ఇది ఆధ్యాత్మిక జీవితానికి, నిత్యరాజ్య వారసత్వానికి సంబంధించిన సామెత. మానవ జీవితం విలువైనది. మానవుడు నిజంగా దైవస్వరూపుడు. అతడు లోకమంతా సంపాదించుకొని తన ఆత్మనే కోల్పోతే ప్రయోజనమేముంది?

బైబులు సామెతలో ఉన్న నిగూఢార్థం తెలుగు సామెతలో లేదు. ఇది కేవలం వృథా ప్రయాసను అధిక్షేపిస్తూ చెప్పిన సామెత. మొనగాళ్ళు కొందరు బయలుదేరి ఏదేదో సాధిస్తామని విర్రవీగి తీరా వట్టి చేతులతోనో ఎవరికీ ప్రయోజనం లేని వ్యర్థ ఫలితంతోనో తిరిగి వస్తే హాస్యాస్పదంగా ఈ మాట అంటారు. సామాన్య జ్ఞానం చొప్పున ఎవరైనా సులభంగా చెప్పగలిగినదానిని చాలామంది శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేసి కొత్తగా కనిపెట్టినట్టు చెబితే సామాన్య జనం నవ్విపోతారు కదా.

## 6

తెలుగు సామెత : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్టు

బైబులు సామెత : గురువుల బోధను పెడచెవిని పెట్టితిని వారి ఉపదేశములను లెక్కచేయనైతిని (సామెతలు 5:12-13)

మానవుడు తన జీవితములో అనేక సందర్భాలలో ఎంతోమంది సలహాలను తీసుకుంటాడు. ఒక పని చేయబోయే ముందు ఎందరినో సంప్రదిస్తాడు. కానీ పెద్దలు, సన్నిహితులెంత చెప్పినా కొందరు వినిపించుకోరు. వారిని లెక్కజెయ్యరు. తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటారు. తీరా

నష్టము వచ్చిన తరువాతనో, లేక నిర్ణయాలు బెడిసికొట్టినప్పుడో హడావుడిగా పెద్దల దగ్గరకో, అయినవారి దగ్గరకో రక్షించమని పరుగెడతారు. కానీ, అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోతుంది. అందుకే చేతులు కాలకముందే ముందు జాగ్రత్త తీసుకోవాలి గాని, కాలిన తరువాత ఆకులు పట్టుకున్నా పెద్దగా ప్రయోజనమేమీ ఉండదు. ఈ విషయాన్ని తెలుగు సామెత చక్కని పోలికతో వివరిస్తున్నది. బైబిలు సామెత ఈ విషయాన్ని సూటిగా తేలికైన భాషలో చెబుతుంది. నష్టము జరిగిన తరువాత గురువులు చెప్పినప్పుడు, హెచ్చరించినప్పుడు వినలేదే, వారు ఎంతో వివరముగా ఉదాహరణలతో చెప్పినా పెడచెవిని పెట్టానే అని బాధపడుట అనవసరం. ఆ ఆలోచన, విశ్లేషణ ముందే ఉండాలి. జరగవలసిన నష్టం జరిగిన తరువాత కాదు. ముందుచూపు, సలహాలను స్వీకరించే అలవాటు, తప్పులను అంగీకరించి మార్చుకునే ప్రయత్నం వంటి లక్షణాలు నష్టం కలుగకుండా కాపాడుతాయని ఈ సామెతల ద్వారా నేర్చుకోవచ్చు.

కొన్ని తప్పులకు మనుషులు, దేవుడు కూడా క్షమించవచ్చును గానీ ఆ పాపకర్మను ఆ వ్యక్తి అనుభవించక తప్పదు. కాముకుడై విచ్చలవిడి వ్యభిచారంలో మునిగి తేలినవాడికి ఎయిడ్స్ వంటి వ్యాధి సోకితే ఇక దానికి మందు లేదు. ఆ తరువాత ఎంత డబ్బు పోసినా, ఎన్ని తీర్థాలు తిరిగినా నిష్కృతి లేదు. జరగవలసింది జరిగిపోయాక మనిషి మారి మునీశ్వరుడైనా ఇక తరుణోపాయం లేదు.

'శ్రవణ పుటములున్న సార్థక్యమేమిరా
వినగ వలయు బెద్దలనెడి వన్ని
వినగ వినగ విశదములౌ సుమ్ము'

అనే వేమన చెప్పిన నీతినే బైబులు సామెతా, తెలుగు సామెతా ఉపదేశిస్తున్నాయి.

## 7

తెలుగు సామెత : తా మెచ్చింది రంభ – తా మునిగింది గంగ

బైబులు సామెత : మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది (సామెతలు 12:15)

'ఎవడి పిచ్చి వాడికానందం' అనే సామెత కోవకు చెందినదే ఈ తెలుగు సామెత. ఇంకా కొంచెం లోతుగా ఆలోచిస్తే "తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు" అనే సామెత కూడా ఈ భావాన్నే ప్రతిపాదిస్తున్నది.

మూర్ఖుని మార్గం వాని దృష్టిలో సరియైనదే. ఎన్ని చెప్పినా దాన్ని వాడు విడిచి రాడు. ఒకని మార్గం వానికి సరియైనదిగానే కనిపిస్తుంది అని చెప్పడంలో బైబులు సామెత పరిధి మూఢ చిత్తుల చపల వర్తనకు పరిమితమయింది. తెలుగు సామెతలో కూడా ఇదే భావమున్నప్పటికీ నైతికంగా తటస్థ ధోరణిని, చర్యలను కూడా ఇది ఉద్దేశిస్తున్నది. లోకోభిన్న రుచిః అన్నట్టు ఎవరి ఇష్టాయిష్టాలు వారికుంటాయి. కాని అవి మాత్రమే ఒప్పు అనుకోవడం తప్పు.

ఎవరు చెప్పినా వినకుండా తన ఉన్మాద చర్యలతో, మూర్ఖ క్రియలతో, దుర్మార్గంతో ప్రవర్తిల్లేవారి విషయంలో విసుగు చెంది విజ్ఞులు అనే మాటలే ఈ రెండు సామెతలూ. అలాటివారిని వారి మొండితనం నుండి మరలించడానికి శతవిధాల ప్రయత్నించి వాడి ఖర్మకు వాడిని వదిలివేసే సమయంలో ఇలా సరిపెట్టుకోవడం పరిపాటి. అందుకే

ఎంత చదువు చదివి ఎన్ని విన్నను గాని
హీను డవగుణంబు మానలేడు
బొగ్గు పాల గడుగ పోవునా మలినంబు? అంటాడు వేమన.

## 8

తెలుగు సామెత : తెడ్డుకేమి తెలుసు కూరల రుచి? ఎద్దుకేమి తెలుసు అటుకుల రుచి?

బైబులు సామెత : మూఢుని యెదలో జ్ఞానము నిలువదు (సామెతలు 14:33)

వ్యోమ సింహాసనం వీడి దేవదేవుడు యేసుక్రీస్తు ఏ దేశాన మరియా తనూజుడై అవతరించి తన బోధనామృతాన్ని ధారలుగా ప్రవహింపజేశాడో ఆ దేశపు కొండ గట్టుల మీదనే ఆయన రక్తపుటేరులు పారించారు ఆయన స్వజనం.దీని గురించి వ్యాఖ్యానిస్తూ 'ఇందేదో వేద రహస్యమున్నది యది తండ్రీ' అంటూ జాషువా వాపోయాడు 'క్రీస్తు' అనే ఖండకావ్యములో. జరిగినదేమిటంటే ఆయన తాను దైవ కుమారుడినంటూ తన అవతార పరమార్థాన్ని విశదపరుస్తుంటే దైవ దూషణ చేశావంటూ యూదులు హుంకరించారు. దురిత విష సర్పపు పడగ నీడ నుండి తప్పించి స్వేచ్ఛామార్గంలోకి నడిపిస్తానంటే దొరతనం వారైన రోమీయులపై

తిరుగుబాటు దారుగా ముద్రవేశారు. చెక్క, లవంగాలు, కుంకుమపువ్వు, కర్పూరం కలిపిన మంచి బెల్లపు పాకాన్ని కలియబెట్టే తెడ్డుకు పాకం రుచి తెలియదు గదా. కుడుతి త్రాగే ఎద్దుకు కమ్మని అటుకులు నెయ్యితో దోరగా వేయించి కొత్తిమీర, జీడిపప్పు కలిపి తినిపిస్తే లొట్టలు వేస్తూ తింటుందా? అధములు ఉదాత్తమైనవాటి ఉత్కృష్టతను గ్రహింపలేరు అనే సార్వత్రిక సత్యాన్ని తెలుగు సామెత ఒకింత హాస్యోక్తిగా వినిపిస్తున్నది.

'కుక్క యేమెరుంగు గురులింగ జంగంబు
పిక్కబట్టి యొడసి పీకుగాక
సంతపాకతొత్తు సన్న్యాసి నెరుగునా'

అంటూ వేమన సైతం చమత్కరించాడు. అతడెంత యోగి పుంగవుడో, గురులింగడో, లఘు లింగడో ఊరకుక్కకేమి తెలుసు? అపరిచితులుగా తోచినవారి మీద కెగబడి కరిచి వదులుతుంది. సముద్రంలో కలిసిన నీటిబొట్టు ఉనికి లేకుండా అంబుధిలో కలిసిపోతుంది; స్వాతి చినుకు ముత్యపు చిప్పలో పడితేనే గదా నవమౌక్తికమయ్యేది.

మూర్ఖునికి ఎంతటి దివ్యోపదేశం చేసినా ఫలితముండదు. అది సూకరాల ఎదుట ముత్యాలు వేసినట్టే; కారడవిలో శశికళలు వెల్లివిరిసినట్టే. అపాత్రదానం మహా పాపం. ఎవరికేది తగునో దానినిచ్చి ఊరుకోవడం ఉత్తమం. ఔచిత్యం ప్రధానం. ఈ అభిప్రాయాన్నే తెలుగు, బైబులు సామెతలు వెలిబుచ్చుతున్నాయి.

'గాడ్దె యేమెరుంగు గంధంపు వాసన
కుక్క యేమెరుంగు ఒక్క ప్రొద్దు
అల్పుడేమెరుంగు హరుని గొల్చు విధంబు' అన్న వేమన దీనినే వివరిస్తున్నాడు.

## 9

తెలుగు సామెత : తేనె పోసి పెంచినా వేపకు చేదు పోదు

బైబులు సామెత : మూర్ఖునికి బోధింపగోరి పలుకులను వ్యర్థము చేసికొనవలదు (సామెతలు 23:9)

వేపకు చేదు రుచి అనేది సహజ సిద్ధముగా వచ్చిన లక్షణము. ఆ లక్షణాన్ని ఎంతగా పోగొట్టాలన్నా పోగొట్టలేము. చిన్న మొక్కగా ఉన్నప్పుడే నీటికి బదులు తేనెను పోసి పెంచినా కూడా దాని చేదు పోదు. తేనె సృష్టిలో అత్యంత మధురమైన పదార్థాలతో ఒకటి. అటువంటి శ్రేష్ఠమైనదానిని తెచ్చి పోసి పెంచినా ఆ చేదు లక్షణమనేది వేపను వీడిపోదు. అదే విధముగా మూర్ఖుని ఆలోచనా తీరును, అలవాట్లను మార్చాలనుకోవడం వృథా ప్రయాసే అవుతుంది. మార్చాలనుకొని పోయిన వారికి భంగపాటు తప్పదు. వారికి ఎంత మంచి పలుకులు, ఉదాహరణలు చెప్పినా కూడా అవి వ్యర్థమే. వారు వాటి నుండి ఏమీ నేర్చుకోరు. కనీసం పట్టించుకోనైనా పట్టించుకోరు. వేప మొక్కకు తేనె పోసి, అనవసరముగా వృథా చేసుకున్నట్లవుతుంది. మూర్ఖుల విషయంలో జాగరూకులై ఉండవలసిన ఆవశ్యకతను ఈ సామెతలు తెలియజేస్తున్నాయి.

'వేము పాలు పోసి ప్రేమతో బెంచిన
జేదు విరిగి తీపి చెందబోదు
ఓగునోగె కాక యుచితజ్ఞుడెట్లౌను'

అనే పద్యంలో వేమన ఈ సామెతను పొదిగాడు. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో పోదు. కుట్టడం తేలు సహజ లక్షణం, కాటు వేయడం పాము నైజం. చిచ్చు ఒడిని గట్టుకుంటే కాలకుంటుందా? మూర్ఖునికి చెవినిల్లు కట్టుకొని పోరినా అతనిలో సంస్కారం ఉదయించడం దుర్లభమని పెద్దలు అనుభవపూర్వకంగా చెప్పారు.

'పాలు బంచదార పాపర బండ్లలో
చాలబోసి వండ జవికి రాదు
కుటిల మానవులకు గుణమేల కలుగురా' అంటాడు వేరొక పద్యంలో వేమన.

మన పడతులు కాకరగాయ వంటకంలో కొంచెం బెల్లం కలుపుతారు. ఇంతకన్నా కటిక చేదు ఫలాలు ప్రకృతిలో ఉన్నాయి. పాలు, పటికె బెల్లం కలబోసి వండినా అటువంటి కాయల్లో చేదు విరగదు. అలాగే మూర్ఖులకు చేసే హితబోధ కంఠశోష మాత్రమే తెస్తుంది అని ఈ సామెతల నుండి గ్రహించవచ్చు.

## 10

తెలుగు సామెత : పంది బురద మెచ్చు, పన్నీరు మెచ్చునా?

బైబులు సామెత : స్నానము చేయించినంత మాత్రమున పంది బురదగుంటలో పొర్లాడక మానునా? (2 పేతురు 2:22)

ప్రకృతి సహజమైన ప్రవృత్తిని ఏ జీవీ అధిగమించలేదు అని వీని మౌలికార్థం. అయితే ఇంతకన్నా మించిన నైతిక భావనే ఇందులో ధ్వనిస్తుంది. దుర్మార్గులు తమ దుష్ట నైజాన్ని మార్చుకోగలగడం దుర్లభం అనే వాస్తవాన్ని  చెప్పే సూక్తులివి.

'కనకపు సింహాసనముపైన ఒక శునకము కూర్చుండ తగునా?' అన్నట్టుగా శునకాన్ని పసిడి గద్దెపై అధిష్టింప జేయడమెంత అనుచితమో సూకరానికి స్నానం చేయించడం అంత అనుచితం, అనవసరం. వేమన వేరొక పద్యంలో కూడా జీవులలోను, మనుషుల నైతిక జీవనంలోనూ పరివర్తనా రాహిత్యాన్ని ప్రస్తావించాడు.

"ఎలుక తోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉదికినా నలుపు నలుపే గాని తెలుపురాదు. . ."

అన్నట్టుగానే బొగ్గును పాలతో కడగడం ఎంత నిరర్థకమో కూడా వేమన చెప్పాడు.

ఈ బైబిలు సామెతకు జతగా "తాను కక్కిన కూటికి కుక్క ఆశించును" అని ఇదే వచనంలో పేతురు భక్తుడు ప్రస్తావించాడు. ఈ సామెతను పేతురు సామెతలు 26:11 నుండి పరిగ్రహించాడు. పందిని గురించి జన సామాన్యంలో ఉన్న సామెతను పై సామెతకు తానే జోడించాడు. మూర్ఖుడు తన మూర్ఖపు పనులకు మరలడం కుక్క తాను కక్కిన కూడు తినడంతో పోలిక చెప్పడం చూస్తున్నాము. కుక్క తోకను ఎంతగా సవరించినా అది వంకరే కదా. కాగితం పూలు సౌరభం వెదజల్లుతాయా?

"నల్లజాతివాడు తన చర్మమును మార్చుకోగలడా? చిరుతపులి తన పొడలను మార్చుకోగలదా?? అని సర్వేశ్వరుడు యిర్మీయా 13:23 లో ప్రశ్నించినదీ ఇలాటి సందర్భంలోనే. ఇక్కడ ప్రకృతి సిద్ధంగా జీవులు తమ సహజ సంవేదనలను, స్వతస్సిద్ధంగా తమ లక్షణాలను ఎలా మార్చుకోలేవో అలానే దురితాలకు అలవాటు పడి భ్రష్టమై పోయిన మానవులు తిరిగి సంస్కారవంతులు కాలేరు.

దేవుని యథార్థ ప్రేరణ మూలంగా గాఢమైన పరివర్తనం చెంది ఆయన మార్గాల ననుసరించేవారు గాక, ఇతరత్రా బాహ్య కారణాల వల్ల మత భక్తి గలవారుగా

ముసుగు వేసుకొని తాత్కాలికంగా 'కొత్త పిచ్చి' అన్నట్టు తమ చెడు అలవాట్లను వదిలినవారు త్వరలోనే తమ నిజ స్వరూపాలతో తిరిగి సాక్షాత్కరిస్తారు. మరలా తమ భ్రష్ట క్రియల వైపుకు మళ్ళుతారు. పందిని జాగ్రత్తగా సుగంధ ద్రవ్యాలతో కడిగినా దాని స్వభావం బురదలో దొర్లడమే. లౌకిక శక్తుల నుండి తప్పించుకొన్నా, మళ్ళీ ఆ శక్తులకే చిక్కి పరాజితులైతే ముందటి కన్నా మరింత దురవస్థకి వారు లోనవుతారని పేతురు వివరించాడు. "దానికంటె వారు సన్మార్గమును ఎరుగకయే ఉన్నచో వారి స్థితి కొంత బాగుండెడిది" (వచనం 21).

పంది తిరిగి బురదలో దొర్లకుండా ఉండాలంటే అది ఇక పందిగా ఉండక రూపాంతరం చెందాలి. గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారడాన్ని దీనితో పోల్చలేము. ఎందుకంటే అవి రెండూ ఒకే జీవిత చరిత్రలోని రెండు దశలు. యోహాను 3:3 లో "మనుష్యుడు మరల జన్మించితేనే తప్ప దేవుని రాజ్యమును చూడజాలడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసుక్రీస్తు పలికిన వాక్కులలో దీనికి జవాబున్నది. సూకరము వంటి వ్యక్తి మరొక జన్మ ఎత్తి గొర్రెగా అవతరించిన రీతిలో దైవశక్తి, పవిత్రత అతని వ్యక్తిత్వపు అట్టడుగు వరకు ప్రభావం చూపి అతనినొక నూతన జీవిగా మార్చినప్పుడే మరలా బురద వైపుకు తిరగడం అనేది జరగకుండా ఉంటుంది. గొర్రె బురదలో సౌకర్యంగా ఉండలేదు కదా.

మనుషులలో ఇటువంటి మార్పు సాధ్యమే. అయితే ఏదో ఒక బాహ్య కారణం వల్ల, పరిస్థితుల ప్రాబల్యం వల్ల పైపై మార్పు చవిచూచిన వ్యక్తి తన నైజాన్ని మార్చుకోలేక తిరిగి తన పాత జీవిత విధానానికి తిరిగి పోవడాన్ని దృశ్యమానమైన రీతిలో ఈ సామెతలు చెబుతున్నాయి.

## 11

తెలుగు సామెత : పెంటమీద రాయి వేస్తే ముఖమంతా చిందుతుంది

బైబులు సామెత : మూర్ఖుని మందలించువాడు నవ్వుల పాలగును, దుష్టుని హెచ్చరించువాడు అవమానములు కొనితెచ్చుకొనును (సామెతలు 9:7)

దుష్టుడు అహంకరించి ఊరంతటినీ పీడిస్తూ విశృంఖల విహారం గావిస్తుంటాడు. అలాటివాడికి బుద్ధి నేర్పబూనుకుంటే ఎంతటి వారన్నది చూడకుండా వారిమీదే తిరగబడి దుర్భాషలాడడం వాడి నైజం.

'చాకి కోకలుదికి చీకాకుపడజేసి
మైల దీసి లెస్స మడచినట్లు
బుద్ధి చెప్పువాడు గుద్దిన నేమయా'

అంటూ వేమన పలికిన హితవులు మూర్ఖులకు రుచించవు.

సుయోధనుని కొలువులో విదురాది నీతికోవిదులు, భీష్మాది కురువృద్ధులు, ద్రోణాది గురుపుంగవులు ఎంతమంది హితవు పలికినా, వాసుదేవుడు పనిగట్టుకుని వచ్చి హెచ్చరించినా వారికి కంఠశోష, తిరస్కారమే మిగిలింది.

తెలుగు సామెత ఇలాటివారిని మందలించడం వ్యర్థమనీ, పైగా అది మందలించబూనుకున్న వానినే నవ్వులపాలు చేస్తుందనీ బహు నిష్కర్షగా, నిశితంగా తెలుపుతున్నది. బైబులు సామెత కూడా దుష్టుని క్షేమమాశించి నాలుగు మంచి మాటలు చెబితే మనకే తలవంపులు ఎదురవుతాయనే లోక ప్రసిద్ధ సత్యాన్ని సూటిగా వ్యక్తపరచింది.

ముళ్ళ కంచెపై మేలిమి చీనీ చీనాంబరాన్ని ఆరవేస్తే దానిని తిరిగి తీసే సమయంలో అది చినగక మానదు. నీటిలో కొట్టుకుపోయే తేలును చేతులతో రక్షించడానికి ప్రయత్నిస్తే అది కుట్టక మానదు. అలానే మూర్ఖుని మనస్సు రంజింపజేయాలనే సదుద్దేశంతో సుద్దులు పలుకబూనుకుంటే అవమానం తప్పదు.

తెలుగు సామెత మూర్ఖుని జోలికి వెళితే అవమానం కలుగుతుందని చెబితే, బైబులు సామెత మూర్ఖునికి మంచి చేయబోయినా అవమానం కలుగుతుందని చెబుతున్నది. మంచికిపోతే చెడు ఎదురయిందన్నట్టు దుర్మార్గునికి హితవు చెప్పబోతే మనకి మిగిలేది తిరస్కారమే. మేలుకోరి పూనుకుని అజ్ఞానిని మంచి మార్గంలోనికి తేవాలని పోయినవాడు చెంపలు వేసుకొనే పరిస్థితి వస్తుంది. 'పోగాలము దాపురించిన వాడు కనడు, వినడు, మూర్కొనడు' అని నీతిచంద్రిక సూక్తి. రావణబ్రహ్మ కొలువులో

ప్రధానులంతా సీతాపహరణాన్ని సమర్థించారు. నీతికోవిదుడు, సాధుజీవీ అయిన విభీషణుడు మాత్రం ముంచుకు రానున్న వంశ నాశనాన్ని ఊహించి అగ్రజునికి మంచి మాటలు చెప్పబూనుకున్నాడు. ఫలితం ఛీత్కారం, దేశ బహిష్కారం, శత్రువుతో చేయి కలిపాడన్న అపకీర్తి. ఇది మూర్ఖుల తీరు.

## 12

తెలుగు సామెత : మనిషికొక మాట గొడ్డుకొక దెబ్బ

బైబులు సామెత : మూర్ఖుడు నూరు దెబ్బలకు నేర్చుకొనలేనిది వివేకశాలి ఒక్క మందలింపుతో నేర్చుకొనును ( సామెతలు 17:10)

పశు జన్మకన్నా మానవ జన్మ ఉత్కృష్టమైనది. మానవుడు బుద్ధి జీవి. దె కార్తె అనే మేధావి మనిషిని నిర్వచిస్తూ "నేను ఆలోచిస్తాను గనుక నేను మనిషిని" అన్నాడు. జంతువులు కేవలం సహజ సంవేదనల సాయంతో స్పందిస్తుంటాయి. మనిషిలో ఉన్న ఆలోచన, వివేచన, విచక్షణలు అతనిని జంతువులకు భిన్నంగా నిలుపుతున్నాయి.

గ్రామీణ జీవితంలో అందరెరిగిన సత్యాన్ని మరికొంత ఉన్నతాదర్శాన్ని వెల్లడించడం కోసం సంక్షిప్తంగా బలంగా చెప్పినదే ఈ తెలుగు సామెత. పశువులను కూడా కాపరులు అదిలింపులతో అదుపులో ఉంచడానికి ప్రయత్నిస్తుంటారు. చాలావరకు పశువులు సైతం ఇలాంటి అదిలింపులకు స్పందిస్తాయి. తరచుగా ఒక దెబ్బ కూడా అవసరమవుతుంటుంది. ఇది ప్రకృతి సహజం.

కాని సామెతలో అంతర్లీనంగా ఇలాటి ప్రకృతి ధర్మాలను ఆసరాగా చేసుకొని చేసే జ్ఞాన బోధ కూడా అనివార్యంగా ఉంటుంది. సులువుగా బలంగా, ప్రకృతి ధర్మాన్ని చెబుతూ చక్కని హెచ్చరికను తెలుగు సామెత చేస్తుంటే, బైబులు సామెత మరింత వివరంగా, సూటిగా హీనుల జ్ఞానహీనతను ఎత్తిచూపుతూ కర్తవ్యబోధ చేస్తున్నది.

మనుషుల్లో పశుప్రాయులుంటారు. మాటలతో వారిలో పరివర్తనం కలుగదు. అందుకే "దండం దశగుణం భవేత్" అన్నారు ఆర్యులు. మాటలతో వినకుంటే బెత్తం వాడవలసిందే. అది మనుషులు విధించే శిక్ష కావచ్చు, లేక తన అవివేకం వల్ల ఒకనికి సంప్రాప్తించే శిక్ష కావచ్చు. శ్రేయోభిలాషులు ఎంత చెప్పినా వినక అదే

పనిగా తన ధోరణిలోనే సాగిపోయేవానికి ఎదురు దెబ్బలు తగులుతూనే ఉంటాయి. కొంత కాలానికి అలాటివారు గుణపాఠం నేర్చుకొని సన్మార్గంలోకి రావచ్చును. జ్ఞాని ఇతరుల అనుభవం నుండి నేర్చుకుంటాడు అని నానుడి.

సున్నిత హృదయునికి, సంస్కారవంతునికి ఒక్క హెచ్చరిక, దిద్దుబాటు సరిపోతుంది. అవివేకిని పదేపదే హెచ్చరించి దండోపాయం ప్రయోగించినా తన దుర్మార్గం వీడడు. ఈ వాస్తవాలనే ఈ సామెతలు వెల్లడిస్తున్నాయి.

## 13

తెలుగు సామెత : రామాయణమంతా విని రామునికి సీత ఏమవుతుందని అడిగినట్టు

బైబులు సామెత : మూర్ఖుడు చెప్పినదంతయు విని, నీవేమి చెప్పితివని అడుగును (సీరా 22:8)

ఏకసంథాగ్రాహులుంటారు. ఒక్కసారి చెబితే విని, దానిని ఉన్నదున్నట్టుగా అప్పజెప్పడంలో దిట్టలట. ధారణ, గ్రహణ శక్తి పుట్టుకతో వస్తాయో లేదో గానీ, అభినివేశం కలిగి అభ్యాసం చేస్తే అలవడే నిపుణతలే ఇవి. అవధానాలలో ఇలాటి దృశ్యాలు కోకొల్లలుగా కనిపించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తాయి.

దీనంతటికీ వ్యతిరేకంగా కనిపించే బుద్ధిమాంద్యం గల వారి గురించి చెబుతున్న సామెతలు పై రెండూనూ. మూర్ఖుడు అని బైబులు సామెతలో ఉపయోగించిన శబ్దానికి సందర్భోచితంగా రెండు అర్థాలు స్ఫురిస్తున్నాయి. చెవినిల్లు కట్టుకుని ఓపికగా చెప్పినదానిని ఎంతమాత్రం ఆకళింపు చేసుకోలేని మందబుద్ధులు కొందరు. ఎదుటివాడు చెబుతున్నదానిని ఒక చెవితో విని వేరొక చెవితో వదిలివేసి అసలు విషయం గ్రహించడానికి బుద్దిపూర్వకంగా నిరాకరించే తుంటరులు మరికొందరు.

తెలుగు సామెత తెలుగునాట బహుళ ప్రచారంలో ఉంది. సీతారామ కళ్యాణం, వియోగం, రావణ వధ, పునస్సమాగమం వంటి అంశాలు రామాయణ గాథకు ఆయువుపట్టులు. రామాయణమంతటినీ మూడు ముక్కల్లో కట్టె, కొట్టె, తెచ్చె అంటూ చెప్పినా దీనిలో దనుజుని చెర నుండి ధర్మపత్నిని విడిపించడానికి దాశరథి చేసిన వీరోచిత కార్యాలే ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కాగా రామాయణ గాథ అంతా విని ఇంతకీ రాముడికి సీత ఏమి కావాలి అనడాన్ని ఏమనుకోవాలి?

ఇకపోతే వ్యవహారంలోకి వచ్చేసరికి ఈ సామెతను ఉపయోగించేది బుద్ధిమాంద్యం గలవారిని గాని, బుద్ధిపూర్వకంగా ఏమరుపాటు ప్రదర్శించే వారిని గానీ ఉద్దేశించి కాదు. పెద్దలు హితోపదేశం చేస్తూ కర్తవ్య బోధను గావించే సమయంలో ఎదుటివాడు ఇంకా సందేహిస్తూ 'అయితే నేనిప్పుడేమి చెయ్యాలి' వంటి సందిగ్ధ వచనాలు పలుకుతూ ఉండే సందర్భంలో ఈ సామెత ఉపయోగించడం కద్దు. కొంత విసుగుగా, కొంత చనువుగా వాత్సల్యపూరితంగా ఆ వ్యక్తిని కార్యోన్ముఖుణ్ణి చేయడం కోసం ఈ సామెత ప్రయోగిస్తారు.

బైబులు సామెత తెలుగు సామెత అంత నిశితంగా, హాస్య రసస్ఫోరకంగా లేకున్నప్పటికీ అదే భావాన్ని ప్రతిపాదిస్తున్నది. మూర్ఖుడు, లేదా చపలుడు విషయమంతా విని ఇంతకీ నీవు చెప్పేదేమిటి అని అంటాడని భావం. తాను చెయ్యవలసినది స్పష్టంగా కూలంకషంగా అవతలి వ్యక్తి చెప్పినా దాన్ని పాటించడం ఇష్టం లేకనో, చేతగాకనో ఈ మాట పలకవచ్చు. లేక నిజంగానే ఏదీ చొరలేని అయోమయపు మస్తిష్కంతో అవగాహన లేమితో ఏది విన్నా, అంతా అయిపోయిన తరువాత నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదు అనవచ్చు.

ఈ రెండు సామెతల అంతరార్థం స్పష్టం. మనుషులు సూక్ష్మగ్రాహులై తమ మేలుకోరి హితోపదేశం చేసేవారి అభిప్రాయాలను అందిపుచ్చుకొని సదసద్వివేకం అలవరచుకోవాలి.

## దౌష్ట్యం

**1**

తెలుగు సామెత : అతి వినయం ధూర్త లక్షణం

బైబులు సామెత : దుష్టుడు నక్క వినయముతో దండము పెట్టినను నమ్మరాదు (సీరా 12:11)

దుర్జనుడు పైకి అనుకూలంగా ఉన్నట్టు నటిస్తూ లోలోపల హాని తలపెడుతూ ఉంటాడు. అలాటివాడు ఏ దుర్బుద్ధీ లేనివానికన్నా నయగారాలు మెరమెచ్చులు

గుప్పిస్తూ ఆప్తుడన్న భావన కలిగిస్తాడు. ఇలాటి వ్యక్తులను గురించి వేమన పరిపరి విధాల హెచ్చరించాడు:

'అంతరంగమందు నపరాధములు చేసి
మంచివాని వలెనె మనుజుడుండు'

మనస్సున ద్రోహచింత కలిగి పైకి శుష్కప్రియాలతో ప్రేమలు ఒలకబోసేవాడు బహు ప్రమాదకారి. అతి వినయం ధూర్త లక్షణమన్నది తెలుగువారి నోట నానుతుండే సామెత. బైబులు సామెతలో నక్క వినయమన్నది దీనికి సాటియైన మాట. సింహం వద్ద నక్క మోరదించి తోకను రెండు కాళ్ళ మధ్య ముడుచుకొని దూరం దూరంగా తొలుగుతూ వినయం ఒలకబోస్తుంది. సింహం గాయపడి నేలగూలిన తరుణంలో దాన్ని సజీవంగా తినడానికి కూడా నక్క వెనుకాడదు.

'ద్రోహియైనవాడు సాహసంబున నెట్టి
స్నేహితునికినైన చెరుపు చేయు

నూహ కలిగియుండు నోగుబాగులు లేక' అంటూ ఇలాటి టక్కరుల నైజాన్ని ఎండగట్టాడు వేమన.

ధూర్తుల నైజమెరిగి దూరంగా ఉండడం ఉత్తమం. హాని చేసే తలంపు లేకున్నా అధములు కొందరు లాభమాశించి లేని ప్రేమలు నటిస్తారు. పబ్బం గడవగానే కనుమరుగవుతారు. 'ఓడ మల్లయ్యా' అంటూ గౌరవించినవారు ఏరు దాటాక ఆ సరంగును 'బోడి మల్లయ్యా' అని గేలిచేస్తారు. సాయమడిగిన వారికి చేతనైనంత వరకు చేసి పంపించడమే పాటి గానీ, వారి మాటలు నమ్మి ఆత్మ బంధువుల వలె వారిని ఎంచరాదు. ఈ సామెతలు నేర్పించే పాఠం ఇదే.

## 2

తెలుగు సామెత : ఉండేది గట్టి, పోయేది పొట్టు

బైబులు సామెత : దుర్మార్గుడు కళ్ళమున గాలికెగిరిపోవు పొట్టులాంటివాడు
(కీర్తన 1:4)

కొందరు కొండ విరిగి మీద పడినా, చలించకుండా ఉంటారు. మరికొందరు యేకాస్త అసౌకర్యం, అలజడీ కలిగినా విలవిలలాడిపోతారు. జరిగేది ఎలాగూ జరుగుతుంది. మనం గట్టిగా నిలబడినా, అటూ ఇటూ పరువులెత్తినా రానున్నది రాక మానదు, పోనున్నది పోకమానదు. గాలికి పరుగెత్తే పొట్టులాగా తేలిపోకుండా గట్టిగా నిలబడి ఉంటే, ఏనాటికైనా అనుకున్నది సాధించవచ్చు. అటువంటి సమయాన్ని సందర్భాన్ని వివరిస్తూ పై తెలుగు సామెత పుట్టింది. 'ఉండేది గట్టి, పోయేది పొట్టు' అనడంలో గట్టిదానికి పట్టం కట్టాలి. ఉన్నవానికే ఫలితం లభిస్తుంది కాని, చంచలుడై అటూ ఇటూ పరుగులెత్తేవానికి ఏదీ అందదు. కాబట్టి ఎన్ని ఆపదలొచ్చినా, దృఢచిత్తంతో నిలబడి విజయం సాధించాలి. పొట్టులాగా గాలికి తేలిపోకుండా గట్టిగా నిలబడి జీవించమని తెలియజేయడమే ఈ సామెతలోని అంతరార్థం.

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని అందజేస్తుంది. కళ్లంలో తూర్పారపట్టే సమయంలో పొట్టు దూరంగా కొట్టుకొని పోతుంది. గట్టి గింజలు క్రింద నిలబడతాయి. పొట్టును అగ్నితో కాల్చివేసి, గట్టి గింజలను ఇంటికి తీసుకుపోయి ఉపయోగించు కుంటారు. కాగా మానవులు గట్టి గింజల్లాగా ఉండాలి. అందరికీ ఉపయోగపడాలి. ఈ సామెతలో దుర్మార్గుడు పొట్టుతో పోల్చబడ్డాడు. చంచలుడై, దుర్మార్గుడై, నిరుపయోగంగా నశించకుండా, గట్టిగా, స్థిరమైన పునాది మీద నిర్మించబడిన సౌధంలాగా నిలిచి జీవించమని ఈ బైబులు సామెత బోధిస్తుంది.

ప్రతివాడికీ బెదరిపోయి, ప్రతిగాలికీ చలించిపోయి, ప్రతి సంఘటనకు విపరీతంగా ప్రతిస్పందించి మనం శాంతి సమాధానాలతో జీవించలేము. ధైర్య సాహసాలు కలిగి, నిర్భయంగా, నిశ్చింతగా జీవించాలి. మనం పరుగులెత్తితే, లోకం ఇంకా చులకన చేసి మనల్ని తరుముతుంది. మనం స్థిరంగా నిలబడితే లోకం తోకముడిచి, వెనక్కు తిరుగుతుంది. ఇదే భావాన్ని తెలుగు, బైబులు సామెతలు తెలియజేస్తున్నాయి. ఉండేది గట్టి, పోయేది పొట్టు. దుర్మార్గుడు కళ్ళంలో గాలికెగిరి పోయే పొట్టులాంటివాడు.

## 3

తెలుగు సామెత : ఉన్నమ్మ గతే ఇలా ఉంటే లేనమ్మది ఎలాగుంటుంది?

బైబులు సామెత : పచ్చి మ్రానుకే ఇట్లు జరిగితే ఎండిన మ్రాను గురించి ఏమి చెప్పగలము? (లూకా 23:1)

సాధారణంగా ధనమున్నవారికి, అన్ని హంగులు బలగం బలం ఉన్నవారికి అన్నీ సానుకూలంగానే జరుగుతాయి. ఏ లోపమూ ఉండదు. ఎవరూ ఎదురాడరు. అయితే ఒక్కొక్కసారి అన్నీ ఉన్నా, అందరూ ఉన్నా, బలం అర్హత ఉన్నా అనుకున్న పని, తలపెట్టిన పని జరుగనే జరగదు. మరి అన్నీ ఉన్నమ్మకే ఆ విధంగా జరిగితే ఇక ఏమీ లేనమ్మ సంగతేమిటి? ఆమె గతి వర్ణనాతీతం గదా!

డబ్బు, పలుకుబడి, అర్హత ఉన్నవాళ్ళకే ఏ పనీ సానుకూలమయి, సత్ఫలదాయకం కాకపోతే ఇక దరిద్రులకు, ఏ అండా అర్హతా లేనివాళ్ళకు ఏ పనీ జరుగదని భావం. అటువంటి సందర్భాలను వివరించే సమయంలో ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

యేసుక్రీస్తును సిలువ వెయ్యడానికి తీసుకొనిపోతున్నారు. ఆయన మీద మహా భారమైన సిలువను ఉంచి మోపిస్తున్నారు, కొడుతున్నారు, తిడుతున్నారు. ఆయన రక్తధారలు చిమ్ముతూ సిలువ భారంతో పడుతూ లేస్తూ నడుస్తున్నాడు. అప్పటి వరకు ఆయన చేసిన ఉపకారాలను అనుభవించిన స్త్రీలు ఆయనను చూచి విలపిస్తున్నారు. అప్పుడు క్రీస్తు 'నా కోసం ఏడువవద్దు, మీ కోసం మీ పిల్లల కోసం ఏడువండి. వారు పచ్చి మ్రానుకే ఇలా చేస్తే ఎండినదానికి ఇంకెలా చేస్తారో' అని వాళ్ళతో చెప్పాడు. అందరికీ మేలు చేసిన, అన్ని రోగాలు బాగుచేసి శాంతి మార్గాన్ని బోధించిన తనకే వారు (యూదులు) అటువంటి కష్టాలు కలిగిస్తే, ఇక మామూలు మనుషులకు ఎంతటి కష్టాలు కలిగించి వారిని ఎలా బాధిస్తారో కదా! అని దీనికి అర్థం.

కాగా అన్నీ ఉన్నవారికే అన్యాయం జరిగినప్పుడు, సంఘాన్ని ఉద్ధరించిన వారికే కఠిన శిక్షలు పడినప్పుడు ఏమీ లేనివారికి మామూలు మనుజులకు ఇక ఏమి జరుగుతుందో ఎంత అపకారం, అపాయం సంభవిస్తుందో ఎవరికైనా అనూహ్యమే. ఇటువంటి సందర్భాలను వివరించేటప్పుడు ఈ తెలుగు, బైబులు సామెతలు రెండింటినీ సమానార్థకాలుగా ప్రయోగిస్తారు.

## 4

తెలుగు సామెత : ఊరందరిది ఒక త్రోవ, ఉలిపి కట్టెది ఇంకొక త్రోవ

బైబులు సామెత : స్వార్థపరుడు ఇతరులతో కలియక తనకు తాను జీవించును (సామెతలు 18:1)

మానవుడు సంఘజీవి. సంఘంతో కలిసి తన కార్యక్రమాలను నిర్వహించుకొని, నెరవేర్చుకొని అందరితో కలిసి జీవించాలే గాని ఒక్కడుగా ఉంటే ఏమీ చేయలేడు. అందుకే "పదుగురాడు మాట పాటియై ధరజెల్లు, ఒక్కడాడు మాట ఎక్కదెందు" అంటాడు వేమన. బౌద్ధ ధర్మాలలో 'సంఘం శరణం గచ్ఛామి' అనడంలోని అర్థం కూడా ఇదే. సంఘాన్ని విడిచి, పదిమంది నడిచే త్రోవను, వారి పద్ధతులను విడిచి కొంతమంది ఏదో చెయ్యాలని తాపత్రయపడతారు. అది నేలను విడిచి సాము చేసినట్లే అవుతుంది గాని సత్ఫలితం రాదు. పదిమందితో కలిసి కీడు అనుభవించినా అది మేలుగానే పరిగణింపబడుతుంది. ఒంటరిగా ఉండి ఏమి చేసినా, అది వెక్కిరింతకు, వేలెత్తి చూపించుకోవడానికి మాత్రమే పనికివస్తుంది గానీ సమష్టిగా ఆమోదానికి నోచుకోదు. కాబట్టి ఊరంతా ఎటుపోతే అటే పోవాలి గాని, ఉలిపిరి కట్టెలాగా ఒంటరి దారిని పోకూడదు.

ఇందులో సంఘీభావం కూడా దాగి ఉంది. ఒంటరిగా ఉంటే అన్నీ సమస్యలే. ప్రతివారూ భయపెడతారు. అందరొకటై ఒంటరివానిని పారద్రోలడానికి ప్రయత్నిస్తారు. అతని స్థానబలం, సంఘ బలం తగ్గిపోతుంది. పరపతి పడిపోతుంది. మనుగడ దుర్భరమౌతుంది. నేడు ప్రతిచోట సాంఘిక పరమైన భద్రత కోసం సంఘాలు ఏర్పడుతున్నాయి. ఒంటరిగా ఏమీ సాధించలేమని గ్రహించినవారు కూలి సంఘాలు, రైతు సంఘాలు, ఉద్యోగుల సంఘాలుగా ఏర్పడి తమ తమ కోర్కెలను సాధించుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. పది కట్టెలు ఒకటిగా ఉంటే బలం ఉంటుందని, ఒక కట్టెను ఎవరైనా సులభంగా విరుస్తారనేది మనకు తెలిసినదే. ఊరంతా ఒకదారిని పోతున్నప్పుడు ఆ ఊళ్ళో ఏ ఒక్కడు ఒంటరిగా సాగిపోయినా దెబ్బ తింటాడు. అనేక సమస్యలు ఎదురౌతాయి.

బైబులు సామెతలో ఇలా ఒంటరి జీవితాన్ని గడిపేవాళ్ళను స్వార్థపరులన్నారు. బైబులులో సంఘానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ఇతరులకు సలహాలిస్తూ ఇతరుల సలహాలు స్వీకరిస్తూ ఐకమత్యంతో జీవించాలనేది బైబులు సామెతలోని ప్రబోధం.

ఒక్కడుగా బ్రతికినది బ్రతుకు కాదు. పదిమందితో కలిసి బ్రతికినదే బ్రతుకు. బైబులులో, పొరుగువారినే కాకుండా, శత్రువులను కూడ ప్రేమించమనడంలో సామాజిక జీవన సౌధం దృఢతరం కావడానికి మూల సూత్రాలు దాగి ఉన్నాయి.

నా ఇల్లు, నా ఊరు, నా రాష్ట్రం, నా దేశం అని గిరిగీచుకొని జీవించక, అందరూ వసుధైవ కుటుంబంగా కలిసి మెలిసి ఉండాలనేదే, తెలుగు సామెత, బైబులు సామెతలలో ప్రతిధ్వనించే సామాజిక చైతన్య భావన.

## 5

తెలుగు సామెత : కూసే గాడిద మేసే గాడిదని చెరిపినట్టు

బైబులు సామెత : దుష్టులు తోటివారిని అపమార్గము పట్టింతురు (సామెతలు 16:29)

గాడిద అనడంతోనే ఒక నీచార్థం స్ఫురిస్తుంది. మొరటుతనం, నిర్లక్ష్యం, అనాగరిక లక్షణాలు గుదిగుచ్చుకొని మన ముందు సాక్షాత్కరిస్తాయి. దాని ఆకారానికి తగినట్లే అలవాట్లు కూడా ఉంటాయి. గాడిద ఓండ్ర పెడితే చుట్టుపట్ల ఉన్నవారంతా ఉలికి పడవలసిందే. చెవులు మూసుకొనవలసిందే. గాడిద ఒక పట్టాన దారికి రాదు, మాట వినదు. అందుకే దాని చేత వెట్టిచాకిరీ చేయిస్తారు. బరువులు మోయిస్తారు. 'గాడిద చాకిరీ' అనేది కఠినమైన పని చేయించినపుడు అందరూ పలికే మాటే. ఇది ఒంటరిగా ఉంటే ఎలాగో లోబరచుకొని పనిచేయించుకోవచ్చు. దీనికంటే ఉలిపిరికట్టెగా ఉండే మరొక గాడిద వస్తే, ఆ రెండూ కలిస్తే మొదటి గాడిద కూడా మాట వినదు. ఈ సందర్భంలో 'ఆ ఎద్దు ఈ ఎద్దు జోడాయెనమ్మా, చేను బీడాయె నమ్మా' అనే మరొక సమాన భావార్థం కలిగిన తెలుగు సామెతను కూడా వాడతారు. ఒక చెడ్డవాడు మరొక సామాన్యుని చెంతకు చేరి, వానిని చెడగొడుతున్న సమయంలో ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు. అప్పటి వరకూ మేస్తూ ఉన్న గాడిద మరొక ఓండ్రపెట్టే గాడిద రాగానే మేయడం మానివేసి, అదీ అరవడం ప్రారంభిస్తుంది. అప్పటి వరకు అదుపులో ఉన్నవాడు మరొక ఆకతాయి జతగూడగానే రెచ్చిపోయి, హద్దుమీరి ప్రవర్తిస్తాడు. అందుకే 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టిందన్న' ఈ సామెత ప్రజాబాహుళ్యంలో పాతుకుపోయింది.

బైబులు సామెత కూడా దీనికి సరితూగేదే. దుష్టులు తోటివారిని అపమార్గంలోకి నడిపిస్తారని ఈ బైబులు సామెత తెలియజేస్తుంది. చెడ్డవాడు తనతోటివారిని బలవంతంగా ఋజు మార్గం నుండి తప్పించి, పెడదారిలోకి నడిపిస్తాడు. ఎందుకంటే – నేను కాదు, నా ప్రక్కవాడు కూడా అదే దారిలో ఉన్నాడని సమర్థించుకోవడానికి. కాబట్టి మనం దుష్టులం కాదు కదా, మనకింక భయం లేదని భావించి ఉదాసీనంగా ఉండకూడదు. మనచుట్టూ ఉన్నవాళ్ళలో ఎంతోమంది దుష్టులున్నారు, వారు మనల్ని అనునిత్యం అపమార్గంలో నడిపించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు గనక మనం అనుక్షణం జాగరూకత వహించి ఉండాలి.

'కుత్సితుండు చేరి గుణవంతుజెరచురా" అని బోధిస్తాడు వేమన. 'తాచెడ్డ కోతి వనమంతా చెరపింద"ని మరొక తెలుగు సామెత ఉంది అది కూడా దీనికి సమానమైన భావాన్ని బోధించేదే. దుష్టులు మన దగ్గరకు వచ్చినపుడు వారితో కలిసి మనం దుష్టత్వంలోనికి దిగజారకుండా చూచుకోవాలని ఈ బైబులు, తెలుగు సామెతలు రెండూ ఏక కంఠంతో బోధిస్తున్నాయి.

## 6

తెలుగు సామెత : కొండంత కాపురం కొండేలతో సరి

బైబులు సామెత : కొండెములు చెప్పువారు కొంపలు కూల్చిరి (సీరా 28:14)
అపదూరులు మోపువారు ఇల్లాండ్రకు విడాకులిప్పించిరి (సీరా 28:25)

కొండేలకు, కొంపల కూల్చివేతకు ఉన్న సంబంధాన్ని తెలుగు సామెత, రెండు బైబులు సామెతలు నొక్కి వక్కాణిస్తున్నాయి. పచ్చని కాపురంలో పనిగట్టుకుని నిప్పులు పోసే పుణ్యాత్ములుంటారు. స్వర్గసీమవంటి సంసారంలో ఓలలాడే ఆలుమగల మధ్య అపార్థాలు కల్పించి అమృతభాండంలో కాలకూట విషం నింపుతారు.

'కసవుచే నీటిచే మోదకలనచేత
బ్రదుకు మృగమీన సజ్జన ప్రకరమునకు
శబర కైవర్త సూచక జనులు జగతి
గారణము లేని పగవారు గారె తలప?'

(భర్తృహరి సుభాషిత రత్నావళి, దుర్జన పద్ధతి, పే. 73, ఏనుగు లక్ష్మణ కవి).

పరులను పీడింపక గడ్డి పరకలతో పొట్టపోసుకొనే జింకలకు బోయవారు, నీటిలో బ్రతికే మీనములకు జాలరులు, దొరికిన దానితో సంతసించి కాలం గడిపే సజ్జనులకు కొండెగాండ్రు అకారణ శత్రువులు.

కొంపలు కూలితే ఏదో పైశాచికానందమే తప్ప వారికంటూ ఏమీ ప్రయోజనం ఉండదు. నొసటి విరుపులతో, శ్లేషలతో, అర్ధ సత్యాలతో అనుమానభూతాన్ని నట్టింట నిలుపుతారు వీరు. అది 'ఇంతితై వటుడింతై' అన్నట్టు వేరూని శాఖోపశాఖలై పచ్చని కాపురం రచ్చకెక్కుతుంది. ఇలాటి తంటాలమారులు చస్తే పీడ విరగడౌతుందని వేమన అభిప్రాయపడ్డాడు :

'కొండెగాడు చావ, గొంప వాకిటికిని
వచ్చిపోదు రింతె వగపు లేదు
దూడ వగచునె భువి తోడేలు సచ్చిన?'

ఇలాంటివారి పట్ల జాగరూకతతో ఉండాలని ఈ సామెతల సందేశం.

## 7

తెలుగు సామెత : గాటిలో కుక్క గడ్డి తినదు, తిననీయదు
రెడ్డివారి దున్నపోతు తానెక్కదు, ఇంకొకదానిని ఎక్కనియ్యదు

బైబులు సామెత : మీరు స్వర్గములో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింప నియ్యరు (మత్తయి 23:14)

పశువులకు మేత వేయడానికి ప్రత్యేకంగా వాటి ముందు గాడి తయారుచేస్తారు. అందులో మేత వేస్తే పశువులు నిరాటంకంగా తినడానికి వీలౌతుంది. గాటిలో మేత తప్ప ఇంకేమీ వేయరు. అటువంటి గాటిలో కుక్క ఉంటే పశువులకు చాలా ఆటంకం. ఆ కుక్క గాటిలోని గడ్డిని తాను తినదు. ఇతర పశువులను తిననీయదు. రెడ్డివారి దున్నపోతు తానెక్కదు, ఇంకొకదానిని ఎక్కనీయదు అనే తెలుగు సామెత కూడా ఇటువంటిదే. ఇటువంటి సంకట స్థితిని వివరించడానికి పై తెలుగు

సామెతలను ఉపయోగిస్తారు. దున్నపోతులు కుక్కలే కాకుండా కొందరు మానవులు కూడా ఇతర మానవులకు అడ్డుగా నిలుస్తారు. వారు ముందుకు సాగరు, ప్రక్కవారిని సాగనియ్యరు. వారు తినరు, వేరొకరిని తిననీయరు. వారు అభివృద్ధి చెందరు, ఇతరులను అభివృద్ధి చెందనీయరు. ఇటువంటి సందర్భాలలో ఈ తెలుగు సామెతలను వాడుతుంటారు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని బోధిస్తున్నది. కొందరు సుబోధ వినరు, వేరొకరిని విననీయరు. వారు స్వర్గంలో ప్రవేశింపరు, ఇతరులను ప్రవేశింపనియ్యరు. వారు మంచి పని చేయరు, చేసేవారిని చేయనియ్యరు. ఇటువంటివారి నైజాన్ని వివరించడంలో ఈ బైబులు సామెతను వాడతారు.

పిసినారి ధనం కూడబెట్టి తాను తినక, ఇతరులకు దానం చెయ్యక, దానిని నాశం చేస్తాడు. ఇక్కడ అడ్డుబండలుగా నిలచేవారు, వారు లోపలికి వెళ్ళరు, వేరొకరిని వెళ్ళనీయరు. వారు బాగుపడరు, ఎదుటివారిని బాగుపడనీయరు. ఈ భావాన్ని తెలుగు, బైబులు సామెతలు సమానంగా చాటి చెబుతున్నాయి.

## 8

తెలుగు సామెత : గాడిదకేమి తెలుసు గంధపు పొడి వాసన?

బైబులు సామెత : దుష్టులు మంచిని ఎట్లు మాట్లాడగలరు? (మత్తయి 12:34)

దాశరథి శతకాన్ని రచించిన గోపన్న (రామదాసు) 'సరసుని మానసంబు సరసజ్ఞుడెఱుంగును, ముష్కరాధముండెటిగి గ్రహించడెట్లు....'' అంటూ ఒకే కొలనులో నివాసమున్నా, కప్పకు కమలంలోని సువాసన, దానిలోని మకరందం రుచీ తెలియదనీ, ఎక్కడినుంచో వచ్చిన తుమ్మెద, ఆ కమలంలోని సౌరభాన్ని ఆఘ్రాణించి, మకరందాన్ని గ్రోలి పరవశానందాలు పొందుతుందనీ చెబుతాడు. సువాసనను గ్రహించే శక్తి మిళిందానికి ఉంది గాని కప్పకు లేదు. అలాగే గాడిదకు బరువులు మోయడం తెలుసు గాని గంధపు చెక్కల సౌరభం తెలియదు. అది గంధపు చెక్కల్ని మోసినా, వేపదూలాలు మోసినా బరువు సంగతి దానికి తెలుస్తుంది గానీ సువాసన సంగతి తెలియదు. "ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి" అని దీనికి సమాన భావం గల మరొక తెలుగు సామెత ఉంది. అంటే మంచిని గ్రహించడం మంచివారికే తెలుస్తుంది గానీ చెడ్డవారు మంచిని గుర్తింపలేరని దీని గూఢార్థం.

బైబులు సామెతలో కూడా ఇదే భావం స్ఫురిస్తుంది. “దుష్టులు మంచిని ఎట్లు మాట్లాడగలరు?” అనగా దుష్టులు దుష్టత్వాన్ని గ్రహిస్తారు గాని మంచితనాన్ని గ్రహించలేరని దీని భావం. మంచివాడు తన హృదయంలో ఉన్న మంచిననుసరించి మంచి మాటలే మాట్లాడతాడు. చెడ్డవాడు తన హృదయంలో ఉన్న చెడుననుసరించి, చెడ్డమాటలే మాట్లాడతాడు. వేపచెట్టు వేపకాయల్నే కాస్తుంది గాని మామిడి కాయలను కాయదు కదా. ఒక్క జల నుండే మంచినీరు, ఉప్పునీరు ఊరవు కదా.

‘చెప్పు తినెడి కుక్క చెఱకు తీపెరుగునా” అంటాడు వేమన. కనకపు సింహాసనం మీద కూర్చుండబెట్టి పట్టాభిషేకం చేసినా కుక్క తన సహజ గుణాన్ని మానుకోలేదు. అందుకే ప్రజాకవి వేమన “ఎంత చదువు చదివి ఎన్ని విన్నను గాని హీనుడవగుణంబు మానలేడు, బొగ్గుపాల గడుగ బోవునా మలినంబు” అంటాడు. గాడిదకు గంధపు చెక్కల వాసన తెలియనట్లే, దుష్టులకు మంచి మాటలు మాట్లాడడం తెలియదనేది నిర్వివాదాంశం.

## 9

తెలుగు సామెత : తాజెడ్డ కోతి వనమెల్లా చెరిచే

బైబులు సామెత : దుష్టుడు తోడివారిని మోసగించి అపమార్గము పట్టించును (సామెతలు 6:29)

సాధారణంగా కొందరు చెడు వ్యసనాలకు, దురలవాట్లకు బానిసలైపోతారు. వారు తాము ఊబిలో కూరుకుపోతున్నామన్న సంగతిని గుర్తించకుండా, ఇతరులను కూడా అందులోకి లాగే ప్రయత్నం చేస్తారు. ఆ అలవాట్లలో, వ్యసనాలలో ఎంతో సంతోషం ఉందనీ, ఎన్నో ఆస్తులు, సంపద కొద్ది కాలంలోనే సంపాదించవచ్చనీ ప్రలోభపెట్టి చుట్టూ ఉన్నవారిని, బంధుమిత్రులను కూడా ఈ రొంపిలోకి దించుతారు. ఆ మాటలు విని వారితో చేరినవారు కూడా కొద్ది రోజుల్లోనే శంకరగిరి మాన్యాలు పట్టిపోతారు. అందుకే మాయ మాటలను, కల్లబొల్లి కబుర్లను నమ్మవద్దని పెద్దలు హెచ్చరిస్తూనే ఉంటారు. తెలుగు సామెత ఈ విషయాన్ని పోలికతో చెబుతుంది. కోతి తాను చెడింది కాక వనములోని ఇతర కోతులను, వనాన్ని పూర్తిగా నాశం

చేసిన విధంగా దుష్టుడు కూడా తన పరిసరాలను, తోటివారిని కూడా చెరుస్తాడని దీని అర్థం. బహుశా దీనికీ లంకా దహనానికీ సంబంధముందేమో. తన తోకకు నిప్పు పెట్టిన లంకావాసుల వనాలను, నివాసాలను దహనం చేస్తాడు హనుమంతుడు. తన తోకకు నిప్పంటుకుంది, తాను చెడ్డానని ఇతరులకు కూడా నష్టాన్ని కలిగించాడు. ఏది ఏమైనా దుష్టుల విషయంలో జాగ్రత్తగా ఉండాలనే విషయాన్ని ఈ సామెతలు మనకు బోధిస్తున్నాయి.

ఇందుకు భిన్నంగా సజ్జన సాంగత్యం అత్యంత క్షేమదాయకం.

సహవాస ఫలం, సహవాస దోషం తప్పించుకోరానివి. మనకు తెలియకుండానే మన మిత్రుల ప్రభావానికి మనం లోనవుతుంటాము. మాట తీరూ తెన్నూ సహవాసుల కనుగుణంగా మలచబడుతూ ఉంటాయి. పైన చెప్పిన బైబిలు, తెలుగు సామెతలు రెంటిలోనూ దుష్ట సాంగత్యంలోని నష్టం గురించిన హెచ్చరికే ఉంది. ఒక్క మనిషి వలన వంశం, సామ్రాజ్యం ఉత్థాన పతనాలు చెందడం మన సాహిత్యంలో చూస్తూనే ఉన్నాము. “రాముడొకడు పుట్టి రవికులమీడేర్చె, కురుపతి జనియించి కులము జెరిచె” అని అందుకే అన్నారు. అందుకే

‘పాలను కలిసిన జలమును
చాల విధంబుననెయుండు బరికింపంగా
బాల చవి జెరుచు గావున
బాలసుడగు వాని పొందు వలదుర సుమతీ’ అని బద్దెన హితవు పలుకుతున్నాడు.

## 10

తెలుగు సామెత : తేలు వలె కుట్టి పోయినాడు

బైబులు సామెత : పొరుగువానిని నీ ఇంటికి కొనివత్తువేని అతడు తగవులు పెట్టి నీకును నీ కుటుంబమునకును మధ్య చీలికలు తెచ్చును (సామెతలు 7:14)

మానవులలో కొందరు చేయవలసిన పనిని చడీ చప్పుడు లేకుండా చేసుకుని పోతారు. ఇతరులకు చేయవలసిన హానిని, కీడును కూడా అత్యంత చాకచక్యంతో వారి బారిన పడేవారు కూడా గుర్తింపని రీతిలో చేసిపోతారు. తేలు కూడా తాను

చేయవలసిన పనిని మెల్లగా చేసుకొనిపోతుంది. చప్పుడు లేకుండా లోనికి వచ్చి కుట్టి చక్కా పోతుంది. దుష్టులు, కలహాలు రేపేవారు కూడా అంతే! మంచి కోరేవారిగా, ఆప్తులుగా చుట్టూ చేరతారు కొందరు. ఇంటిలో వ్యక్తులను పరిచయం చేసుకొని, ఇంటిలో వ్యక్తిలా కలిసిపోయి మెల్లగా ఒకరి గురించి మరొకరికి చెప్పడం ప్రారంభిస్తారు. ఒకరికొకరికి పోట్లాటలను పెట్టి చివరకు కుటుంబమే చీలిపోయేలా చేయగలరు ఇటువంటి పుణ్యాత్ములు. అలాటివారిని చూచి 'తేలులా కుట్టిపోయాడురా' అంటుంటారు. అటువంటివారిని గూర్చి హెచ్చరిస్తూ వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నాయి ఈ రెండు సామెతలు.

ఇటువంటివారిని ఉద్దేశించి వేమన

'హీన జాతివారి నిలు చేరనిచ్చెను
హాని వచ్చు నెంతవానికైన
ఈగ కడుపు జొచ్చి యిట్టట్ట జేయదా' అని అంటాడు.

## 11

తెలుగు సామెత : నక్కలు బొక్కలు వెదకును

బైబులు సామెత : దుష్టుడు మంచి పనులలో కూడ తప్పు పట్టును (సీరా 11:31)

'కుక్కలు చెప్పులు వెదకును' అనేది సమానార్థకమైన ఇంకొక తెలుగు సామెత. 'బొక్కలు' అనే పదంలో 'ధ్వని' ఉంది. కేవలం నక్కలకే అన్వయిస్తే, ఆ 'బొక్కలు', 'గుంటలు' అనే అర్థాన్నిస్తాయి. లేక నివసించే బొరియలు అనే అర్థాన్నిస్తాయి. ఆమాత్రానికి సామెత అవసరం లేదు. ఇది కుజనులనుద్దేశించి కూడా చెప్పిన సామెత. కుజనుల విషయంలో ఈ 'బొక్కలు' 'తప్పులు' అనే అర్థాన్నిస్తాయి. నక్కలు జిత్తులమారివి. ఎదుటివారిలోని మంచిని చూడలేవు. తమ స్వభావాలకు తగినట్లుగానే, లోపాలను వెదకుతుంటాయి. కుజనులు, అంటే నక్కవంటి స్వభావం గలవారు, నిరంతరం ఎదుటివారిలోని తప్పులు వెదకుతుంటారు. ఈ సందర్భాన్ని సమర్థవంతంగా వివరించడానికి పై తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత ఇదే భావాన్ని తెలియజేస్తున్నది. దుష్టునిలో దుష్ట స్వభావమే ఉంటుంది కనుక అతడు మంచి పనులలో కూడా తప్పులను, దోషాలనే వెదుకు తుంటాడు. ఋజుమార్గంలో ఆలోచించడం అతనికి చేతకాదు. 'దుష్టుడు తన దుష్టస్వభావాన్ని అనుసరించి దుర్విషయాలను తెలియజేస్తాడని' ఇంకొక బైబులు సామెత వాడుకలోకి వచ్చింది. ఈ బైబులు సామెత కూడా తెలుగు సామెతకు సమానమైన భావాన్నే తెలియజేస్తుంది.

దృష్టి మారితే అన్నీ మార్పుచెందుతాయి. దేనికైనా హృదయమే ఉనికిపట్టు. కాబట్టి మత్సరగ్రస్తులైన వారందరూ ఇదే భావాన్ని ప్రదర్శిస్తారు. కాగా 'నక్కలు బొక్కలు వెదకును' అనే తెలుగు సామెత, 'దుష్టుడు మంచి పనులలో కూడా తప్పు పట్టును' అనే బైబులు సామెత సమతుల్యమైనవి.

## 12

తెలుగు సామెత : పాలుపోసి పెంచినా పాము కరవక మానదు

బైబులు సామెత : దుష్టులకు దయచూపినా వారు నీతిని నేర్చుకొనరు
(యెషయా 26:10)

బొగ్గును పాలతో కడిగినా నలుపు పోదు. ఎలుక తోలును ఎందాక ఉదికినా తెలుపు రాదు. ఇవి స్వాభావికంగా వచ్చిన శాశ్వత గుణాలు. అదే విధంగా పాము విషపూరితమైనది. ఇతరులను కరిచి గాయపరచడమే దాని సహజ స్వభావం. దుష్టునికి ఎంత మేలు చేసినా మనకు కీడే చేస్తాడు తప్ప మేలు చేయడు. ఈ భావాన్ని వివరించడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

'విద్యచే భూషితుండయి వెలయుచున్న, తొడరి వర్జింపనగు సుమీ దుర్జనుండు,
చారుమాణిక్యభూషిత శస్తమస్తకంబైన పన్నగము భయంకరము కాదే'

అంటాడు భర్తృహరి భావాలను తెలుగులో వెలయించిన ఏనుగు లక్ష్మణ కవి. కాపువాడు, పాము కథ ఒకటుంది. ఒక కాపు సాయంకాలం పూట పొలానికి పోతాడు. వర్షం, చలిగాలి! అయినా పొలాన్ని చూచి రావడానికి వెళ్ళాడు. అక్కడొక పాము చలికి వణకుతూ బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో ఉంది. పాపం, కాపువానికి జాలివేసి, పామును తెచ్చి తన ఇంట్లో పెట్టుకున్నాడు. పాలు పోసి పెంచాడు. పాము

కోలుకుంది. అదను చూచి కాపువానిని కాటువేసింది! ఇదీ పాముకుండే నైజం. అందుకే పామును పాలుపోసి పెంచినా కరవక మానదనే తెలుగు సామెత ప్రయోగం అర్థవంతమైనది.

బైబులు సామెత కూడా దుష్టులను గూర్చి, అంటే పామువంటి ప్రమాదభరిత గుణాలు గలవారిని గూర్చి చెబుతున్నది. దుష్టులకు దయచూపి, వారికి నీతి బోధ చేసినా వారు దానిని పెడచెవిని పెడతారు. నీతిని గ్రహింపరు. దుష్టత్వాన్నే ప్రదర్శిస్తారు. దుష్టుడు విద్యావంతుడయినా, పాము పడగ మీద మణులున్నా మానవులు దరిజేరనీయరు. ఎందుకంటే ప్రమాదం గనుక. దుష్టులను ధర్మక్షేత్రంలో నిలువబెట్టినా వారు అధర్మాలే చేస్తారని బైబులు సామెత వివరిస్తుంది. పాము పాలు తాగడం వల్ల దానిలోని విషమూ, విషబుద్ధులూ అంతరించవు. దుష్టులకు దయచూపి నీతిని బోధించినా వారిలో ఉన్న అవినీతి, అధర్మం తొలగిపోవు. తెలుగు, బైబులు సామెతలు రెండూ ఇదే అర్థాన్ని ఎలుగెత్తి చాటుతున్నాయి.

## 13

తెలుగు సామెత : పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గానీ పోదు

బైబులు సామెత : చెడ్డవారు చనిపోవు వరకు చెడ్డవారుగానే ఉందురు (సీరా 11:16)

జన్మతః అబ్బిన గుణగణాలకు విద్య చేత సంస్కారం చేత గురువునాశ్రయించుట చేత కొంతవరకు పదును పెట్టుకోవచ్చు గానీ స్థూలంగా మనిషి తన సహజ నైజానికి విరుద్ధంగా పరివర్తనం చెందడం అసాధ్యమన్న సార్వత్రిక సత్యాన్ని ఈ సామెతలు రెండూ సమర్థిస్తున్నాయి.

‘లెక్కలేని యాశ లీలమైయుండగా

తిక్క యెత్తి నరుడు తిరుగుగాక

కుక్కవంటి మనసు కూర్చుండనిచ్చునా’

ఉన్మాదం తిక్క మౌఢ్యం పొగరు వంటి తామస గుణాలు సాధారణ పరిస్థితుల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్నప్పటికీ సమయము వచ్చినప్పుడు ప్రకోపిస్తాయి.

‘దొబ్బనేర్చు కుక్క దుత్తలు మోచునా.’ కుక్క వంటింటిలో ప్రవేశించి కుండలో మూతి పెడుతుంది. కానీ, చక్కగా పాత్రను మోసుకొనివస్తుందా? కుక్కనే సాదృశ్యంగా చేసుకుని వేమన కాముకురాలి హీన గుణాన్ని ఎత్తి చూపాడు:

‘మగడు తప్పులేక మనసిచ్చియున్నను
సహజ గుణము విడదు జారకాంత
పిండితిన్న కుక్క పీతికాశింపదో’

సహజంగా మదమాత్సర్యాలు గలవారికి తమ దుర్గుణాలు ప్రదర్శించడానికి కారణమవసరం లేదు. మగడు మన్మథుడైనా సదాచారియైనా చెడిన ఆడుది తాను రంకులు మానదు.

మరణించి చితిపై కాలినప్పుడు గానీ హీనుని అవగుణం మాసిపోదు.

## వాక్శుద్ధి, వాచాలత్వం

**1**

తెలుగు సామెత : అటుకులు బొక్కే నోరు, ఆడిపోసుకునే నోరు ఊరుకోవు

బైబులు సామెత : అజ్ఞాని ఆలోచన లేక నోటికి వచ్చినట్లు వదరును (సీరా 21:26)
నోటిని, నాలుకను భద్రము చేసుకొనువాడు శ్రమల నుండి తన ప్రాణమును కాపాడుకొనును (సామెతలు 21:23)

ఒక పనికి అలవాటు పడినవాడు అవసరమున్నా, లేకున్నా ఆ పనిని విడువకుండా చేస్తూ ఉంటాడు. అది చూచేవారికి విసుగును పుట్టిస్తున్నా తన అలవాటును అతడు మానుకోడు. తెలుగు సామెతలోని అటుకులు బొక్కే నోరు, ఆడిపోసుకునే నోరు అలాంటివే! దీనికి సమానార్థకంగా ‘తిట్టే నోరు, తిరిగే కాలు ఊరుకోవు’ అని మరొక తెలుగు సామెతను కూడా ఉపయోగిస్తారు.

నిరంతరాయంగా పనిచేస్తూ ఉండడం మంచి లక్షణమే. అయితే అనవసరమైన పనులు, విసుగు పుట్టించే పనులు జీవితాలకు అపాయం తెచ్చే పనులు చేస్తూ ఉండడం మంచిది కాదు. అటుకులు బొక్కడమంటే తిండికి అలవాటు పడడం. తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందని మరొక తెలుగు సామెత! ఈ తినమరిగినవాడు తన అలవాటును ఎట్టి పరిస్థితుల్లోనూ మానుకోలేడు. ఈనాడు లంచాలు ముట్టనివారు లేరంటే అది అతిశయోక్తి కాదేమో. ఈ తినమరిగినవాడు గాదె క్రింది పందికొక్కుల్లా

బొక్కీ బొక్కీ ఎదుటివారిని నాశనం చెయ్యడమే కాకుండా, కొన్నిమార్లు తామే అపాయాలలో పడిపోతారు. ఆడిపోసుకునే నోరూ అంతే. అయినదానికీ, కానిదానికీ ఇతరులను నిరంతరం ఆడిపోసుకుంటూ ఉంటారు. తమ విషయాలు మరచిపోయి 'గురివిందగింజ తన నలుపెరుగదన్న' సామెతగా ఎప్పుడూ ఎదుటివాళ్ళను ఆడిపోసు కుంటూ, విమర్శిస్తూ, తూలనాడుతూ ఉంటారు. దీనిలో నిజానిజాలు వారికనవసరం. ఆడిపోసుకుంటూ, విభేదాలు పుట్టించడమే వారికి ఆనందం. ఈ అటుకులు బొక్కే నోరు, ఆడిపోసుకునే నోరు ఎప్పుడూ ఊరుకోవు. 'పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోద'న్నట్టు జీవితాంతందాకా ఈ నోళ్ళు బొక్కుతూ, ఆడిపోసుకుంటూనే ఉంటాయి.

ఇది చాలా దోషపూరితమైన గుణం. తమకు, సమాజానికి కూడా చేటుతెచ్చే ఈ గుణం కలహాలకు, కష్టాలకు కారణమౌతుంది. బొక్కడమంటే అటుకులు తనవైతే బాధ లేదు. ఈ బొక్కే గుణం ఉన్నవాడు అందరి సొమ్మునూ బొక్కుతాడు. ఏమన్నా చెప్పి చూద్దామా అంటే ఆడిపోసుకుంటాడు. ఇదే కలహాలకు, కక్షలకు కారణమౌతుంది. విభేదాల వల్ల సమాజం చెడిపోతుంది. కాబట్టి ఈ బొక్కే నోటిని, ఆడిపోసుకునే నోటిని అదుపు చెయ్యడం ఎంతైనా అవసరం.

బైబులు సామెతలో నోటికి వచ్చినట్లు వాగేవాడిని అజ్ఞానిగా సూచించారు. జ్ఞానం లేనివాడు తన ఇష్టానుసారం మాట్లాడి తనకు, ఎదుటివారికి కూడా చేటు తెస్తాడు. 'విస్తారమైన మాటలతో దోషముండక మానదు' అని బైబులులోని మరొక సామెత. నోటిని, నాలుకను భద్రం చేసుకోకపోతే అదుపులో ఉంచుకోకపోతే శ్రమలు కొనితెచ్చుకున్నట్లేనని మరొక బైబులు సామెత. ఆలోచన లేకుండా నిరంతరం మాట్లాడడం అనారోగ్యకరమైన, అపాయకరమైన పని. అందుకే "సుభాషిత రత్నావళి'లో 'మౌనమే భూషణము మూఢ మావులకు" అంటాడు భర్తృహరి. సమయోచితంగా, మితంగా మాటలాడాలి. అడ్డూ అదుపూ లేకుండా మాటలాడడం, అనుచితాలు మాటలాడడం, అపాయకరం. బైబులు సామెతలలో 'సమయోచితంగా పలికే మాట, చిత్రమైన వెండి పళ్లెంలో ఉంచిన బంగారు పండ్ల వంటిది' అని కూడా ఉంది (సామెతలు 25:11). కాబట్టి అనాలోచితంగా, అజ్ఞానిలాగా మాట్లాడడం అవివేకం. అలాంటివారిని ఎవ్వరూ ఎట్టి పరిస్థితులలోను ఆపలేరు, రక్షింపనూ లేరు. అందుకే బైబులు సామెతలో అలాంటివారిని అజ్ఞానులన్నారు. బుద్ధిహీనుడు జ్ఞానాన్ని అసహ్యించుకుంటాడు.

## 2

తెలుగు సామెత : ఆడదాని నోట నువ్వు గింజ నానదు

బైబులు సామెత : వాచాలుడు రహస్యమును దాచలేడు (సామెతలు 20:19)

ఈ సామెతల్లోని ప్రధాన ప్రతిపాదన అతి వాగుడు, అదే సమయంలో దాచవలసినదేదో, బహిర్గతం చెయ్యవలసిందేదో వివేచించలేని అధిక ప్రసంగ ధోరణి. తెలుగు సామెతలో స్త్రీ వాచలత్వం గురించి ఉన్నది. బైబులు సామెతలో వాచాలుని గురించి ఉన్నది.

నిజానికి అతివలు దేనికైనా సమర్థులు. భూమిని తలక్రిందులు చేయగలిగిన మర్మాన్ని కడుపులో దాచుకొని గుంభనంగానూ ఉండగలరు, నిప్పు లేకుండానే పొగ వచ్చిన చందాన అమ్మలక్కల ముచ్చట్లలో అక్కడా ఇక్కడా విన్నవాటిని ఆరబోయనూగలరు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ బుద్ధి చాపల్యాన్ని ఈసడిస్తూ పుట్టిన సామెత ఇది. అలాగని వసబోసిన పిట్టలు మగమహారాజుల్లో ఉండరని కాదు. స్త్రీ వాచాలత్వాన్ని అలా ఉంచి తెలుగు, బైబులు సామెతలు రెండిటిలోనూ ఉన్న ముఖ్య ప్రతిపాదన రహస్యాలు దాచగలగడం. చనువు ఉండి నిరాటంకంగా రాకపోకలు ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక సమయంలో 'నేను అన్నానని ఎక్కడా అనకు. నీలోనే ఉంచుకో' అనే ఉపోద్ఘాతంతో ఇలాటి రహస్యాలు బట్టబయలు అవుతుండడం అతి సామాన్యం. కాని మాట పెదవి దాటితే గడప దాటినట్టే అనే లోకోక్తి కూడా ఉంది.

ఒక మనిషిని నమ్మి హృదయ భారం దించుకొనేందుకు మనసులో మాట చెప్పుకోవాలనుకొంటారు కొందరు బాధితులు. అలా అన్న విషయాలను సానుభూతితో విని తమలో నిక్షిప్తం చేసుకోగలిగినవారే విజ్ఞులు.

నువ్వు గింజ చాలా స్వల్పమైన తృణధాన్యం. అది నానడానికి ఎక్కువ సమయం పట్టదు. అంటే ఆడవారు నువ్వు గింజ నానడానికి పట్టేంత సమయం కూడా రహస్యాన్ని దాచలేరని చెప్పడం. తెలుగు సామెత ఈ బలహీనతను ఆడవారికి ఆపాదిస్తుండగా, బైబిలు సామెత దీనిని మగవారికి ఆపాదిస్తున్నది. ఏది ఏమైనా 'విస్తారమైన మాటలతో దోషముండక మానదు' అనేది బైబులు సూక్తి. మితభాషణం, ప్రియ భాషణం, ఇతరుల రహస్యాలను కాపాడడం బుద్ధిమంతుల లక్షణం.

## 3

తెలుగు సామెత : ఎముక లేని నాలుక ఏమయినా పలుకుతుంది

బైబులు సామెత : కొరడా దెబ్బ ఒడలిమీద బొబ్బలు పొక్కించును. కాని దుష్టుని జిహ్వ ఎముకలను కూడా విరుగగొట్టును (సీరా 28:17)

'నరము లేని నాలుక నానా విధములుగా పలుకుతుంది' అనే ఇంకొక సామెత ఈ తెలుగు సామెతకు సమానార్థకంగా ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. కాళ్ళు, చేతులు లాంటి శరీర భాగాలలో ఎముకలుంటాయి. అందువలన వీటి చలన మార్గంలో కూడా ఒక పద్ధతి ఉంటుంది. ఎటుబడితే అటు ఇవి తిరుగవు. నాలుక ఆ విధంగా కాకుండా, ఎముక లేనిదిగా నరం లేనిదిగా ఎటయినా తిరుగుతుంది. అంటే స్థిరత్వం లేనిది. ఏమయినా మాట్లాడుతుంది. నీతి నియమాలు లేకుండా విచ్చలవిడిగా మాట్లాడేవాణ్ణి గురించి అలా మాటలాడి ఇతరులను నొప్పించే వారి గురించి చెప్పవలసి వచ్చినపుడు ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని తెలుపుతుంది. కొరడా దెబ్బలు, కత్తులు, కట్టెలు శరీరాన్ని మాత్రమే బాధిస్తాయి. అయితే దుష్టుని జిహ్వ (నాలుక) మనస్సును, సర్వేంద్రియాలను నాశం చేస్తుందని ఈ బైబులు సామెత వివరిస్తుంది. ఒక విధంగా పరిశీలిస్తే కొరడాలు, కత్తుల కంటే ఇటువంటి దుష్టుని మాట, ఎముక లేని నాలుక పలికే మాట మిక్కిలి ప్రమాదకరమని ఈ సామెతలలోని గూఢార్థం. 'నాలుక అగ్ని వంటిదని, దానిని ఎవరూ సాధుపరచజాలర'ని ఇంకొక బైబులు సామెత వివరిస్తుంది.

అందుకే వేమన 'ఇనుము విరిగెనేని ఇరుమారు ముమ్మారు, కాల్చియతకనేర్చు కమ్మరీడు, మనసు విరిగెనేని మరి యంటనేర్చునా?' అంటాడు. కనుక విచ్చలవిడిగా అనాలోచితంగా మాట్లాడే మాటలు క్రమశిక్షణా రాహిత్యంతో కలహాలు పుట్టించే వారి మాటలు మిక్కిలి ప్రమాదకరాలని ఈ బైబులు, తెలుగు సామెతలు తెలియ జేస్తున్నాయి. పశుపక్ష్యాదులను సమస్తాన్ని మానవుడు స్వాధీనంలో ఉంచుకున్నాడు గాని, తన నాలుకను అంటే తనను తాను అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు. అదే భావం ఈ రెండు సామెతలలో కనిపిస్తుంది.

# 4

తెలుగు సామెత : కాలుజారితే తీసుకోవచ్చు గాని నోరు జారితే తీసుకోలేము

బైబులు సామెత : రాతి నేల మీద జారుట కంటే నోరు జారుట హానికరము (సీరా 20:18)

తన నోరు కాచుకొనువాడు తన్ను కాపాడుకొనును, ఊరకొనక మాటలాడువాడు తనకు నాశనము తెచ్చుకొనును (సామెతలు 13:3)

నాలుక తెచ్చిపెట్టు చావు ఘోరమైనది. నాలుక కంటే పాతాళ లోకము మెరుగు (సీరా 28:21)

నడుస్తూ ఉన్నప్పుడు రాయి తగిలి, లేక పరధ్యానంగా వెళ్ళుతున్నప్పుడు, ఏదైనా అడ్డం వచ్చినపుడు, వేయరానిచోట కాలు వేసినప్పుడు పాదం జారుతుంది. దాన్ని చూచి ఎవరైనా పడకుండా పట్టుకొని సాయం చెయ్యడానికి ప్రయత్నిస్తారు. ఇది సర్వసాధారణం.

నోరు జారడమంటే అనరాని మాటలు అనడం. హద్దుమీరి తూలనాడడం. మాట గాలిలో కలిస్తే, అంటే మనం ఒక మాటను పలికితే దాన్ని తిరిగి తీసుకోలేం. దాని ప్రభావం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. కాలుజారడం లాంటిది కాదు మాట జారడం. కాలు జారితే సరిచేసుకొని, లేక పడిపోయి లేచి నడవవచ్చు. నోరు జారడం గాలిలో విడిచిపెట్టిన భావం. నయం చేసుకోలేని గాయం! అందుకే మాట మనలో ఉన్నంత కాలం అది మన ఆధీనంలో ఉంటుంది. బయటికి జారితే అది మనమీద తిరగబడుతుంది అని అంటారు పెద్దలు.

ప్రతివారూ నాలుకను (నోటి మాటలను) జాగ్రత్తగా చూచుకోవాలి. దావీదు కీర్తనలలో నాలుకను గూర్చిన హెచ్చరికలు, సామెతలు చాలా ఉన్నాయి. దావీదు కీర్తన 34:13 లో "చెడ్డమాటలు పలుకకుండా నీ నాలుకను కఠినమైన మాటలు పలుకకుండ నీ పెదవులను కాచుకొనుము" అని ఉంది. కపటమైన నాలుక గలవారిని దేవుడు నాశనం చేస్తాడని, తన నివాసంలో నుండి, సజీవుల దేశంలో నుండి ఆయన వారిని నిర్మూలిస్తాడని కీర్తన 52:4,5 వచనాలు వివరిస్తాయి. కల్లలాడు నాలుక

సర్వేశ్వరునికి హేయమైనదని సామెతలు 6:17 లో ఉంది. జీవ మరణాలు నాలుక వశంలో ఉన్నాయని సామెతలలో ఉంది. భక్తులెందరో నోటి మాటలను గూర్చి వివరించారు. మృగ, పక్షి, సర్పజాతులను మానవులు స్వాధీనం చేసుకొని ఏలగలుగుతున్నారు. అయితే చిన్ని అవయవమైన నాలుకను మానవుడు అదుపులో ఉంచుకోలేకపోతున్నాడు. తన నాలుకను, అంటే తనను తాను అదుపులో ఉంచుకునేవాడు కోటలను స్వాధీనపరచుకునే వీరయోధునితో సమానుడు. నాలుకను గూర్చి అంటే నోటి మాటలను గూర్చి యాకోబు పత్రిక 3:6–12 వరకు పరిశీలిస్తే నాలుక (నోటి మాటలు) ఎంత కీడు చేస్తుందో తెలుసుకోవచ్చు. "నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వ శరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును. మృగ, పక్షి, సర్ప జలచరములలో ప్రతి జాతియు నరజాతి చేత సాధుకాజాలును. కాని ఏ నరుడును నాలుకను సాధుచేయనేరడు. అది మరణకరమైన విషముతో నిండినది. అది నిరర్గళమైన దుష్టత్వమే. . ." అని ఉంది. నాలుకతోనే దేవుని స్తుతిస్తూ, ఆ నాలుకతోనే దేవుని పోలికగా పుట్టిన మనష్యులను దూషిస్తారు. ఒక్క జల నుండే చేదు నీరు, తీపి నీరు ఊరవు కదా! అదే విధంగా ఒక్క నాలుకతోనే స్తోత్ర గీతాలు, శాపనార్థాలు రావడం మంచిది కాదని బైబులు ప్రబోధం.

"నరుని నాలికకు నరం లేదు" అంటుంది ఇంకొక తెలుగు సామెత. అది ఎన్ని రకాలుగానైనా తిరుగుతుంది, మాట్లాడుతుంది. రెండు నాలుకలవాడు అంటే మాట మీద నిలబడకుండా, మాట తప్పుతూ తప్పించుకు తిరిగేవాడు. అటు బైబులు జన సంస్కృతిలోనూ, ఇటు మన తెలుగువారిలోను నాలుకను అదుపులో ఉంచుకోలేని వారి పట్ల నిరసన భావం ఏకగ్రీవమయింది. బైబులు సామెత ఇంకొంచెం ముందుకు వెళ్ళి నాలుక చావును కొనితెస్తుందనీ, పాతాళానికి దారితీస్తుందనీ కూడా హెచ్చరిస్తున్నది.

**5**

తెలుగు సామెత : జిహ్వచేత నరులు చిక్కి నొచ్చిరి గదా

బైబులు సామెత : మూఢుని పలుకులు నాశమును తెచ్చును, అతని మాటలే అతనికి ఉరులగును (సామెతలు 18:7)

నవ్వు నాలుగందాల చేటు అన్నారు గానీ వాచాలత్వం వేయి రకాల చేటు అన్నది అక్షరసత్యం. నోటికి అదుపులేక పిచ్చి ప్రేలాపనలతో శివమెత్తేవాడికి అందరూ దూరంగా ఉంటారు. అలాటివాడు తన చావును తానే నెత్తిమీదికి తెచ్చిపెట్టుకుంటాడని ఈ సామెతలు చెబుతున్నాయి.

వాసుదేవునికి సాదరంగా ధర్మనందనుడు తన రాజసూయంలో అగ్రాసనాధిపత్య మిచ్చాడు. శిశుపాలుడది చూచి కుపితుడై దుర్భాషలతో శౌరిపై అధిక్షేపాలు అవహేళనలు కురిపించాడు. కూడివచ్చిన రాజులు వారించినా వినలేదు. మేనత్త సాత్వతికి ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులు మన్నించి ఆపైని సుదర్శనంతో శిరచ్ఛేదనం గావించాడు శ్రీకృష్ణుడు.

మాటలే ఉరులైనాయన్న బైబులు సామెతకు ఈ వృత్తాంతం అద్దం పడుతుంది : దావీదు రాజు ధృతి చెడి వనవాసానికేగే సమయంలో షిమీ అనే పనికిమాలినవాడు పరిపరి విధాల దూరుతూ దుమ్మెత్తిపోశాడు. దావీదు సంయమనంతో వ్యవహరించి అతనికేమీ హాని కలుగకుండా ప్రస్తుతానికి తనవారిని వారించినా, ఆ తరువాతి కాలంలో ఆ వాచాలత్వానికి అతనికి చావు తప్పి కన్నులొట్టపోయింది (సమూవేలు 2వ గ్రంథము 16:5-14; 19:16-24).

స్వశక్తి ప్రతాపాలు సరకు చేయకుండా శత్రువును తూలనాడే వదరుబోతులు మాటలు కోటలు దాటితే చాలనుకుంటారు. లేని ప్రతిభాపాటవాలను తెచ్చిపెట్టుకొని మాటలు గుప్పించి, పుణ్యకాలం వచ్చేసరికి చతికిల పడడం భీరువుల లక్షణం. అతడు పలికిన మాటలే అతని పాలిట యమపాశాలౌతాయి.

ముందు వెనుకలాలోచింపక ప్రేలరి పలికే పలుకులు శతకోటి అనర్థదాయ కాలన్నది జగమెరిగిన సత్యం. విచక్షణ తప్పిన వాక్కే అల్లకల్లోలానికి మూల కారణమవు తుంది. దీనినే ఈ సామెతలు వివరిస్తున్నాయి.

## 6

తెలుగు సామెత : తలుపుకి గొళ్లెం నోటికి కళ్లెం ఉండాలి

బైబులు సామెత : నీ పొలమునకు ముళ్లకంచె వేసుకొనునట్లే నీ నోటికి తలుపు పెట్టి గడి బిగింపుము (సీరా 28:24-25)

తలుపు అనేది భద్రత కోసం. ఎవరైనా వచ్చి నెడితే తెరుచుకునే తలుపు నిష్ప్రయోజనకరం. గొళ్లెముంటే దానికి తాళం వేసుకొని సురక్షితంగా ఉండవచ్చు. అస్మదీయులకు ప్రవేశం, అన్యులకు నిషేధం వీలవుతుంది. పొలం చుట్టూ వేసుకునే కంచె కూడా ఇందుకోసమే. యదేచ్ఛగా ఎవరుబడితే వారు, ఏదిబడితే అది చొరబడకుండా నియంత్రణ కంచె వల్లనే సాధ్యం. తెలుగు సామెత తలుపు గొళ్లేన్నీ, బైబులు సామెత క్షేత్రం చుట్టూ ముళ్ల కంచెనూ సాదృశ్యాలుగా ఉపయోగించి మానవుడు తానాడే మాటలను నియంత్రించుకోవాలనే నీతి బోధను గరుపుతున్నాయి.

‘మాటల మూటలు వచ్చును
మాటలచే కలుగుచుండు మణిమంత్రంబుల్
మాటలు పొందిక తెలిసిన
మాటలచే ముక్తికలుగు మహిలో వేమా’

నిజం మాట్లాడితే మనుషులకు నచ్చదు, అబద్ధాలు చెప్పడం ఇష్టం లేదు. అందుకే ఉత్తములు మౌనులౌతారు. ఎలాటి పంచకళ్యాణి అశ్వాన్నైనా అదుపులోకి తెచ్చుకోవచ్చు గానీ నాలుకను అదుపు చేయడం దుస్సాధ్యం. నోటికి కళ్లెమని తెలుగు సామెతలో ఉన్న పదబంధం గుర్రంనోట కళ్లెం సంధించి మన చిత్తప్రకారం పరుగులెత్తించవచ్చన్న సంగతిని స్ఫురింపజేస్తూ మనిషి నోటికి కూడా కళ్లెం ఉండాలని బోధిస్తున్నది.

బైబులు సామెత కూడా ఇదే సందర్భాన్ని, ఇదే విషయాన్ని తెలుపుతుంది. చేనికి కంచె వేసుకున్నట్లే, నోటికి కళ్ళెం వేసుకోవాలని తెలియజేస్తున్నది. విచ్చలవిడిగా, యదేచ్ఛగా మాటలాడవద్దని బోధిస్తున్నది. పై రెండు సామెతలూ విచక్షణా రహితమైన సంభాషణను గర్హిస్తున్నాయి. వేమన అన్నట్టు ‘మాటలుడుగకున్న మంత్రంబు దొరకదు.’ మితంగా మాట్లాడుతూ, కాంతా సమ్మిత భాషణంతో ఇంపైన పలుకులతో హద్దులెరిగి వర్తించే వ్యక్తి యోగ్యుడు.

## 7

తెలుగు సామెత : నాలుక దాటితే నరకము

బైబులు సామెత : నాలుక కంటే పాతాళ లోకము మెరుగు (సీరా 28:21)

'కాలు జారితే తీసుకోవచ్చు గానీ నోరుజారితే తీయలేము' అనేది కూడా ఇదే అర్థాన్ని తెలియజేసే మరొక తెలుగు సామెత. అనాలోచితంగా, స్థానాస్థాన వివేచనం లేకుండా, నిజానిజాలు తెలియకుండా చిన్నాపెద్దా లేకుండా విచ్చలవిడిగా మాటలాడేవారిని గూర్చి, అటువంటి సందర్భాన్ని గూర్చి వివరించేటప్పుడు ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. ఒక మాట మన అదుపులో (మనస్సులో) ఉన్నంత వరకు అది మన అదుపులో ఉన్నట్లే. అయితే అది నాలుక దాటితే, మనమీద ఎదురు తిరిగి నరకాన్ని సృష్టిస్తుంది. అశాంతిని రేకెత్తిస్తుంది. శత్రువులను సృష్టిస్తుంది. అసూయా ద్వేషాలను వెళ్లగ్రక్కుతుంది. ఇటువంటి సమయాల్లో 'నాలుక దాటితే నరకము' అనే ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా దీనినే తెలియజేస్తున్నది. నాలుకను స్వాధీనపరచుకోలేకపోతే, సాధుపరచలేకపోతే అది మృత్యు గహ్వరమవుతుంది. నాలుకను అదుపులో పెట్టుకొనువాడు, కోటలను జయించిన వానితో సమానుడని, నాలుక దహించు అగ్నివంటిదని మరికొన్ని బైబులు సామెతలు వివరిస్తున్నాయి. కాగా తెలుగు సామెతలోని భావార్థాలనే బైబులు సామెత కూడా తెలియజేస్తుంది. ఈ రెండూ సమానార్థకాలే.

ఏ సూక్తి చెప్పినా తనను తాను అదుపులో పెట్టుకున్నవాడే గొప్పవాడని చెబుతుంది. ఎక్కువగా మాట్లాడువాడు చిక్కులలో పడతాడు. అధికంగా మాట్లాడితే ఎక్కువ దోషాలు దొర్లుతాయి. అదుపు తప్పితే గుఱ్ఱం రౌతును పడవేస్తుంది, పాడితప్పితే మాట మనుజుని పాతాళంలోనికి తోసివేస్తుంది. ఇదే భావాలను పై తెలుగు, బైబులు సామెతలు తెలియజేస్తున్నాయి.

## 8

తెలుగు సామెత : నోరు మంచిదైతే ఊరి మంచిదౌను

బైబులు సామెత : నాలుకను బట్టియే నరుని జీవితముండును (సామెతలు 18:21)

నాలుక శరీరవయవాలలో చిన్నది. అయితే దానికన్నా ప్రమాదకరమైన అంగం వేరొకటి లేదు. హత్యలు చేసేవారు కత్తులు, ఇతర మారణాయుధాలు ఉపయోగిస్తారు.

కానీ మనిషిని నిలువునా ప్రాణాలు తీయడానికి ఒక్క క్రుంగదీసే మాట చాలు. కర్ణాకర్ణిగా వినబడే నీలాపనిందలు, ఆరోపణలు ఎటునుండో ఎగిరి వచ్చి గుండెల్లో గుచ్చుకునే బాణాల వంటివి. ఆ మాట ఎవరన్నారో తెలియకుండానే ఊరంతా కార్చిచ్చు రేపుతుంది.

నాలుక మూలంగా కలిగే ఇక్కట్లు రాజ్యాలకు, నగరాలకు, గ్రామాలకు చేసే కీడు ఒక ఎత్తు అయితే నాలుకను అదుపు చేసుకోలేక మనిషి పడే పాట్లు, ఇతరులకు కలిగించే హానీ మరొక ఎత్తు. కొందరు అదే పనిగా ఇల్లిల్లూ తిరిగి లేనిపోని నీలివార్తలు చేరవేస్తుంటారు. ఈ కళలో ఆరితేరినవారు శ్రోతల మనసుల్లో అనుమాన, విద్వేష బీజాలు చల్లి చక్కాపోతారు. చిచ్చు రేగుతుంది.

బైబులు సామెత, తెలుగు సామెతా కూడా ముఖ్యంగా నాలుక మూలంగా హాని, అపఖ్యాతీ మూటగట్టుకోవడాన్నే ప్రతిపాదిస్తున్నాయి. ఈ వేళ గాకుంటే రేపయినా ఇలాటి తంటాలమారిని ప్రజానీకం పసిగట్టకపోరు. ఒకరి మీద ఒకరికి చాడీలు చెబితే దానికి అతి సరళమైన పరిష్కారం ఆ ఇద్దరు వ్యక్తులు ఎదురుపడి 'నీవిలా అన్నావా?' అని పరిష్కారంగా తెలుసుకోవడమే. మబ్బులు వీడిపోయి తమ ఇద్దరి మధ్య అపార్థాలు సృష్టించినవాడి అసలు రంగు తేటతెల్లమవుతుంది. కుటుంబాలలో, గ్రామాలలో సాధారణంగా ఇలా కొండేలు ప్రచారం చేసేవారెవరో అందరికీ తెలిసే ఉంటుంది. అలాటివారి విషయంలో కొంత జాగ్రత్తగా ఉండడం కూడా అభ్యాసం చేస్తారు. అలాటివారిని పూర్తిగా నమ్మరు. ఏ సంగతీ వారికి తెలియనీయకుండా జాగ్రత్తపడతారు.

దీనికి భిన్నంగా ముత్యాల వంటి మాటలు సమయోచితంగా మేలు కలిగించే సుద్దులు, ఆప్యాయత ఉట్టిపడే మధురోక్తులు పలికే వారిని ఊరంతా సన్మానిస్తారు. అన్ని సందర్భాలకు వారిని ఆహ్వానిస్తుంటారు. నోరు మంచిదైతే ఊరు కూడా మంచిగానే ఉంటుంది. బైబులు సామెత ప్రకారం ఒక మనిషి సంభాషణను బట్టే అతని జీవితం కూడా ఉంటుంది.

# 9

తెలుగు సామెత : మంచివాడు మాట్లాడినదే మందు

బైబులు సామెత : బుద్ధిమంతుల పలుకులు మందువలె మేలు చేయును (సామెతలు 12:18)

'సర్వేజనాస్సుఖినోభవంతు' అనేది విశ్వజనీనమైన కోరిక. అందరూ సుఖంగా ఉండాలనే ఆకాంక్ష అందరిలోనూ ఉండాలి. అటువంటి భావన కలవారు ఆదరాభిమానాలతో మాట్లాడుతారు. అటువంటి మాటలు అమృతంతో సమానాలు. 'ఉదార చరితనాం తు వసుధైవ కుటుంబకం' అనే సూక్తి కూడా ఇదే భావాన్నిస్తుంది. ఈ ప్రపంచమంతా ఒక కుటుంబం, ఈ ప్రజలంతా నావారు అనే ఆత్మీయత ఉన్నవాడు మధురమైన మంచి మాటలు మాట్లాడతాడు. ఆ మాటలు దివ్యౌషధంలా పనిచేసి మానసిక, శారీరక రుగ్మతలను మటుమాయం చేస్తాయి. ఆ మంచి మనుజులను, వారి మంచి మాటలను వర్ణింపవలసి వచ్చినపుడు పైని చెప్పిన తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని తెలియజేస్తుంది. బుద్ధిమంతుల పలుకులు మందువలె పనిచేసి, మానవులకు మేలు చేస్తాయని వివరిస్తుంది. జ్ఞానుల మాటలు మనస్సును తెప్పరిల్లజేస్తాయని మరొక బైబులు సామెత వివరిస్తుంది. బుద్ధిమంతుని మాటలు తన పొరుగువారికి, మిత్రులకు, ఆ మాటకొస్తే సమస్త ప్రపంచానికీ మేలు చేస్తాయి. ఇందులో కూడా విశ్వజనీనత చోటుచేసుకుంది. సంకుచిత భావాలను విడిచిపెట్టి విశాల దృక్పథాన్ని అలవరచుకున్నపుడు మంచి బుద్ధి, విజ్ఞానాలు లభిస్తాయి. అప్పుడు మంచి మాటలే నోటికి వస్తాయి. అవే అందరికీ మేలు చేస్తాయి.

హృదయంలో నిండి ఉన్న భావాలను బట్టి మాటలు వెలువడతాయి. కాబట్టి మొదట హృదయం పరిశుద్ధం కావాలి. అప్పుడు మానవులు బుద్ధిమంతులౌతారు. ఆ బుద్ధిమంతుల మాటలు అందరికీ మేలు చేస్తాయి. ఈ భావాన్ని ఈ రెండు సామెతలు సమానంగా అందిస్తున్నాయి.

## 10

తెలుగు సామెత : మాటలే మంత్రాలు

బైబులు సామెత : మృదువైన మాట కోపమును చల్లార్చును. నొప్పించు మాట కోపమును రేపును (సామెతలు 15:1)

కొంతమంది మాట్లాడితే కొంప మునిగిపోయినట్లు పిడుగులు పడినట్లూ ఉంటుంది. ఆవేశం, ఆక్రోశం, అన్నీ పొడసూపుతాయి. మరి కొంతమంది మాట్లాడితే మల్లెలు విరిసినట్లు, మంచి గంధం పూసినట్లు, తేనెజల్లులు కురిసినట్టూ ఉంటుంది. ఎక్కడ లేని ఆనందోత్సహాలూ వెల్లివిరుస్తాయి. అటువంటి మాటలు, ఆ విధంగా మాట్లాడే మధుర హృదయులు తారసపడినప్పుడు ఆ సన్నివేశాలను వర్ణించడానికి పై తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

సాధారణంగా వైద్యులలో ఇటువంటి మధుర సంభాషణా చతురులుంటారు. వారి మాటలు వింటున్న రోగిలో నీరసం, నిస్పృహలు మాయమై నూతనోత్తేజం, పునరుజ్జీవనం తొంగి చూస్తుంటాయి. అటువంటివారి వాక్చాతుర్యాన్ని మంత్ర మనోహరమైన మాటలను అభివర్ణించడానికి పై సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని విశదీకరిస్తున్నది. మృదువైన మాట కోపాన్ని చల్లార్చుతుందని, మనసును నొప్పించే మాట కోపాన్ని రేకెత్తిస్తుందని బైబులు సామెత తెలియజేస్తున్నది. ప్రశాంతంగా, విస్పష్టంగా మమతానురాగాలతో మాట్లాడే మాట ఆయష్షును పెంచుతుంది. కర్ణకఠోరంగా నిందా సూచకంగా నిష్ఠూరంగా మాట్లాడే మాటలు హృదయాలను గాయపరుస్తాయి.

ఏది ఏమైనా మన మాటే అన్నిటికీ కారణభూతమవుతుంది. మన మాటే మనకు గౌరవాన్ని, అగౌరవాన్ని కూడా తెస్తుంది. ఇతరులకు మనమీద ప్రేమాభిమానాలు కలిగించేదీ, అసూయా ద్వేషాలు రగిలించేదీ మన మాటే. 'నోరు మంచిదైతే ఊరంతా మంచిదే' అనే తెలుగు సామెత ఒకటి ఇదే భావంతో తెలుగునాట ప్రచారంలో ఉంది. మృదువుగా, ఆకర్షణీయంగా, ఆదరణీయంగా మాట్లాడడం ఒక కళ. ఇటువంటి కమ్మని సంభాషణలతో ఎంతటి కష్టతరమైన పనినైనా సాధించవచ్చు. పెడసరంగా, విసురుగా మాట్లాడితే ఒక్కొక్కసారి అయ్యే పని కూడా కాదు. ఇటువంటి సందర్భాలలో పైన పేర్కొన్న తెలుగు సామెత, బైబులు సామెతలు సమతుల్యాలు, సమానార్థకాలుగా పనిచేస్తాయి.

## కపటం

**1**

తెలుగు సామెత : అంగిట బెల్లం, ఆత్మలో విషం

బైబులు సామెత : కపటాత్ముడు తన హృదయంలోని ద్వేషమును ఇచ్చకపు మాటలతో కప్పివేయును (సామెతలు 26:22)

సమాజంలో అనూహ్యమైన, విచిత్రమైన చిత్తవృత్తులు గలవారుంటారు. కొందరు ఎవరితోనూ కలివిడిగా మాట్లాడరు. కొంతమంది ఎదుటివారు విసుక్కొని 'ఇక చాలు బాబో' అనేవరకు మాట్లాడుతూనే ఉంటారు. కొందరు ముక్తసరిగా 'అవును – కాదు' అని మాట్లాడి వెళ్ళిపోతుంటారు. వీళ్ళవల్ల అంతగా ప్రమాదాలు ఉండవు. అయితే మరికొంతమంది విడ్డూరమైన ప్రవర్తన గలవాళ్ళుంటారు. వీళ్ళు పైకి తీయగా మాట్లాడతారు. అయితే అంతరంగంలో విషాగ్ని జ్వాలలు చెలరేగుతూ ఉంటాయి. అటువంటివారి నుద్దేశించి ఈ తెలుగు సామెతనుపయోగిస్తారు. అకారణంగా వీరు ఎదుటివాళ్ళ మీద ద్వేషం పెంచుకుంటారు. అన్నిటికీ ఆటంకాలు కలిగిస్తారు. ఎవరికైనా మంచి జరుగుతున్నా ప్రక్కవారు అభివృద్ధి చెందుతున్నా వీరు ఓర్చుకోలేరు. ఇటువంటివారి వల్ల సమాజం విషపూరితమవుతుంది. వీరిని కనిపెట్టి జాగ్రత్తగా మసలుకోవాలి. సాధారణంగా వీరు మాట్లాడే విధానం, తీయని, మెత్తని పద ప్రయోగం అందరినీ ఆకర్షించి ఆకట్టుకుంటాయి. ఎదుటివారు తమ భావజాలం నుంచి తప్పుకోలేరు అన్న నమ్మకం వీరికి కలిగితే, ఇక కాలకూట విషాన్ని చవిచూపిస్తారు. ఎంతో జాగ్రత్తగా, వివేకంతో ప్రవర్తిస్తే గాని వీరి వల నుండి సామాన్యులు తప్పుకోలేరు. ఈ విధానం వల్ల వారికి లాభమూ, నష్టమూ అనే ప్రశ్నే లేదు. వారి సహజ గుణమే అంత. ఇటువంటి అంగిట బెల్లం, ఆత్మలో విషం గలవారి వల్లనే ఈ సామెత వాడుకలోనికి వచ్చింది. వీరిని ఉద్దేశించి వేమన 'నొసలు బత్తి జూపు నోరు తోడేలయా!' అని అంటాడు.

ఇక బైబులు సామెత కూడా ఇటువంటి కపటాత్ములను గూర్చి హెచ్చరిస్తున్నది. ఈ కోవకు చెందినవారు అంతరంగంలో ఉన్న ద్వేషాన్ని పైకి కనిపించనీయకుండా ఇచ్చకపు మాటలతో కప్పివేస్తారని వివరిస్తుంది. ఈ ఇచ్చకపు మాటలు చాలా తీయగా ఉంటాయి. తాత్కాలికంగా ఉపశమనం కలిగించినట్టూ ఆహ్లాదాన్ని పంచినట్టూ

కనిపిస్తాయి. వాటికి లోబడి అతణ్ణి నిజమైన మిత్రునిగా, ఆత్మీయునిగా భావిస్తే అప్పుడు తన హృదయంలో ఉన్న విషాన్ని మనమీద కుమ్మరిస్తాడు. ఇటువంటి కుటిల వర్తనుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఈ సామెతలోని హెచ్చరిక.

తెల్లగా కనిపించేవన్ని పాలు, నల్లగా కనిపించేవన్నీ నీళ్ళని భావిస్తే, ఇటువంటి మనఃప్రవృత్తులు గలవారితో ప్రమాదమే. తెలుగు సామెత, బైబులు సామెత రెండూ ఒకే భావాన్ని బోధిస్తున్నాయి. మనకు ఏ విధమైన కపటమూ, ద్వేషభావం, ఇతరుల పట్ల అసూయలు లేకపోయినా, వీళ్ళ వల్ల వచ్చే ప్రమాదం నుండి జాగ్రత్త వహించాలని ఈ రెండు సామెతలు వివరిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : కడుపులో లేనిది కౌగలించుకుంటే వస్తుందా?

బైబులు సామెత : మిత్రుడు కొట్టి గాయపరచినను పరవాలేదు, కాని శత్రువు ముద్దుపెట్టినను నమ్మకూడదు (సామెతలు 27:5,6)

ప్రేమ, బాధ్యత కలిసి ఉండే స్నేహితుడు ఒక్కొక్కసారి గాయాలు చేస్తాడు. అంటే బాధపెడతాడు. అది మన మంచికీ, ఏదైనా పొరపాటు ఉంటే సరిదిద్దుకోవడానికీ దారితీస్తుంది. ఇది మిత్ర ధర్మం. అయితే పగవాడు నిరంతరం ప్రేమిస్తున్నట్టు నటించి, ముద్దులు పెట్టి, అంతరంగంలో విషం వెల్లగక్కుతాడు. వీరిని పయోముఖ విషకుంభాలని తెలుగు సామెతలలో వర్ణిస్తే, గొఱ్ఱె తోలు కప్పుకున్న తోడేళ్ళు అని బైబిలు వర్ణిస్తున్నది.

దీనికి దృష్టాంతం బైబులులోనే కనిపిస్తుంది. “యేసు ఇంకా మాట్లాడుతూ ఉండగానే జనసమూహం, వారి ముందు పన్నెండుమంది శిష్యులలో ఒకడైన యూదా నడిచి రావడం కనిపించింది. యేసును ముద్దు పెట్టుకోవడానికి అతడు ఆయన దగ్గరకు వచ్చాడు. ‘యూదా – ముద్దుపెట్టుకొని మానవు పుత్రుణ్ణి పట్టి ఇస్తున్నావా?’ అని యేసు అతనితో అన్నాడు. కపట స్నేహితుడు పైకి ప్రేమ ఉన్నట్టు నటించి నాశం చేస్తాడు. యేసు పట్ల యూదా చేసింది అదే! (లూకా 22:41,42). కాబట్టి కడుపులో ఉన్నదానిని బట్టే క్రియలను అంచనా వెయ్యాలి. కడుపులో (హృదయంలో)

ఉంటేనే ఆ ప్రేమ సత్ఫలితాన్నిస్తుంది కాని కేవలం ఆర్ద్రత లేని కౌగలింపులవల్ల సత్ఫలితాలు రావని ఈ సామెతల భావం.

## 3

తెలుగు సామెత : చెప్పేవి నీతులు, తీసేవి గోతులు

బైబులు సామెత : దీర్ఘ జపములు జపించుచు వితంతువుల ఇండ్లను దోచుకొనువారు కపట భక్తులు (మత్తయి 23:14)

'చెప్పేవి శ్రీరంగ నీతులు, దూరేవి దొమ్మరి గుడిసెలు' అని ఇంకొక సామెత తెలుగులో ఉన్నది. అంటే ఒకవైపు నీతులు చెబుతూనే మరొకవైపు దుష్క్రియలు చేసేవారి ద్వంద్వ ప్రవృత్తిని వివరించడానికి పై తెలుగు సామెతను ప్రయోగిస్తారు. మాటలు వింటూ ఉంటే ఇతడెంత నీతిపరుడో అన్నంతగా ఉంటాయి. చేతలను గమనిస్తే అందుకు భిన్నంగా ఉంటాయి. అందుకే ఆధునిక కవి దాశరథి 'ఎదుటి మనిషికి చెప్పేటందుకె నీతులు ఉన్నాయి' అంటాడు. అటువంటి విచిత్ర వ్యక్తుల విషయంలో ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత ఇటువంటి కపట భక్తులను, వేషధారులను గూర్చి తెలియజేస్తుంది. ఈ కోవకు చెందిన భక్తులు వీధులలో దీర్ఘ ప్రార్థనలు చేస్తారు. అందరి మేలూ కోరుతున్నట్టు పైకి నటిస్తారు. కాని దిక్కులేని వారి ఆస్తిపాస్తులను దిగమ్రింగుతారు. ఈ బైబులు సామెత కూడా తెలుగు సామెతలోని భావాన్నే విశదీకరిస్తున్నది.

'వేలు వంకరగా పెట్టనిదే వెన్నపూస రాదని' మరొక సామెత వీనికి సమానార్థకంగా ఉంది. చల్ల చిలికి, వెన్న వెలికి తీయాలంటే వేళ్ళను వంకరగా మడిచి, అరచేతిని వంచాలి. అలా కాకుండా వేళ్ళను చక్కగా చాపితే వెన్న రాదు. అంటే ప్రజలను సులభంగా మోసం చెయ్యాలంటే ఎంతో గొప్పగా నీతులు వల్లించాలి. పైకి మచ్చలేని మాణిక్యంలా ఉండాలి. అప్పుడే పదిమందీ అతని మాట నమ్ముతారు. అప్పుడతడు గోతులు తియ్యడానికి, మోసం చెయ్యడానికి వీలుంటుంది. ఎరవేసి చేపలను పట్టడమంటే ఇలాంటిదే. కాగా పైకి నీతిని బోధిస్తూ లోపల గోతులు తీసేవారి విషయంలోనూ, దీర్ఘ ప్రార్థనలు చేస్తూ నిస్సహాయుల ఇండ్లు దిగమింగు కపట భక్తుల విషయంలోను ప్రయోగించే ఈ రెండు సామెతలు సమానార్థకాలు.

## 4

తెలుగు సామెత : తలలు బోడులైన తలపులు బోడులా!

బైబులు సామెత : బయటకు నీతిమంతులుగా కనబడుచూ, లోపల కల్మషంతో నిండినట్లు (మత్తయి 23:28)

సాధారణంగా పైకి అందరూ నీతిమంతులుగానే కనిపిస్తారు. బాహ్య జీవితంలో అందరూ సక్రమంగా నడుస్తున్నట్లే కనిపిస్తారు. కాని లోపల మాత్రం చాలామంది అవినీతితోను, అక్రమంతోనూ నిండి ఉంటారు. ఇది లోకనైజం. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోదంటారు. పదిమందిలో పలుకరించే తీరు వేరు, ఏకాంతంలో మాట్లాడే తీరు వేరు. "లోపల" అంటే హృదయంలో అని భావించాలి. హృదయం అన్ని చర్యలకు ఉత్పాదక స్థానం. ఈ హృదయాలోచనలు వేరుగా ఉంటాయి. పైకి కనిపించే చేష్టలు మాత్రం పవిత్రంగా కనిపిస్తాయి. అందుకే హృదయం మోసకర మైనదని బైబులు తెలుపుతున్నది. హృదయం నిజంగా శుద్ధిగా ఉంటే వారు దేవుని చూస్తారని బైబులు వివరిస్తుంది. లోకానికి హృదయం లేదు. ఎటు వీలుంటే అటు పరిగెడుతుంది. ధనవంతులకు లోబడి దాస్యం చేస్తుంది. అందుకే జాషువా తన ఆధునిక మహాకావ్యం గబ్బిలంలో "హృదయము లేని లోకము సుమీ ఇది మాపులు పశ్చిమంబుగా, ఉదయము తూర్పుగా నడుచుచుండు, సనాతన ధర్మధేనువుల్, పిదికిన పాలు పేదలకు లభింపవు, శ్రీగల వారి యాజ్ఞలో పెదవి కదల్పజాలరరవింద భవత్ప్రముఖా మృతాంధసుల్" అంటాడు. కాబట్టి లోకంలో జీవించే ప్రతివాడూ ఈ విడ్డూరమైన ప్రవర్తనను చవిచూస్తూనే ఉంటాడు. అందుకే యేసు ఒకసారి – మీరు గిన్నెలను, పళ్లెములను వెలుపల శుద్ధి చేస్తారు గాని, లోపల శుద్ధి చేయరు. మీరు పైకి పరిశుద్ధులుగా కనిపిస్తారు గాని మీ అంతరంగం అపరిశుద్ధంగా ఉన్నదని హెచ్చరించాడు (లూకా 11:39). పాత్రను వెలుపల యెంత శుభ్రంగా ఉంచుతామో, లోపల కూడా అంత శుభ్రంగా ఉంచాలి. పైకి ఎంత నీతిమంతులముగా కనిపిస్తామో, లోపల అంటే హృదయంలో కూడా అంత నీతిమంతులముగా, శుద్ధులముగా ఉండాలి. అదే బైబులు సామెతలోని పరమార్థం.

తెలుగు సామెతలో ఇదే భావం 'తలలు బోడులైన తలపులు బోడు కాదు గదా' అనే రూపంలో ఉంది. గుండు గీయించి, కాషాయాంబరధారులై, రుద్రాక్షలు ధరించి, సర్వసంగ పరిత్యాగిగా, నిష్కామయోగిగా పైకి కనిపించినంత మాత్రాన, వారు నిజంగా కోరికలు లేనివారని, యోగి పుంగవులని నమ్మనవసరం లేదు. వారి తలపులు, వారి

కోరికలు మామూలు మనుష్యుల కంటే ఎక్కువగా సుఖానురక్తికి ఆటపట్టులై ఉండవచ్చు. అందుకే వేమన 'తలలు బోడులైన తలపులు బోడులా" అంటున్నాడు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను జయించి, నిర్వికార, నిరలంకార, నిష్కామునిగా నిలిచినప్పుడు మానవుడు యోగీశ్వరునిగా సార్థకత పొందుతాడు.

నేడు పైకి యోగులు, విరాగుల వలె కనిపించి, లోలోపల భోగులై, అనురాగులై జీవించేవారు చాలామంది ఉన్నారు. వారందరి తలలు బోడులైనంతమాత్రాన తలపులు బోడులు కావు కదా. అందరూ నిష్కాములై, అందరూ సన్యాసులు కావాలని ఈ సామెత నిర్దేశించడం లేదు. భోగులు, యోగులు, అనురాగులు ఎవరి ఇచ్ఛానుసారం వారు జీవించవచ్చు. అయితే పైపైకి యోగులుగా, సన్యాసులుగా, తలపులుడిగినవారిగా నటిస్తూ, లోపల సమస్తాశలకు అఱ్ఱులు చాస్తూ వేషధారణతో ప్రజలను మోసం చెయ్యవద్దని మాత్రం ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

**5**

తెలుగు సామెత : తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు

బైబులు సామెత : నీ కంటనున్న దూలమును మరచి ఎదుటివాని కంట నలుసును ఎంచకు (మత్తయి 7:5)

తనను తాను పరీక్షించుకోకుండా ఇతరుల దోషాలను ఎత్తి చూపేవారి కోసం ఈ సామెతలు. ప్రతివారూ తప్పు చేస్తారు. అయితే ఇతరుల తప్పులెన్నేవారు తమ తప్పులు గమనించుకొనరు. ఎదుటివాణ్ణి ఒక్క వ్రేలితో ఎత్తి చూపిస్తే, మిగతా వ్రేళ్లు తనవైపే చూపిస్తున్నాయని ఈ వేషధారులు తెలుసుకోరు. తామే అందరికంటే నీతిమంతులమనీ, తప్పులను ఏకరువు పెట్టి ఇతరులను కించపరచడమే గొప్ప పనిగా వీళ్ళు భావిస్తారు. అలా కాకుండా ఆత్మ పరిశీలన చేసుకుంటే అన్యులను తప్పు పట్టే అవసరమే ఉండదు. తీర్పు తీర్చకుండా ఉంటే మనకు తీర్పు ఉండదు. మనం ఏ కొలతతో ఇతరులకు కొలుస్తామో, అదే మనకు కూడా కొలువబడుతుంది.

తప్పు మోపడం చాలా తేలిక. ఒకసారి యేసు దేవాలయంలో ఉన్నాడు. మతాధికారులు వ్యభిచారంలో పట్టుకొనిన ఒక స్త్రీని తెచ్చి ఆమెను ఏమి

చేయమంటావని ప్రశ్నించారు. ఇలాటివారిని రాళ్ళతో కొట్టి చంపాలని మోషే ఆజ్ఞాపించాడని గుర్తు చేశారు. "అయినా నీవేమి చెప్పుచున్నావు?" అని యేసును ప్రశ్నించారు. ఆయన ఒక్కసారి అందరినీ కలయజూసి "మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చును" అని వారితో చెప్పి మరలా వంగి నేలమీద వ్రాస్తూ ఉన్నాడు (యోహాను 8:7). వచ్చినవారు ఆయన మాట విని పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు మెల్లగా బయటికి వెళ్లిపోయారు. కారణమేమిటంటే వారి తప్పులను వారు గ్రహించారు. అందువలన మన కంటిని తేటగా ఉంచుకుంటే ఆత్మ విమర్శ చేసుకుంటే అంతా వెలుగుమయమవుతుంది. అందరూ మనకంటే యోగ్యులుగానే కనిపిస్తారు అని ఈ సంఘటన నుండి గ్రహించాలి. కాబట్టి ఇతరుల తప్పులను ఎంచేటప్పుడు మన తప్పులను గుర్తుంచుకోవాలని ఈ సామెతలు చెబుతున్నాయి.

## 6

తెలుగు సామెత : పెదవులపైన తేనె, మనసులో విషం

బైబులు సామెత : దుష్టునకు పెదవులు మీద తేనె, హృదయములో విషముండును (సామెతలు 12:16)

దుష్టులకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ చెప్పిన సామెతలు, సూక్తులు కోకొల్లలు. అందునా ప్రత్యక్ష శత్రువైతే పరవాలేదు. పైకి ప్రేమ నటిస్తూ లోపల ద్వేషించేవారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఇలాటి కాపట్యం మనుషులకే స్వంతం. జంతువులకు ఇది చేతకాదు. తోక తొక్కిన తాచు పడగ విప్పి చివాలున లేస్తుంది. కుక్క తన కోరలు చూపిస్తూ మొరుగుతూ పైన బడుతుంది. మనస్సులో క్రోధముంచుకుని పైకి ప్రేమ నటించే శక్తి జంతు జాలానికి లేదు.

మనుషుల్లో పయోముఖ విషకుంభాలుంటారు. పైకి ఇచ్చకాలు పలుకుతూ లోలోపల ఎదుటివాడినెలా కూల్చాలా అని పన్నాగాలు పన్నుతుంటారు. మహా భారతంలో శకునిది అదే బుద్ధి అని ఒక వాదన ఉంది. అతడు కౌరవ వంశ

పతనాన్ని ఆశించి దుర్యోధనుని పంచన చేరాడనీ, వారి వైపునున్నట్టు నటిస్తూ, వారి చేత కానిపనులన్నీ చేయిస్తూ చివరికి వంశమంతా అంతరించిపోవడానికి కారణమయ్యాడంటారు.

ఇలాటివారి కుటిల బుద్ధులెరుగక అమాయకులు వారి మాయమాటలకు మోసపోయి వారిని నమ్మి అక్కున చేర్చుకొని అసలు రంగు బయటపడినప్పుడు నివ్వెరపోతుంటారు.

'వేషధారినెపుడు విశ్వసింపగరాదు
వేషదోషము లోక విధమెయగును
రట్టుకాదె మునుపు రావణు వేషము' అన్నాడు వేమన.

పెదవులపై తేనె, మనసులో విషం పెట్టుకున్నవారు ఎంతటి మారువేషం ధరించినా అనతి కాలంలో గుట్టు రట్టు కాకమానదు. లోపలున్నదే నిజం. ముఖానికి పులుముకున్నది వేషం మాత్రమే. అసలు రంగు బయటపడకమానదు.

స్నేహితుడు మేలు కోరి గాయములు చేయును, పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెట్టును అని బైబులు సెలవిస్తున్నది. మనిషిలో తప్పులు ఉండకమానవు. శ్రేయోభిలాషులు అతని మేలుగోరి అతనిని గద్దించి సరిదిద్దాలని చూస్తారు. ఆ వ్యక్తిని ఆ మురికి కూపంలోనే ఉంచి చివరకు అతని పతనం కళ్ళారా చూద్దామని ఆశించే దుష్టుడు అతనిని ఆ చెడు మార్గంలో ప్రోత్సహిస్తాడు. సదసద్వివేవచన గలిగిన వ్యక్తి ఎవరు తనవారో ఎవరు పగవారో పరిశీలించి మసలుకోవాలి. తెల్లవన్నీ పాలు కావు, నల్లవన్నీ నీరూ కాదు అని ఈ సామెతలు తేటతెల్లం చేస్తున్నాయి.

## 7

తెలుగు సామెత : పైన పటారము, లోన లోటారము

బైబులు సామెత : సున్నము కొట్టిన సమాధులు (మత్తయి 23:27)

ఒక నాణెమునకు బొమ్మా, బొరుసూ ఎలా ఉంటాయో, ఒకే వ్యక్తికి అంతరంగమూ, బహిరంగమూ అలాగే ఉంటాయి. బహిరంగంగా లేక బాహ్య రూపంలో అందంగా, ఆకర్షణీయంగా, పరిశుభ్రంగా కనిపించేవారు అంతరంగంలో (హృదయంలో) వికృతంగా, జుగుప్సాకరంగా, అపరిశుభ్రంగా ఉండవచ్చు.

బాహ్యాకారం వికృతంగా, కళావిహీనంగా, విలువలేనిదిగా ఉన్నవారు అంతరంగంలో మహోన్నతమైన విలువలు కలవారుగా ఉండవచ్చు. బహిరంగం అందరికీ కనిపిస్తుంది. అంతరంగం దైవానికి తప్ప అన్యులెవ్వరికీ అగుపించదు. ఈ బహిరంతరంగాల నిజమైన రూపాలను కనులకు కట్టిస్తున్నది బైబులు సామెత.

క్రీస్తు జీవించిన కాలంలో కొందరు పైకి భక్తిగలవారివలె, నియమనిష్ఠలు కలవారివలె ప్రవర్తిస్తూ, లోపల అకృత్యాలు, అక్రమాలు చేస్తూ అన్యాయంగా బలహీనులను బాధిస్తూ ఉండేవారు. అలాంటివారినుద్దేశిస్తూ యేసు పై సామెత చెప్పాడు. సున్నం కొట్టిన సమాధులు పైకి తెల్లగా, అందంగా కనిపిస్తాయి. లోపల శల్యాలు, పురుగులు, సమస్త కల్మషాలూ ఉంటాయి. ఈ కృతక భక్తులు, కపట వేషధారులు అలాంటివారని యేసు విమర్శించాడు.

ఆనాడే కాదు, ఈనాడు కూడా ఈ కోవకు చెందినవారు లేకపోలేదు. అసలు అప్పటికంటే ఇప్పుడే ఈ తరహా మనుష్యులు ఎక్కువగా ఉన్నారేమో. వీరివల్ల ఎప్పటికైనా ప్రమాదమే. పైకి భక్తిపరుల వలె కనిపించి, అందరినీ ఆకర్షిస్తారు. తమ దగ్గరకు వచ్చినవారిని అంతరంగ దుర్గుణాలతో ఆర్పివేస్తారు. వీరిని గోముఖ వ్యాఘ్రాలని, గొర్రె తోలు కప్పుకున్న తోడేళ్ళని లోకులు వ్యవహరిస్తూ ఉంటారు. మనోవాక్కాయ కర్మలలో పవిత్రత లోకపోతే కష్టమే. అలాంటివారితో అందరికీ ప్రమాదమే.

శరీరాన్ని, హృదయాన్ని దైవమే సృష్టించాడు. ఒక్క శరీరాన్ని మాత్రమే శుద్ధి చేసుకొని, హృదయశుద్ధి లేకుండా ఉండడం మంచిది కాదని యేసు ప్రబోధం. సమాధులు పైకి అందంగా కనిపించినా, లోపల దుర్గంధ భూయిష్ఠాలు కావడం వల్ల అవి నివాసయోగ్యాలు కానట్లే మానవులు పైకి పరిశుద్ధులుగా కనిపించినా, అంతరంగం శుద్ధిగా లేకపోతే వారు నిష్ప్రయోజకులేనని బైబులు సామెతలోని భావం.

కొందరు పైకి మంచి ఆకారంతో ఉంటారని, కాని దేనికీ ఉపయోగపడరని తెలుగు సామెత తెలియజేస్తుంది. ఆకారంతోపాటు ప్రయోజకత్వం కూడా ఉంటే అతడు రాణిస్తాడు. "చప్పిడి ఉప్పిడి లేని కూర చట్టినిండా, అందం చందంలేని మగడు పందిటి నిండా' అని తెలుగులో మరొక సామెత ఉంది. కూర కొంచెమైనా రుచికరంగా ఉంటే తృప్తినిస్తుంది. మగవాడు మగటిమి ప్రదర్శిస్తే మగువ మెచ్చుకుంటుంది. ఏదీ లేకుండా ఉత్త పనికిమాలిన ఆకారం వల్ల ఎటువంటి

ప్రయోజనమూ కలుగదని ఈ సామెత భావం. ఇలా పైకి మంచిగా, ఆడంబరంగా కనిపిస్తూ, లోపల డొల్లగా ఉండేవారి వలన ప్రయోజనమేమీ ఉండదని ఈ తెలుగు, బైబులు సామెతలు తమదైన రీతులలో తెలుపుతున్నాయి.

**8**

తెలుగు సామెత : మేక వన్నె పులులు

బైబులు సామెత : గొర్రె తోలు కప్పుకున్న తోడేళ్ళు (మత్తయి 7:15)

పైకి అమాయకంగా కనిపిస్తూ ఇతరులకు అపకారం చేసే కపటులను ఉద్దేశించి ఈ సామెతలను వాడతారు. యేసు ఈ లోకంలో ఉన్నప్పుడు కపట ప్రవక్తలను గూర్చి, కపట భక్తులను గూర్చి హెచ్చరిస్తూనే ఉన్నాడు. వారు గొర్రెల చర్మాలు కప్పుకున్న తోడేళ్ళ వంటివారని, సున్నం కొట్టిన సమాధుల వంటివారని చెబుతూనే ఉన్నాడు. క్రీస్తు ఈ లోకంలో జన్మించక పూర్వం కూడా యిర్మీయా అనే భక్తుడు ప్రతివారు కపట సహోదరుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వారిని నమ్మవద్దని, వారు తంత్రగొట్టులై కొంపలు ముంచుతారని, ప్రతివాడు కొండెములు చెప్పడానికి తిరుగుతుంటాడని ఎరుకపరిచాడు (యిర్మీయా 9:4). కనుక ఈ కపట వ్యక్తుల బారిని పడకుండా ఎవరికి వారు జాగ్రత్త పడాలని ఈ తెలుగు, బైబులు సామెతలు తెలియజేస్తున్నాయి.

మొదటినుంచీ లోకమంతా ఇదే స్థితిలో ఉంది. హృదయంలో విషం, పెదాలపై అమృతం!

## డంబం

**1**

తెలుగు సామెత : అంత ఉరిమి ఇంతేనా కురిసేది

బైబులు సామెత : నరుడు వాగ్దానము చేసియు వస్తువులను ఇయ్యకుండుట, మబ్బు గాలి ఆర్భాటము చేసియు వాన కురియకుండుట వంటిది (సామెతలు 25:14)

కొందరు అది చేస్తాను, ఇది చేస్తాను, నా యంతవాడు లేడని బడాయిలు పల్కుతారు కాని క్రియ ఆ బడాయిలకు తగినంతగా ఉండదు. "తుస్" మని తేలిపోతాయి కార్యాలు! ఈ సందర్భంలో "అంత ఉరిమి ఇంతేనా కురిసేది" అనే తెలుగు సామెతను ప్రయోగిస్తారు. "ఉత్తర ప్రగల్భాలు" అనేవి తెలుగువారికి సుపరిచితాలే. ఉత్తర గోగ్రహణంలో విరాటరాజు కుమారుడైన ఉత్తరుడు ఎన్నో ప్రగల్భాలు పలుకుతాడు. తనకంటే వీరుడు ఇకలేనే లేనట్లు కోతలు కోస్తాడు. తీరా కౌరవ సేనను చూచి వణికిపోతాడు. అదుగో అదీ ఈ మేఘాల వరుస! అందుకే వేమన "పెట్టిపోయలేని వట్టి బీరములేల?" అని అంటాడు. "వట్టి గొడ్డుకు అరుపు లెక్కువ" అనే సామెత కూడా ఇదే భావాన్ని స్ఫురింపజేస్తుంది.

ఇక బైబులు సామెతలో వాగ్దానం చేసి, వస్తువులను ఇవ్వని వ్యక్తిని ఉపమేయం గానూ, ఆర్భాటం చేసి వర్షింపని మేఘాన్ని ఉపమానంగానూ పోల్చి అత్యంత రమణీయంగా చెప్పారు. అంటే క్రియాశూన్య వచనాల వల్ల ఫలితం లేదని భావం. మేఘాన్ని ఉద్దేశించి చెప్పిన తెలుగు సామెత, నరుని ఉద్దేశం చెప్పిన బైబులు సామెతల యొక్క అంతరార్థం ఒకటే! ఎటొచ్చీ వాటిని అర్థం చేసుకొని, తదనుగుణంగా నడుచుకోవడంలోనే మానవుని విజ్ఞత దాగి ఉంది.

## 2

తెలుగు సామెత : అన్నీ ఉన్న విస్తరాకు అణిగిమణిగి ఉంటుంది. ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది

బైబులు సామెత : అజ్ఞుడు ఆలోచన లేక నోటికి వచ్చినట్లు వదరును. జ్ఞాని చక్కగా ఆలోచించి గాని సంభాషింపడు (సీరా 21:26)

అన్నం వడ్డించుకొని తినే ఆకును విస్తరాకు అంటారు. అన్నం, మిగతా ఆహార పదార్థాలన్నీ విస్తరాకు నిండా ఉన్నప్పుడు, అది గాలికి కదలకుండా, తినడానికి వీలుగా పెట్టుకున్న చోటనే ఉంటుంది. దానిలో ఏ పదార్థం లేకుండా ఖాళీగా ఉన్నట్టయితే అది గాలికి చలిస్తూ, శబ్దం చేస్తూ, చంచలంగా ఉంటుంది.

అన్నీ కూలంకషంగా తెలుసుకున్న వ్యక్తిని జ్ఞాని అంటారు. జ్ఞానం ఉన్నవాడు, అనగా అన్ని విషయాలపైనా అవగాహన ఉన్నవాడు, లోక జ్ఞానమూ, సంస్కారమూ ఉన్నవాడు ఎక్కువగా, అనవసరంగా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడు. ఏది అవసరమో దాన్నే మాట్లాడి తన విజ్ఞత చాటుకుంటాడు. అజ్ఞాని అంటే దేనిమీదా సరైన అవగాహన

లేనివాడు అనవసరంగా, తన ఇష్టం వచ్చినట్లుగా, అర్థరహితంగా మాట్లాడతాడు. ఇక్కడ అన్ని పదార్థాలూ వడ్డించబడి ఉన్న విస్తరిను జ్ఞానితోను, ఏ పదార్థం లేకుండా గాలికి ఎగిరెగిరి పడే విస్తరిను అజ్ఞానితోను పోల్చి, ఉపమాలంకార శోభితంగా ఈ సామెత చెప్పారు. "వట్టిగొడ్డుకు అరుపులెక్కువ" అనీ "చెల్లని రూపాయకు గీతలెక్కువ" అనీ కూడా ఈ అర్థంలో వాడతారు.

బైబులులోని సీరా జ్ఞాన గ్రంథంలో విజ్ఞుడికి, అజ్ఞుడికి గల భేదాన్ని వివరించే ఈ సామెత ఉన్నది. అజ్ఞాని ఆలోచనా రహితంగా, తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడతాడు. అయితే జ్ఞాని చక్కగా ఆలోచించి, సమయ సందర్భాలను దృష్టిలో ఉంచుకొని ఏది అవసరమో దాన్ని మాత్రమే మాట్లాడతాడు. ఈ అధ్యాయంలో జ్ఞానికి అజ్ఞానికి, సంస్కారికి మూర్ఖునికి, మందుడికి మర్యాదస్తుడికి గల భేదాలు విస్పష్టంగా వివరించ బడ్డాయి. తెలుగు సామెతలోను, బైబులు సామెతలోను కూడా ఏమీ తెలియనివాడు పదార్థాలు లేని విస్తరాకులాగా ఎగిరెగిరి పడతాడని, అన్నీ తెలిసిన విజ్ఞాని అణిగిమణిగి ఉండి ఆలోచనతో అడుగు వేస్తాడని వివరించారు.

## 3

తెలుగు సామెత : కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?

బైబులు సామెత : కొందరు మితముగా మాటలాడుటచే జ్ఞానులనబడుదురు.
కొందరు అమితముగా మాటలాడుటచే చెడ్డపేరు తెచ్చుకొందురు
(సీరా 20:5)

పద్యాలలో కూడ సామెతలను చొప్పించి, తన లోకజ్ఞతను చాటుకున్నాడు ప్రజాకవి వేమన.

'అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినుమర వేమ'

ఈ పద్యంలో అల్పుడు గణగణ మ్రోగే కంచుగాను, సజ్జనుడు చల్లగా మెల్లగా మ్రోగే కనకంగాను పోల్చబడ్డారు. కంచునకు వట్టి శబ్దాడంబరమే గాని పదార్థం విలువ లేనిదని, కనకానికి శబ్దాడంబరం లేకపోయినా, వస్తువు విలువైనదని చెబుతారు. అల్పుడు కంచుతోను, సజ్జనుడు కనకంతోను పోల్చబడి ఈ పద్య సామెత ఉపమాలంకార శోభితంగా సాగింది. బాహ్యాంతరార్థాలకు సుందరమైన పోలిక కుదిరింది!

బైబులులోని సీరా జ్ఞానగ్రంథం 20వ అధ్యాయం సమయాసమయాల తారతమ్యం, మితామితాల విలువలను వివరిస్తుంది. ఎప్పుడూ (ఎల్లప్పుడూ) మాట్లాడడంచేత కొందరు అజ్ఞానులనిపించుకుంటారు. ఎప్పుడు (ఏ సమయంలో) మాట్లాడవలెనో తెలిసి, ఆ సమయం వచ్చేవరకు మౌనంగా ఉండి సమయోచితంగా మాటలాడి కొందరు జ్ఞానులనిపించుకుంటారని తెలియజేశారు. తెలుగు సామెతలో కూడా 'అల్పుడు + ఎపుడు' అనగా అల్పుడు ఎల్లప్పుడూ ఆడంబరంగా పల్కుతాడు అనే అర్థాన్ని గ్రహిస్తే బైబులులోని సామెత, తెలుగు సామెత సమానార్థకాలని చెప్పవచ్చు. సమయోచితంగా పలికిన మాట వెండి పళ్ళెరములో నుంచిన బంగారు పండ్లవంటిది. సమయోచితముగా మాటలాడుట నోటితో ముద్దిడినట్లుండును మొదలైన బైబులు సామెతలు ఇదే భావాన్ని చెబుతున్నాయి.

## 4

తెలుగు సామెత : చేసుకున్నదానికి మూసుకోను లేదు, ఉంచుకున్నదానికి ఉభయరాగాల చీర

ఆలుబిడ్డలు అన్నానికి అలమటిస్తుంటే లంజకు బిడ్డలు లేరని రామేశ్వరం పోయినట్టు

బైబులు సామెత : సొంత కుమారులు ఆకలితో అలమటించుచుండగా తండ్రి తన ఆస్తిని మిత్రులకు పంచి ఇచ్చినట్లు (యోబు 17:5)

జారుడు సిగ్గుమాలి దాంపత్య జీవన ధర్మాన్ని వీడి పరనారీ సంగమానికై వెంపరలాడుతాడు. ఆలుబిడ్డలు అన్నమో రామచంద్రా అని అలమటిస్తుంటే తన జల్సాలకు యథేచ్ఛగా ధనవ్యయం గావించే, ముఖ్యంగా ఉంపుడుగత్తెలకు దోచిపెట్టే గ్రంథసాంగులకు చెంపపెట్టుగా పైని చెప్పిన తెలుగు సామెతలు పుట్టాయి.

'ఆలు రంభయైన నతిశీలవతియైన
జార పురుషుడేల జాడమాను'

అంటూ వ్యభిచారి సహజ స్వభావాన్ని ఎండగట్టాడు వేమన. వేడి తగిలితే లక్క కరిగినట్టు కాముకుడు వేశ్యను చూచి మోహంతో కరిగిపోతాడు. వెలదుల పాలబడితే వెతలు తప్పవు. అగ్నిసాక్షిగా మనువాడిన అర్ధాంగిని, తాను కడుపారా కన్న బిడ్డలను సైతం విస్మరించి తన కనుసన్నల్లో మగవాడు మెలిగేలా చేసుకుంటుంది వారకాంత.

'నాడెమైన చెడిపె నయమెరింగి తిరుగు
విటుని గుస్తరించు వివరమెరుగు'

అథమ పురుషులలో కనిపించే ఈ చపలత్వాన్ని ఎత్తి చూపుతూ తెలుగు సామెతలు రెండూ ఉనికిలోకి వచ్చాయి. అలాటివాడు వేశ్యకు సమస్తం సమర్పించుకొని ఇల్లు గుల్ల చేసుకొని భ్రష్టుడౌతాడు. గోడకి పూసిన సున్నం తిరిగి రానట్టు వెలయాలుకు ఎంత ఇచ్చినా ఆమె వలన తాత్కాలిక శరీర సుఖమే గాని శాశ్వత సౌఖ్యం లేదు.

'ఔరసుండె నీకు వారసుండగు గాక
వేశ్యయందు పుట్టు వెధవ కొడుకు
నీవు పోయినపుడు నీరైన వదులనా'

అంటూ అటువంటి నీచ ప్రవర్తనను వేలెత్తి చూపుతున్నాడు వేమనాఖ్యుడు. బైబులు సామెత సైతం కొంత భిన్నమైన మాటలతో ఇదే సత్యాన్ని ప్రతిపాదిస్తున్నది. గృహస్తు తన కుటుంబ పోషణ బాధ్యత మరిచి పరులకు తన ధనం దోచిపెట్టగా తనూజులు ఆకలికి అలమటించడం సహింపరాని నేరం. 'చీట్లపేక' ఖండికలో జాషువా కవి ఇలాటి మనస్తత్వమున్న మగవారి మనోభావాలు చక్కగా వర్ణించాడు. 'అనుంగు బిడ్డడు బావిలో బడియెనన్నా! లేచిరమ్మన్న, తెచ్చునదీ మార్గమె కాయటంచు వచించున్ జూదగాడు' అంటూ 'పేకయాట గుండె పీకులాట' అని తేల్చాడు కవి.

కష్టాలలో ఉన్న తమవారిని గురించి పట్టించుకోకుండా వేశ్యల కోసం, మిత్రుల కోసం డబ్బును వెచ్చించే డాంబికులను భర్తలనుగా, తండ్రులనుగా పొందినవారు దురదృష్టవంతులే కదా!

## 5

తెలుగు సామెత : తినడానికి తిండి లేదు గాని తనవారికి తద్దినాలట

బైబులు సామెత : ఇక్కట్టులలో ఉన్నపుడు డాబుసరి పనికి రాదు (సీరా 18:33)

'మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె' అని, 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' అని ఎన్నో సమానార్థకమైన సామెతలు తెలుగు నాట ప్రచారంలో ఉన్నాయి. స్థాయిని మరచి, సామర్థ్యం తెలియకుండా ఆడంబరాలకు పోవడం అనర్థదాయకమని ఈ తెలుగు సామెత వివరిస్తుంది. తినడానికి తిండి లేని సమయంలో, తద్దినాల పేరుతో చనిపోయినవారి ఆత్మశాంతికని సంతర్పణలు చేసి, ఆడంబరాలు చూపి, అప్పులపాలు కావడం ముమ్మాటికీ అవివేకమే. ప్రక్కవారిని చూచి, వారిని అనుకరిస్తూ గొప్పలు పోతూ జీవించాలని భావించవద్దని ఈ సామెతలోని భావం.

బైబులు సామెత దీనికి సమానమైన భావాన్ని తెలియజేస్తుంది. ఇక్కట్లలో ఉన్నపుడు డాబుదర్పాలకు పోకూడదని వివరిస్తున్నది. పుష్కలంగా సర్వసమృద్ధిగా అన్నీ ఉన్నపుడు ఖర్చు పెట్టడం, ఆడంబరంగా ప్రవర్తించడం కొంతవరకు ఆమోదయోగ్యమే. మనమే కష్టాలలో కూరుకుపోతున్నప్పుడు డాబుసరికి పోయి మరిన్ని కష్టాలు కొనితెచ్చుకోవడం మంచిది కాదని, తెలుగు సామెత, బైబులు సామెతలు తెలుపుతున్నాయి.

'మంచమున్నంత వరకే కాళ్లు చాపుకోవాల'నేది జానపదులలో ప్రచారం పొందిన మరొక తెలుగు సామెత. శక్తికి మించి ఏ పనినీ చేయకూడదనీ, తన శక్తి సామర్థ్యాలు తెలుసుకొని ప్రవర్తించాలనీ ఈ సామెతల ఉపదేశం.

## 6

తెలుగు సామెత : మింగ మెతుకు లేదు, మీసాలకు సంపంగి నూనె!

బైబులు సామెత : గొప్పవాని వలె తిరుగుచూ ఆకలితో చచ్చుటకంటే సామాన్యుని వలె బ్రతుకుచు కడుపు కూడు సంపాదించుకొనుట మేలు (సామెతలు 12:9)

కొందరు ఏమియు లేకున్నను సంపన్నుల వలె నటింతురు (సామెతలు 13:7)

ఇంట్లో ఈగల మోత, బైట పల్లకీల మోత' అనే సామెతను దీనికి సమానార్థకంగా చెప్పవచ్చు. కడుపునిండా తిండి ఉండదు. కనీసావసరాలు తీర్చుకునేందుకు డబ్బుండదు. ఆడంబరాలు మాత్రం తగ్గవు. ఇది నేల విడిచి సాము చేయడం లాంటిది. ఊహా ప్రపంచంలో గాలిమేడలు కట్టి అందులో నివసించడం లాంటిది. దీన్ని తెలియజేయడానికి పై తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెతలో కూడా తెలుగు సామెతలో ధ్వనించే అర్థమే ద్యోతకమవుతుంది. గొప్పలకు పోయి కడుపు మాడ్చుకోవడం కంటే, సామాన్య జీవితాన్ని గడిపి పొట్టకూడు సంపాదించుకోవడం మేలు కదా. ధనవంతుని వలె నటించి, డంబముగా ప్రవర్తించి దారిద్ర్యాన్ని చవిచూడడం కంటే సామాన్యునిగా ప్రవర్తించి కనీసావసరాలు సంపాదించుకోవడం ఉత్తమం.

గొప్పలు పోవడం ఎప్పుడూ మంచిది కాదు. నిజంగా గొప్పతనం ఉంటే దాన్ని ప్రదర్శించడం తప్పు కాదు. కోతలు కోస్తూ, డాంబికాలు పలుకుతూ, నేలవిడిచి ఊహా ప్రపంచంలో విహరించడం మంచిది కాదు. ఆకాశ సౌధాలు నిర్మిస్తే, అవి తప్పకుండా కూలిపోతాయి. అందనివాటి కోసం అఱ్ఱులు చాచి చెడిపోవడం కన్నా, అందుబాటులో ఉన్న వాటిని అనుభవించి సుఖించడం మిన్న. ఇదే భావాన్ని తెలుగు సామెత, బైబులు సామెత సమానంగా విశదీకరిస్తున్నాయి.

## సోమరితనం

**1**

తెలుగు సామెత : ఎద్దు వలె తిని, మొద్దు వలె నిద్రపోయినట్టు

బైబులు సామెత : సోమరీ, ఎందాక నీవు పండుకొని యుందువు? ఎప్పుడు నిద్ర లేచెదవు? (సామెతలు 6:9)

ఆధునిక కాలంలో సోమరితనం 'ఎయిడ్స్' కంటే ప్రమాదకరమైనదని విజ్ఞులు వక్కణిస్తున్నారు. అది నూటికి నూరుపాళ్ళు నిజం! నిద్రమత్తు, సోమరితనం

దారిద్ర్యానికి దారితీస్తాయని విజ్ఞానుల అభిప్రాయం. “కృషితో నాస్తి దుర్భిక్షం, జపతో నాస్తి పాతకం” అనేది సాంస్కృతిక సామెత! పని చేయువాడే ఆహారానికి పాత్రుడని బైబులు ప్రబోధిస్తుంది. సోమరితనం సమస్త అనర్థాలకు మూలం. చింపిరి గుడ్డలకు కారణం.

చీమలను చూచి సోమరులు గుణపాఠం నేర్చుకోవాలి. అవి సృష్టిలో చిన్నజీవులు. పుట్టలలో జీవిస్తాయి. నిరంతరం శ్రమిస్తూనే ఉంటాయి. బైబిలులోని సామెతలు “సోమరీ, చీమల యొద్దకు వెళ్ళు, వాటి నడతను కనిపెట్టి జ్ఞానం తెచ్చుకో” అని ప్రబోధిస్తున్నాయి. నిజంగా మానవుడు చీమలను చూచి, చురుకుతనాన్ని, కష్టించే స్వభావాన్ని అలవాటు చేసుకోవాలి. సోమరి తన కంచంలో చెయ్యివేసి, అన్నం ముద్ద తీసుకోవడానికి కూడ బద్దకిస్తాడని, బాధపడతాడని బైబులు తెలియజేస్తుంది.

శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదు కట్టే షరాబు లేడంటాడు శ్రీ శ్రీ. శ్రమజీవి చెమటలో సిరిసంపదలు వర్ధిల్లుతాయని పెద్దలు చెబుతారు. శ్రమించడం జీవలక్షణం! నిర్జీవంగా నిద్రించడం మృతతుల్యం! కనుక నిద్రమత్తు వదిలి ప్రతివాడూ చురుకుదనంతో పనిచెయ్యడం చాలా అవసరం. బైబులు కేవలం ఆధ్యాత్మిక విషయాలనే కాకుండా, ఈ లోకంలో ఎలా జీవించాలి, ఎలా శ్రమించాలి, పదుగురితో ఎలా ప్రవర్తించాలి అనే విధానాలను కూడా బోధిస్తుంది. సోమరితనాన్ని, నిద్రమత్తును వదిలి, నిరంతరం శ్రమించాలని తెలియజేస్తుంది.

తెలుగు సామెతలో ఎద్దువలె తిని, మొద్దువలె నిద్రించడం మంచిపని కాదనే ప్రబోధం ఉంది. “తిండికి పోతురాజు, పనికి బాలరాజు” అనే సామెత ఇదే అర్థాన్ని తెలియజేస్తుంది. నీవు తిండిపోతువైతే నీ గొంతుకకు కత్తి పెట్టుకొనుమని బైబులు బోధిస్తుంది. తిండిపోతులు, సోమరిపోతులు, నిద్రపోతులు అనతికాలంలోనే దరిద్రులౌతారని అందరికీ తెలుసు.

మానవునిలో జీవశక్తి ఉంది, చలన శక్తి ఉంది. దాన్ని ఉపయోగించి అతడు అనేక కార్యాలు నిర్వర్తించవచ్చు. నిర్వర్తిస్తున్నాడు కూడా. కొండ గుహల్లో చెట్టు తొర్రల్లో ఉండి అనాగరికుడిగా తలదాచుకున్న మానవుడు, అంచలంచెలుగా అభివృద్ధి చెంది నేడు అనేక ఆధునాతన సౌకర్యాలతో తులతూగడం మానవుని కృషి ఫలితమే. శాస్త్ర పరిజ్ఞానంతో జీవితాన్ని సుఖమయంగా దిద్దితీర్చుకోవడం మానవుని నిర్విరామ కృషి ఫలితమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

అలా కాకుండా నిద్రమత్తులో కునికేవానికి, ఎద్దువలె తిని మొద్దులాగా స్థబ్దంగా ఉండేవాడికి, ఎంత విలువైన సమయం వృధాగా వెళ్ళిపోతుందో తెలియదు.

కాలం ధనం కంటే విలువైనది. ఎవరికీ చెప్పకుండా ఎవరికీ అందకుండా, ఎవరి కోసం ఆగకుండా సాగిపోయే స్వభావం కలది. నిద్రబోతు, తిండిబోతు, తిరుగుబోతులు కాల ప్రభావాన్ని, కాలం యొక్క విలువను తెలుసుకోలేరు. తెలుగు సామెత ఎద్దులాగా తిని, మొద్దులాగా నిద్రించడం అనర్థదాయకమంటోంది. అసలు సామెతలు మానవుని బుద్ధి మాంద్యాన్ని, శారీరక మాంద్యాన్ని పోగొట్టి, చురుకుదనంతో నింపి, ఆహ్లాదాన్నందించడానికే ఆవిర్భవించాయి. కనుక నిద్రమత్తు వదలి, మేల్కొనాలి. ఎద్దువలె తిని మొద్దులాగా, నిర్జీవంగా పరుండడం మానివేయాలి. నిత్య నూతన చైతన్యంతో మానవుడు పురోగమించినపుడే సృష్టి పులకరిస్తుంది. నర జన్మ నవరసభరితమైన నవనవోన్మేష సౌందర్యంతో అలరారుతుంది అని ఈ సామెతల ద్వారా గ్రహించాలి.

## 2

తెలుగు సామెత : ఒళ్ళు వంగనివాడు దొంగలలో కలుస్తాడు

బైబులు సామెత : సోమరి బానిసయగును (సామెతలు 12:24)

సోమరి లేమిని అనుభవించును (సామెతలు 10:4; 14:23; 19:15)

కొందరు కుంభకర్ణులుంటారు. పనిచేయడం వారి ప్రవృత్తికే విరుద్ధం. దానికితోడు వారు కట్టే గాలిమేడలకు కొదువ ఉండదు. ఊహలు ఆకాశాన్నంటుతుంటాయి. అయ్య మాత్రం కాళ్లు బారచాచుకొని పడుకున్న చోట నుండి లేవడు.

'మానసమున మంచి మల్లెపూల చవికె
బావితోట జేసి బాలగూడి
భోగినయ్యెదనన బోయెబోకాలంబు'

అంటూ వేమన ఇలాటివారి స్వభావం గుట్టు రట్టు గావించాడు. తోటలో బావి తవ్వి, మల్లె పందిరి వేసి యువతితో వినోదిస్తాననుకుంటూ ఊహలతో పొద్దుపుచ్చు

తాడట సోమరివాడు. సోమరితనము గాఢనిద్రలో పడవేయును, సోమరివాడు పస్తు పడియుండునన్నది (సామెతలు 19:15) ఈ నీతినే వివరిస్తున్న వేరొక బైబులు సామెత. సోమరి బయట సింహముంది, నేను వెళ్ళనంటాడట (సామెతలు 22:13).

సోమరితనాన్ని తీవ్రంగా గర్హించిన సొలోమోను సోమరివాని ఇంటిని ఈ విధంగా వర్ణించాడు, 'సోమరివాని చేను నేను దాటిరాగా ఇదిగో, దానియందంతట ముండ్లతుప్పలు బలిసియుండెను. దూలగొండ్లు దానిని కప్పియుండెను. దాని రాతిగోడ పడియుండెను. నేను దానిని చూచి యోచన చేసికొంటిని. ఇంక కొంచెము నిద్ర, ఇంక కొంచెము కునుకుపాటు... వీటి వలన దారిద్ర్యము పరుగెత్తి వచ్చును. ఆయుధధారి వచ్చినట్లు లేమి నీ మీదికి వచ్చును (సామెతలు 24:30-33).

సోమరితనానికి పర్యవసానాలను బైబులు సామెతలు తేటతెల్లం చేస్తున్నాయి. పేదరికం, పస్తులు, అప్పులు, బానిసం అతనికి సంప్రాప్తిస్తాయి. తెలుగు సామెత మరింత చమత్కారంగా ఒళ్ళు వంచనివాడు దొంగల్లో కలుస్తాడనడం ఆలోచించదగిన విషయం. సోమరితనం వల్ల అవసరాలు తీరక పోషణకై వక్రమార్గాలు తొక్కాలన్న ప్రేరణ కలుగక మానదు.

కాయకష్టం చేసి గౌరవంగా సంపాదించుకొని కలో గంజో త్రాగి హాయిగా రొమ్ముపై చేయి వేసుకొని నిద్రించే శ్రమైక జీవనం ఉత్తమ మార్గం. ఎదుటనున్న అన్నం ముద్దను నోటికందించుకోవడం బద్ధకమైన సోమరి తక్కువ శ్రమతో ఎక్కువ ప్రతిఫలం కోసం మార్గాన్వేషణం చేస్తాడు. లంచాలు, దోపిడీ, చీట్లపేక చివరకు భిక్షాటన అతనికి మార్గాంతరాలౌతాయి. అలాటి వ్యక్తిని స్వంత భార్య సైతం సత్వరం విసర్జిస్తుంది. సోమరితనాన్ని వీడి చైతన్యమూర్తులై మనుషులు వర్ధిల్లాలని ఈ సామెతల సారాంశం.

## 3

తెలుగు సామెత : గోరంత నిర్లక్ష్యం కొండంత నష్టం

బైబులు సామెత : కొంచెముసేపు నిద్రింపుము, కొంచెముసేపు కునికిపాట్లు పడుము, ఈ లోపల దారిద్ర్యము దొంగవలె వచ్చి నీ మీద పడును (సామెతలు 24:34)

సృష్టి అంతటిలో నిర్భాగ్యుడు సోమరిపోతే. సోమరులను అసహ్యించుకొనని వాడుండడు. అలసత్వంతో కార్యాలు ఆలస్యం చేసేవారు కొందరైతే, చూద్దాం చేద్దామంటూ వాయిదాలు వేస్తూ ప్రొద్దుపుచ్చే ప్రబుద్ధులు కొందరు. కొద్దిపాటి నిర్లక్ష్యంతో కొండంత నష్టం తెచ్చిపెట్టుకొనే వారిని ఈ సామెతలు అభిశంసిస్తున్నాయి.

సృష్టిలో సోమరితనం కనిపించదు. చెట్లు చిగిరిస్తాయి. పూలు పూస్తాయి. ఆమని వస్తుంది. కోయిల కలస్వనంతో కూస్తుంది. చీమలు చురుకుగా పరుగెడుతుంటాయి. తోటలో నత్తలు తమ దారిన పాకుతుంటాయి. పక్షులు పెందలకడనే లేచి గుంపులుగా ఆహారాన్వేషణకై బయలువెడలుతుంటాయి. కొందరు మనుషులు మాత్రం ఉదయ భానుని కిరణాలు చురుక్కుమనిపిస్తున్నా అటువైపు ఒత్తిగిలి పడుకుందామని చూస్తుంటారు. తట్టి లేపుతున్న వారిని సైతం విసుక్కుంటూ సుషుప్తిలోకి తిరిగి జారుకొనే ప్రయత్నం చేస్తుంటారు.

అటువంటి అలసత్వానికి అలాటివారు తగిన మూల్యం చెల్లించుకొనక తప్పదు. హితోపదేశంలో నారాయణ కవి వచించినట్టు,

'యత్న కృతములు ఫలియించు; నాశచేత
మాత్ర మేకార్యమెందు సంపన్నమగును?'

ఉన్నవి శిథిలమౌతాయే తప్ప సోమరి తలపెట్టిన కార్యాలు అతడు కునికి నిద్రిస్తుండగా తమంతతాము ఈడేరవు గదా. కొందరికి అరటి పండు సైతం వలిచి చేతిలో పెట్టాలి. ఇక నారికేళ పాకం మధురిమలు వారేమి గ్రహించగలరు? 'కష్టేఫలి' అని పెద్దలన్నమాట చద్దిమూట.

పాటుపడని వానికి చేటు తప్పదు. అన్నీ అలవోకగా జరిగిపోవాలని ఆశించే అలసునికి ఆయాసం తప్పదు. క్రీస్తు రాయబారి పౌలు తెస్సలోనిక పట్టణంలోని క్రైస్తవ సమాజానికి వ్రాస్తూ 'మీలో కొందరు ఏ పనియు చేయక పరులజోలికి పోవుచు అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పని చేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట వానిని ఆజ్ఞాపూర్వకముగా హెచ్చరించుచున్నాను' అంటున్నాడు (తెస్సలొనీక 3:11,12).

సోమరివాడు తనకే గాక తానున్న సమాజానికి ప్రమాదహేతువు. అతడు పరాన్నభుక్కు. చకిత మృగ శాబకంపైకి శార్దూలం లంఘించి వడిచిపట్టినట్టు దారిద్ర్యం అతన్ని పట్టి కబళిస్తుంది.

తెలుగు బైబులు సామెతలు రెండూ ప్రధానంగా ప్రతిపాదిస్తున్న సత్యం చిరు నిర్లక్ష్యం బద్ధకం మూలంగా వాటిల్లే పెను ప్రమాదం నష్టం. పుస్తకాలు దులపడం ఆలస్యం చేస్తే చెదపురుగులు చేరి అమూల్య గ్రంథాలను స్వాహా చేస్తాయి. విద్యుత్ తంత్రులను సరిగా మలచడం అలక్ష్యపెడితే చిన్న నిప్పురవ్వ లేచి గోదాము నంతటినీ భస్మీపటలం చేస్తుంది. గోరంతలున్న పాఠాలను విద్యార్థి ఎప్పటికప్పుడు చదవకపోతే అవి కొండంతలై ఏకులు మేకులై కూర్చుంటాయి. కాబట్టి మానవులు కష్టజీవులై ఎప్పటి పనులను అప్పుడు చేసుకోవాలని ఈ సామెతల సందేశం.

## 4

తెలుగు సామెత : పొద్దున లేవని కాపుకు పొలం ఇచ్చేది గడ్డే

బైబులు సామెత : సోమరి రైతు పేదరికమున మ్రగ్గును (సామెతలు 28:19)
సోమరికి వేట చిక్కదు (సామెతలు 12:27)

బద్ధకమనేది ఫలప్రద జీవితానికీ ప్రగతికీ బద్ధశత్రువు. అందునా కృషీవలునికి, కార్మికునికి. సోమరితనం వారి నైజానికే విరుద్ధం. ఇదే విషయాన్ని బైబులు, తెలుగు సామెతలు సూటిగా తెలియజేస్తున్నాయి.

'పొలాలనన్నీ హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ...'

అంటూ శ్రమించే రైతు ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడని శ్రీశ్రీ నివాళులర్పించాడు. ఏ ముట్టడికి ఎంత ఖర్చయింది, ఏ మహారాణి విరహాగ్నిలో ఎంతవరకు తపించినదన్నది కాదు. తాజ్‌మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలెవరు? ఐర్లండు దేశపు ఓడ కళాసీ, చెక్ దేశపు గని పనివాడు, వీరి జీవన విధానమేమిటి? ఇవే ముఖ్యం. శ్రమ జీవులే నవసమాజ నిర్మాతలు, మానవ జాతి భావి నిర్ణేతలు. పై సామెతలలో ద్యోతకమయ్యే ఆత్మ ఇదే.

తెలుగు సామెత వ్యవసాయ రంగంలో ఒక సార్వత్రిక సంభవాన్ని కళ్ళ ముందుంచుతున్నది. పొలాలన్నీ లేత పైరుతో పిల్లగాలికి పరవశిస్తూ ఉండగా, సోమరివాని చేను మాత్రం గడ్డి దట్టంగా పెరిగి వెక్కిరిస్తూ ఉంటుంది. అనాయాసంగా అయాచితంగా పెరిగేది గడ్డే. 'ఏమిటి గడ్డం పెంచుతున్నావు?' అని అడిగితే 'నేను

పెంచడం లేదు అదే పెరుగుతున్నాడ'ట వెనుకటికొకడు. సోమరులు కర్తవ్య విముఖులై జరగవలసిన దానిని వాయిదా వేస్తూ వస్తుంటే దారిద్ర్యం శీఘ్రంగా వారిపైకి దండెత్తి వస్తుంది. "సోమరులు వెట్టి పనులు చేయవలసివచ్చును" అనీ "సోమరి ఆశపడును గాని వాని ప్రాణమునకేమియు దొరుకదు" అనీ సామెతలున్నాయి (సామెతలు 12:24; 13:4).

వేట కూడ అంతే. 'పందిని కొట్టినవాడే పాటుబంటు' అన్నారు. మిగిలిన జంతుజాలం కన్నా పంది చురుకైనదనీ ఓ పట్టాన ఆయుధాలకు అందదనీ ప్రతీతి. వేటగాడు సోమరివాడైతే వట్టి చేతులతో తిరిగి రావలసిందే. ఒళ్ళువంచి చాకిరికి మళ్లని వాడి మళ్లు మట్టిగొట్టుకుపోతాయి. వ్యవసాయ రంగంలోనూ తదితర జీవనోపాధులలోనూ సోమరి అనుభవించే దురవస్థను ఈ సామెతలు కళ్ళకు కడుతున్నాయి.

## దురాశ

**1**

తెలుగు సామెత : అడ్డెడు వడ్లు ఆశకుబోతే, తూమెడు వడ్లు దూడ తినిపోయింది

బైబులు సామెత : దురాశతో సొమ్ము చేసుకొనువాని కుటుంబమునకు ఆపద తప్పదు (సామెతలు 17:23)

'కొండ నాలుకకు మందు వేస్తే, ఉన్న నాలుక ఊడిపోయింద"నే ఇంకొక తెలుగు సామెతను ఇదే అర్థంలో ఉపయోగిస్తారు. చిన్న వస్తువును ఆశించిపోతే దానికంటే పెద్ద వస్తువు మన దగ్గరున్నది పోతుంది. కొన్నిసార్లు ఇటువంటి సంఘటనలు మన జీవితాలలో తారసిల్లుతాయి. ఆశ ఉండడం సహజమే. అయితే దురాశ, లేక అత్యాశ మంచిది కాదు. ఆశలను చంపుకుంటే, కోరికలను అదుపులో పెట్టుకుంటే దుఃఖం కలుగదనేది సర్వ జనామోదమైన సిద్ధాంతం. చిన్నదానిని ఆశించి మన దగ్గర ఉన్న పెద్దదానిని పోగొట్టుకొనే సందర్భాలలో పై తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత కూడా దురాశతో సొమ్ము చేసుకుంటే అతనికే కాకుండా, అతని కుటుంబానికి కూడా దుఃఖం కలుగుతుందని హెచ్చరిస్తుంది. సంతృప్తి కలిగి

ఉన్నదానితో సుఖించేవాడికంటే అదృష్టవంతుడు మరొకడు లేడని చెప్పే బైబులు సామెతలు అనేకం దీనికి సమానార్థకాలుగా ఉన్నాయి.

'దురాశ దుఃఖమునకు చేటు' అనేది ఇంకొక తెలుగు సామెత. అడ్డెడు వడ్లు వస్తాయని ఆశకుపోతే, తూమెడు వడ్లు ఉన్నవే పోతాయి. ఇది చాలా నిరుత్సాహాన్ని కలిగించే స్థితి. కాగా ఆశకు పోవడం, దురాశతో సొమ్ము చేసుకోవడం ఆరోగ్యకరమైన అలవాట్లు కావు. వీటివల్ల అశాంతి, అసంతృప్తి మాత్రమే కాకుండా అనారోగ్యం కలిగే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి దురాశ, లోభం అన్ని అనర్థాలకు మూలం. అటువంటి సందర్భాలను ఈ తెలుగు, బైబులు సామెతలు రెండూ సమానార్థకాలుగా బోధిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : ఆశకు అంతం లేదు

బైబులు సామెత : నరుని ఆశకు అంతం లేదు (సామెతలు 27:20; యోబు 20:20)

'ఆశ కన్న దుఃఖమతిశయింపగ లేదు' అన్నాడు వేమన. మనుషులు జీవితాంతం కోరికలతో భ్రమలతో సంచరిస్తూ అంతం లేని ఆశతో సమసిపోతూ ఉంటారు. అందుకే

'ఆశను విడువని జీవికి
క్లేశము విడిపింపదరమె కేశవునకు నా
యాశా పాశము లెల్లను
రోసిన క్లేశంబు విడుచు రూఢిగ వేమా'

అని సిద్ధాంతీకరించాడు వేమన. ఆశలుడిగితే పాశముక్తులౌతారు. ఆశాముక్తులు మునులౌతారు. కానీ ఇది అంత సులభం కాదు. తెలుగు, బైబులు సామెతలు వక్కాణించినట్లు మనిషి ఆశలు అనంతం.

అత్యాశ ఉంటే ఇతర దుర్గుణా లెందుకు? అని అంటాడు భర్తృహరి. అనగా అదొక్కటే ఎక్కువ నిందలను తెచ్చిపెడుతుందని అర్థం. ఆశాబంధంలో చిక్కుకొని బయటపడలేక ఆశాభంగంతో దురపిల్లడం మనుషులకు వాడుక. ఎన్ని నదులు కలిసినా అంబుధి నిండనట్టు ఎన్ని కోరికలీడేరినా ఆశలు ఊరుతూనే ఉంటాయి.

అనివార్యమైన సముద్రపు పొంగును సైతం చెలియలికట్ట నిరోధించినట్టు ఆశను అంతమొందించిన వాడే పునీతుడు. సిద్ధార్థుడు సైతం దుఃఖానికి మూలం కోరిక లేక ఆశ అని గ్రహించాడు.

పిడికెడంత హృదయంలో కడలిని మించిన ఆశలు దాచుకుంటాడు మానవుడు. ఈ మనో వైపరీత్యానికి పై చెప్పిన తెలుగు, బైబులు సామెతలు అద్దం పడుతున్నాయి.

## 3

తెలుగు సామెత : దురాశ దుఃఖమునకు చేటు

బైబులు సామెత : దురాశ వలన ఆపద కలుగును (సామెతలు 19:22)

ఆశ ఉండడం అవసరం. కాని దురాశ ఉండడం దుఃఖానికి మూలం. దురాశ అంటే అవసరానికి మించి వాంఛించడం. దీనివల్ల దుఃఖం కలుగుతుంది. ఈ దురాశ వల్ల చేయరాని పనులు చేసి అపాయాలలో చిక్కుకుంటాము. దుఃఖిస్తూ ఉంటాము. చిన్నయసూరి తన మిత్రలాభంలో వృద్ధ కపోతం ద్వారా, 'ఆహా, లోభమెంత చెడు గుణము. అన్ని దుఃఖాలకు లోభమే మూలం' అని చెప్పిస్తాడు. లోభం దురాశలోని అంతర్భాగమే! అలవిమాలిన ఆశలు పెట్టుకోవడం, అవి తీరక దుఃఖించడం మానవ సహజం. చేతికందినవాటితో, తనకు కలిగినవాటితో తృప్తి పడడం ఉత్తమ లక్షణం. కృష్ణశాస్త్రి 'ఆకాశంలో మెరిసే నక్షత్రాలు కావాలని ఆశించాను. చేతికందే పూలు దూరంలో లేవని వదిలేశాను. చుక్కలు మాయమైనవి. పూవులు వాడిపోయినవి. చివరకు నిరాశాపూరితమైన దుఃఖమే మిగిలింద'ంటాడు.

కాగా దురాశ దుఃఖాన్నే కలిగిస్తుంది. బాతు, బంగారు గుడ్ల కథ అందరికీ తెలిసిందే. ప్రతిరోజూ ఒక బంగారపు గుడ్డునిచ్చే బాతు కడుపులో చాలా గుడ్లు ఉంటాయని అన్నిటినీ ఒక్కసారే పొందవచ్చునని దాన్ని చంపి పొట్ట చీల్చి చూస్తే ఏమీ లేదు. దురాశకు దుఃఖం తప్ప మరేమీ మిగలదు. ఉన్న డబ్బును లాటరీ టిక్కెట్లు కొనడానికి ఖర్చు చేసి, ఏమీ రాక నిరాశతో దుఃఖించే అభాగ్యులు అనేకులున్నారు. గుఱ్ఱపు పందెములలో లక్షలార్జించడానికి పోయి, ఉన్నదంతా పోగొట్టుకొని దుఃఖించేవారు కోకొల్లలు. చీట్లపేకలు, చిల్లర జూదాలు దురాశ వల్ల ఏర్పడినవే. అవి దుఃఖహేతువులే గాని మరొకటి కాదు.

ఆశాజీవి శ్రమించాలి. తన శ్రమ ఫలితాన్ని మాత్రమే ఆశించాలి. తన కష్టం తనకు సత్ఫలితాన్నిస్తుందే తప్ప దురాశకు పోయి, అనూహ్యంగా అమిత లాభం తనకు కావాలని ఆశిస్తే, దుఃఖమే తప్ప సుఖం ఉండనే ఉండదు.

బైబులు సామెత దురాశల వల్ల ఆపదలు (దుఃఖాలు) కలుగుతాయని తెలియజేస్తుంది. 'లోభి' అంటే తనదేమీ పోకుండా, ఎదుటి వాళ్ళదంతా తనకే రావాలని కోరుకునేవాడు. ఇటువంటివాడినే దురాశాపరుడంటారు. ఈ లోభి, లేక దురాశాపరుడు తనకు, తన ఇంటివారికి కూడా దుఃఖాన్ని, బాధను కలిగిస్తాడని బైబులు సామెత ప్రబోధిస్తున్నది (సామెతలు 15:27). బైబులు గ్రంథంలో (2 రాజులు 5:1-27) నామాను అనే సైన్యాధిపతి తన కుష్ఠ రోగము నయము చేసిందుకు ఎలీషా ప్రవక్తకు కానుకల నీయబోగా, ప్రవక్త వాటిని తీసికొనుటకు నిరాకరిస్తాడు. అయితే గేహసీ దురాశాపీడితుడై తన యజమానుడైన ప్రవక్తకు తెలియకుండా కానుకలను నామాను నుండి స్వీకరించాడు. తత్ఫలితంగా ఎలీషా వానిని శపింపగా కుష్ఠరోగి అయ్యాడు. కనుక బైబులు సామెత, 'దురాశ వల్ల ఆపద కలుగునని, తెలుగు సామెత 'దురాశ దుఃఖమునకు చేటు' అని ఒకే భావాన్ని వ్యక్తీకరిస్తున్నవి.

## 4

తెలుగు సామెత : పొరుగింటి పుల్లకూర రుచి

బైబులు సామెత : దొంగిలించిన భోజనము మిక్కిలి రుచిగా నుండును (సామెతలు 9:17)

బైబులు సామెతలో ఉన్నంత స్పష్టంగా తెలుగు సామెతలో దొంగిలించడం గురించి లేదు. అయినా రెండిటిలోనూ తనది కానిది కంటికి ఆకర్షణీయంగా కనిపించడమే ముఖ్య ప్రతిపాదనం.

బైబులు ధర్మశాస్త్రానికి, నీతి న్యాయాలకూ పట్టుగొమ్మ వంటి ఆజ్ఞ :

'నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు

నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు' (నిర్గమకాండము 20:17).

ఆశించడమే పాపమని పవిత్ర గ్రంథం ఘోషిస్తున్నది. క్రీస్తు దీనిని నొక్కి వక్కాణించాడు. మనసులో పరవస్తు, పరగృహ, పరదారల పట్ల ఆశ మిణుక్కుమనడం క్షంతవ్యమే గానీ, ఆ ఆలోచనను కార్యరూపానికి తెచ్చి తనవి కానివాటిని దొంగిలించి అనుభవించడం నిశ్చయంగా దుష్కృతే.

తన ఇంట లక్ష్మీదేవి వంటి ఇల్లాలిని ఉంచుకొని ఆమె కాలిగోటికి సరిపోలని పరస్త్రీల పొందు ఆశించేవాడు ఇలాటివాడే. ఇంట మృష్టాన్న భోజనముండగా పక్కింట్లో కొయ్యగోంగూర వంటకాన్ని లొట్టలు వేసుకుంటూ చూచే తిక్కశంకరయ్యలుంటారు.

లక్ష్మీనాథుడు శ్రీ మహా విష్ణువు సైతం దీనికి మినహాయింపు కాదంటున్నాడు వేమన:

'పాల సాగరమున బవ్వళించిన హరి
గొల్లయిండ్ల పాలు కోరనేల
ఎదుటివారి ద్రవ్యమెల్లవారికి దీపి'

ఎదుటివారి ద్రవ్యమెల్ల వారికి దీపి అని చెప్పడంలో వేమన పైన పేర్కొన్న తెలుగు బైబులు సామెతలతో ఏకీభవిస్తున్నాడు. ఇలాటిదే వేమన విరచితమైన ఆటవెలది వేరొకటి –

'కనక పర్వతమున గాపురముండిన
అనిమిషేశ్వరునకు నాసపోదు;
కనక కుండలములు కర్ణుని నడగడా?'

బంగారు కొండయైన మేరువు తన నివాసమైనప్పటికీ దేవేంద్రుడు కర్ణుని స్వర్ణకుండలాలు ఆశించాడు. ఈతడే రంభా ఊర్వశి మేనకాది అప్సరసలు తన ఆజ్ఞానువర్తులైనప్పటికీ అహల్యా సతిని ఆశించి గౌతమ మహర్షి క్రోధానికి గురైనాడు కదా!

ఇలాటి దురాశను జయించి ఉన్నదానితో తనివితీరి తృప్తి చెందువాడు ఉత్తముడు.

# కృతఘ్నత

**1**

తెలుగు సామెత : ఇంటిలోవాడే కంటిలో పొడిచాడు

బైబులు సామెత : నా ఇంట భుజించినవాడే నామీద తిరగబడెను
(కీర్తనలు 42:9; యోహాను 13:18)

తిన్న ఇంటి వాసాలు లెక్కించే ఆషాఢభూతులతో జాగరూకతతో మెలగాలని హెచ్చరిస్తున్నాయి ఈ సామెతలు. నమ్మినవారిని నట్టేటముంచే నీచులు పాలు కుడిచిన రొమ్మునే గుద్దే దుష్టులు అన్నంపెట్టిన చేతినే నరికే కృతఘ్నులు ఎంతటి పాతకులో గదా. ఇది మిన్నాగును నట్టింట్లో సాకడంతో సమానం. అది ఎప్పుడో కాటు వేయక మానదు.

శిష్యుడన్న వాత్సల్యంతో చంద్రుడిని ఇంటబెట్టుకున్నాడు బృహస్పతి. గురుపత్నిని మోహించి, మురిపించి వశపరుచుకున్నాడు నెలబాలుడు. ఈ తారాశశాంకం 'నా యింట భుజించినవాడే నాకు ద్రోహం తలపెట్టా'దన్న నానుడికి తార్కాణం.

యేసు ప్రభువు జీవిత విశేషాలెన్నింటినో శతాబ్దాలకు పూర్వమే ప్రవక్తలు ప్రవచించారు. అటువంటి ఒక కీర్తనలో పైని చెప్పిన బైబులు సామెత తళుక్కున మెరిసింది. ప్రభువు తన జీవిత చరమాంకంలో తనపాలిట ఆ ప్రవచనం అక్షరాలా నెరవేరిందని వివరిస్తూ దానిని ఉటంకించాడు. తనతో వస్తూ పోతూ సన్నిహితుడుగా మెలిగిన యూదా అనే శిష్యుడు ఆయన శత్రువులతో కలసిపోయాడు. అతని అంతరంగమెరిగిన ప్రభువు అలా జరగవలసి ఉన్నది గనుక అతనిని బహిరంగంగా అవమానపరచక ఈ సామెతను ప్రస్తావించాడు.

అన్ని ద్రోహాల్లోకీ నమ్మకద్రోహం అతి కుటిలమైనది. ఇటువంటి వారిని కనిపెట్టి ముందుజాగ్రత్త తీసుకోవడం అందరికి శ్రేయోదాయకం.

## 2

తెలుగు సామెత : ఏరు దాటి తెప్ప తగలబెట్టినట్టు
అక్కర గడుపుకొని తక్కెడ పొయ్యిలో పెట్టినట్టు
అక్కరపడితే ఆదినారాయణ, అక్కర తీరితే గూదనారాయణ

బైబులు సామెత : నీవు ఉపయోగపడినంత కాలం నిన్ను వాడుకొని, ఆపైని ధనికుడు నీ చేయి విడుచును (సీరా 13:4)

ఏరు దాటేదాకా ఓడ మల్లయ్య, ఏరు దాటాక బోడిమల్లయ్య అన్నది కూడా ఈ కోవకు చెందిన సామెతే. ఇది మానవ నైజంలో ఒక విచిత్రమైన కోణం. పబ్బం గడిచాక కృతజ్ఞతాభావం కొనసాగించకపోవడమే విడ్డూరమైతే, సాయం చేసిన వారిని చులకన చేయడం, ఈసడించడం దైనందిన జీవితంలో తారసపడే వైనమే. ఇది తెలుగు సామెతల్లో మనోరంజకంగా వ్యక్తమయింది.

బైబులు సామెతలో చటుక్కున 'ధనికుడు' అనే పదం సాక్షాత్కరించి ఉలిక్కి పడేలా చేస్తుంది. ఇది వాస్తవమే. ధనికుడు తన అవసరం కోసం పేదవాడిని గౌరవభావంతో చేరదీసినట్టు కనిపిస్తాడు. ప్రియ వచనాలతో నమ్మబలుకుతాడు. పని పూర్తయ్యాక ఆ పేదవాడు తాను సైతం ధనికుని చెంతకు పోవడం తగ్గించుకొంటే గౌరవం నిలుస్తుంది. ఉపకారానికి ప్రత్యుపకారం ఆశించినా, ఆ ధనికునిలో కృతజ్ఞతా భావం నిలకడగా ఉండాలని ఊహించినా పేదకు మిగిలేది తిరస్కారమే. ధనికుల్లో ఈ ధోరణి లోక విధితమే.

నావపై నది దాటినవాడు దానినలా వదిలి తన దారిన తాను పోవాలి. ఇక దానితో తనకు అవసరం లేదు కదా అని పనిగట్టుకుని దానిని తగలబెట్టడం అతిశయోక్తే. అలానే మన తూకం అవసరం తీరాక తక్కెడను తగలబెట్టనవసరం లేదు. దాన్ని పొయ్యిలో పెట్టడం అతిశయోక్తే. అయితే మనుషుల్లో అటువంటి స్వార్థపూరిత ధోరణిని ఎండగట్టే ఉద్దేశంలో ఈ సామెతలు పుట్టాయి. అవసరం ఉన్నంతకాలం ఆది నారాయణా అని గౌరవంగా పిలిచి పబ్బం గడిచాక గూద నారాయణా, సోది నారాయణా అనడం ఆ వ్యక్తిలోని కుసంస్కారాన్ని తెలియజేస్తుంది.

ఆలోచించి చూస్తే ఆలుమగల మధ్య కూడా ఈ అపశృతి అక్కడక్కడా తారసపడుతుంటుంది. నవ యవ్వనంలో కన్య తన తనువు, మనసు భర్తకర్పించి

ఇంటెడు చాకిరీ చేసి, సంసార సుఖమిచ్చి, సంతాన భారము మోసి నడివయసుకే వృద్ధాప్యపు ఛాయలు సంతరించుకొంటుంది. కొందరు తుచ్ఛులైన మగవారు అంతవరకు తమ సహధర్మచారిణిగా చరించిన భార్యను విస్మరించి పర స్త్రీల పొందుకై తాపత్రయపడతారు. భార్యను పరుషోక్తులతో కించపరుస్తూ, ఆమె అనారోగ్యాల విషయంలో హేళన చేస్తూ విసుక్కుంటూ ఆమెను బాధిస్తారు. ఈ ధోరణి కూడా మొత్తంగా ధనిక వర్గంలోనే కనిపించడం కద్దు. దినదినం రెక్కాడితేగానీ డొక్క నిండని పేదలకు ఇలాటి వికారాలు పెద్దగా ఉండక పోవడం గమనార్హం.

గతంలో తనకు చేయూతనిచ్చిన మిత్రులను బంధుగణాన్నీ, తాను ఉన్నత స్థితికి చేరుకొన్నాక ముఖం చాటుచేసేవారికీ, ప్రజల ఓట్లతో ఎన్నికలలో గెలిచి పదవి వచ్చాక అటువైపుకి ముఖం కూడా చూపని నాయకమ్మన్యులకీ, తల్లిదండ్రుల రెక్కల కష్టంతో చదువుకుని పైకి వచ్చి, ఆపైన వారిని ఆదరించక పోషించక నిర్లక్ష్యం చేసే ప్రబుద్ధులకీ ఈ సామెతలు చెంపపెట్టు. అందుకే వేమన

‘తనయుడెవ్వడేని తా తండ్రి కంటెను
పేరు తెచ్చునట్టి పెద్దయైన
జనకుహీనుజేయ సాహసించిన జేటు
మూడు నిహపరంబుల మొనసి వేమ’ అంటాడు.

### 3

తెలుగు సామెత : తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టినట్లు

బైబులు సామెత : దుష్ట మిత్రుడు నీ స్థానమును ఆక్రమించుకొనును (సీరా 12:12)

‘అన్నం పెట్టిన చేతినే అంతం చేసినట్లు’ అని ఇంకొక తెలుగు సామెతను దీనికి సమానార్థంగా వాడతారు. అంటే మేలుచేసిన వానికి కీడు చేసేవానిని గూర్చి చెప్పే సందర్భంలో ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. ‘చన్నుకుడిచి వెన్ను గుద్దాడు’ అనే సామెత కూడా ఇటువంటి సందర్భాలలో వాడబడుతుంది. చేరదీసి, సాయం

చేసి నిలబెడితే అలా నిలబెట్టిన వానికే కీడు చేస్తారు కొందరు. అంటే ఈ తెలుగు సామెత కృతఘ్నులను గూర్చి తెలుపుతున్నదన్నమాట. 'అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేసేవాడు' అనే సామెత కూడా ఇదే సందర్భంలో ఉనికిని సంతరించుకుంది.

బైబులు సామెత పై తెలుగు సామెతను బలపరుస్తుంది. దుష్టుని చేరదీస్తే, అతడు చేరదీసిన వాని స్థానాన్ని ఆక్రమించుకుంటాడు. 'అల్పబుద్ధి వానికధికారమిచ్చిన, దొడ్డవారినెల్ల తొలగగొట్టు' అంటాడు వేమన. సాధారణంగా మిత్రుడు మిత్రత్వం కోసం ప్రాణమిస్తాడు. అయితే దుష్టుడు తనకు సహాయం చేసినవానినే తొలగించి ఆ స్థానాన్ని తానే ఆక్రమించుకుంటాడు. ఇటువంటి సంఘటనలు కోకొల్లలు. ఆ సందర్భాలను వివరించడానికి పైన చెప్పిన తెలుగు సామెతను, బైబులు సామెతను సమానార్థకాలుగా ఉపయోగిస్తారు.

తిన్న ఇంటివాసాలు లెక్కబెట్టేవాడు, తన మిత్రుని పడగొట్టి అతని స్థానాన్ని ఆక్రమించుకునే దుష్టుడు సమానులే. ఈ తెలుగు, బైబులు సామెతలు రెండూ ఇదే అర్థాన్ని బోధిస్తున్నాయి.

## లోభం

### 1

తెలుగు సామెత : గొడ్డుటావు పాలు పితికినట్లు

బైబులు సామెత : పిసినారియైన నరుడు దుష్టుడు, అక్కరలో ఉన్నవారిని ఆదుకొనడు (సీరా 14:10)

పాలనివ్వడం క్షీరదాల సహజ గుణం. ఇది క్షీరద సంతానానికీ, మానవులకు కూడా ఉపయోగకరమైన లక్షణం! అయితే కొన్ని గొడ్డుబోతు పశువులుంటాయి. అవి పాలీయవు. ఎందుకంటే పిల్లలను కని, పాలిచ్చి పెంచే శక్తి సామర్థ్యాలు వాటికి ఉండవు కనుక. ఇది ఆవులకు సంబంధించిన విషయం. దీనిని మానవులకు అన్వయించుకుంటే పిసినారి గొడ్డుటావుతో సమానుడు. అతనిని ఆశ్రయించడం వల్ల గాని యాచించడం వల్ల గాని ఎటువంటి ప్రయోజనమూ ఉండదని భావం. ఇటువంటి సందర్భాలలో ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

అందుకే వేమన

'గొడ్డుటావు బిదుక కుండ చేకొనిపోవ

పళ్లనూడదన్ను, పాలనీదు;

లోభివాని నడుగ లాభంబు లేదయా' అని అంటాడు.

బైబులు సామెత కూడా దీనికి సమానార్థకమైనదే. పిసినారి దుష్టుడు. అతడు అక్కరలో ఉన్నవారిని ఆదుకొనడు. అటువంటివాని వలన ఏ ప్రయోజనమూ ఉండదు. గొడ్డుటావు వలన పాడికి సంబంధించిన ప్రయోజనాలు ఎలా ఉండవో, అలాగే ఈ పిసినారి వల్ల కూడా ఆపదలో ఉన్నవారికి, అక్కర కలిగినవారికి ఏ విధమైన ఉపయోగమూ ఉండదు.

ఎవరికీ ఉపయోగపడని జీవితం మృతప్రాయం. అటువంటి సందర్భాలను వివరించడంలో పైన చెప్పిన తెలుగు సామెత, బైబులు సామెతలు ఒకే విధంగా ఏకార్థంతో ప్రయోగింపబడతాయి. అక్కరలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ లక్షణం. ఎదుటివానికి సాయపడని జీవితం మోడువారిన చెట్టూ సమానమే.

## 2

తెలుగు సామెత : గోదావరి పారినా కుక్కకు గతుకునీళ్లే

బైబులు సామెత : లోభి కడుపు నిండా తినుటకు ఇష్టపడదు (సీరా 14:10)

ఇది పిసినారితనాన్ని వివరించే తెలుగు సామెత. అన్నీ పుష్కలంగా ఉన్నా కొందరికి అనుభవించడానికి ఇష్టముండదు. చూస్తూ చూస్తూ డబ్బు ఖర్చుపెట్టలేడు, మంచి వస్త్రాలు కొనుక్కొని ధరించలేడు. కమ్మగా, కడుపునిండా తిననూ లేడు. కావలసినంత డబ్బు ఉన్నా ఖర్చు చేయడానికి మనసొప్పదు. గోదావరి నిండి జలప్రవాహం పరవళ్లు త్రొక్కుతూ పరుగెత్తుతున్నా కుక్క నీళ్ళను నాలుకతో గతుకుతుందే తప్ప, చప్పరించి నాకుతుందే తప్ప తనివితీరా నోటి నిండా గ్రహించి తాగలేదు. పిసినారి వాని స్వభావాన్ని తెలియజేస్తుంది ఈ సామెత. మధురకవి నాళం కృష్ణారావుగారు పిసినారి వ్యక్తి స్వభావాన్ని వివరిస్తూ

‘ఊరి వెలుపల పాడు కోనేరు చెంత
మనుజులెవ్వరు మసలని మారుమూల
గుట్టుచాటున లోతైన గోయి త్రవ్వి
పసిడి దాచెను పిసినారి ముసలియొకడు’ అని చెబుతాడు.

అతడు దానిని ప్రతిరోజూ చూచి సంతోషించడం తప్ప అనుభవించలేడు. దొంగవాడు దానిని దోచుకున్నప్పుడు విలపిస్తూ ఉంటే ఆ కాపువానితో మరొకడు ఆ బంగారం స్థానంలో పెద్ద బండరాతిని పెట్టి అదే పసిడి అనుకొని చూచి సంతోషించు అని చెబుతాడు. నీవు అనుభవించలేనిదాన్ని ఇంకొకడు అనుభవిస్తాడు. నీవు రాతిని చూచినా ఒకటే బంగారాన్ని చూచినా ఒకటేనని ప్రబోధిస్తాడు. ఇలాంటి పిసినారి గుణాన్ని తెలియజేయడానికి ‘గోదావరి నిండి పారినా కుక్కకు గతుకు నీళ్లే’ననే తెలుగు సామెతను వినిపిస్తారు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తున్నది. అన్నీ ఉన్నా లోభివాడు కడుపు నిండా తినడానికి ఇష్టపడడు. నాకింత ఉన్నదీయని చూచుకొని తృప్తి పడడం తప్ప లోభికి అనుభవించడం ఇష్టముండదు. ఆ మాటకు వస్తే నిరుపేదకు ఉన్న సుఖం కూడా లోభికి ఉండదు. నిరుపేద ఉన్న గంజి త్రాగి సుఖంగా నిద్రిస్తాడు. పిసినారి తన సొమ్మును అనుభవించకుండా దాచిపెట్టి, దానిని ఎవరు దొంగిలిస్తారో అని కాపలా కాస్తూ జీవిస్తాడు. అందువలన లోభివానికన్నా పేదవాడే సుఖిస్తాడని చెప్పవచ్చు.

మిత్రలాభములో ఒక పిసినారి నక్క తనచుట్టూ చచ్చిపడి ఉన్న అడవిపంది, జింక మొదలగు జంతువుల మాంసం దాచుకొని, బోయవాని వింటికున్న నరాలు కొరికి తినబోయి ధనుస్సు విరిగి కడుపులో గుచ్చుకొని మరణిస్తుంది. లోభం, పిసినారితనం ఒక్కొక్కసారి ప్రాణహాని కూడా కలిగిస్తాయి. ఈ భావాలను తెలుగు, బైబులు సామెతలు రెండూ ఒకే విధంగా వ్యక్తీకరిస్తున్నాయి.

## 3

తెలుగు సామెత : దానము చేయని చేయి, కాయలు కాయని చెట్టు

బైబులు సామెత : పిసినిగొట్టుకు సిరిసంపదలు తగవు (సీరా 14:3)

'దానము, భోగము, నాశము – పూనికతో మూడు గతులు భువి ధనమునకున్' అంటాడు భర్తృహరి. ధనమున్నందుకు మొట్టమొదట చేయవలసిన పని దానం! తరువాత తాననుభవించడం! ఈ రెండూ తెలియనివాని ధనం నాశమైపోతోంది. కాబట్టి దానం అన్ని గుణాలకన్నా మిన్నయైన గుణం. అటువంటి మహా విలువైన దానం చేయని చెయ్యి కాయలు కాయని చెట్టుతో సమానం. 'ఉరుదయాఢ్యుల మేను పరోపకార కలన రాణించు గంధంబు వలన కాదు' అని భర్తృహరి అంటాడు. దయాపరుల చేతులు శరీరం పరోపకారం (దానం చెయ్యడం) అనే కళ వల్ల శోభిస్తాయి గాని, గంధం, ఆభరణాలు మొదలైన సౌందర్య పోషకాల వల్ల కాదని దీని భావం. దానం చెయ్యడం ఒక అందమైన కళ. అది చేయలేని నరుడు పువ్వులూ, కాయలూ లేక మోడువారిన వృక్షంలాంటి వాడని ఈ తెలుగు సామెత తెలియజేస్తుంది.

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని తెలియజేస్తున్నది. పిసినిగొట్టువానికి సిరిసంపదలు తగవని తెలియజేస్తుంది. సిరిసంపదలకు సార్థకత రావాలంటే దానం చెయ్యాలి. అవి చెయ్యలేనివానికి సంపదలు అనవసరమే. తెలుగు, బైబులు సామెతలు ఒకే అర్థంలో పై సందర్భంలో ప్రయోగించబడతాయి.

'తోడిన చెలమయే ఊరుతుంద'ని ఇంకొక తెలుగు సామెత. నీళ్లు ఎంతగా తోడితే అంతగా ఊరతాయి. దానం ఎంత ఘనంగా చేస్తే సంపదలు కూడా అంత ఘనంగా పెరుగుతాయని దీని భావం. బలిచక్రవర్తి వామనునికి మూడడుగులు దానం ఇవ్వడానికి అంగీకరిస్తాడు. కాని అతని కులగురువు శుక్రాచార్యుడు వలదని వారిస్తాడు. అపుడు

'ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపై గపోపతటికై బాలింద్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిందగుట మీదైనా కరంబైట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే!

అని అంటాడు బలి చక్రవర్తి (శ్రీ మహాభారతము 8:519). ఈ సందర్భాన్ని పోతనామాత్యుడు అత్యంత మనోహరంగా భాగవతంలో చిత్రీకరించాడు. అంత గొప్పవాని (శ్రీహరి) చెయ్యి క్రిందై, నా చెయ్యి మీద కావడం కంటే అదృష్టమే

ముందంటాడు బలి చక్రవర్తి. కాబట్టి దానం చేసే కరం ఘనత వహిస్తుంది. దానం చెయ్యని చెయ్యి మోడువారిన చెట్టులాంటిది. పిసినారికి సిరిసంపదలు నిష్ప్రయోజనం అని చెప్పే సందర్భంలో ఈ రెండు సామెతలను ప్రయోగిస్తారు.

## తారతమ్యం

### 1

తెలుగు సామెత : నక్కెక్కడ? నాకలోకమెక్కడ?

బైబులు సామెత : క్రీస్తెక్కడ? సైతానెక్కడ? (2 కొరింథీ 6:15)

ఇద్దరు వ్యక్తుల మధ్య, రెండు స్థలాల మధ్య, రెండు వస్తువుల మధ్య ఉండే అంతరాన్ని నిమ్నోన్నతులను తెలియజేయడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు. నక్క భూజంతువులన్నిటిలోనూ హీనంగా చూడబడుతుంది. జిత్తులమారి అనీ, మోసకారి అనీ దాన్ని పిలుస్తారు. ఇది గోరీలలో సంచరిస్తూ చనిపోయినవారి శవాలను తినడానికి వేచి ఉండడం వల్ల, ఎవరైనా దేని కోసమైనా నిరీక్షిస్తూ ఉంటే వారిని గోతికాడ నక్కలాగా కాచుకొని కూర్చున్నావంటారు. నక్క స్మశానాలలోను, ఎడారి భూముల్లోనూ సంచరిస్తూ ఉండే నీచపు జంతువు. నాకలోకం అంటే స్వర్గలోకం. అక్కడ పుణ్యాత్ములు, దేవతలూ, సమస్త వైభవాలూ ఉంటాయి. నక్కకు, ఈ నాకలోకానికి ఊహాతీతమైన అంతరం ఉంది. ఒక మహోన్నత వ్యక్తిని గూర్చి, అదే సందర్భంలో ఒక అతి సామాన్యుని గూర్చి చర్చించవలసి వచ్చినప్పుడు పై తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెతలో కూడా ఈ అంతరం ప్రస్ఫుటంగా చూపించబడింది. క్రీస్తెక్కడ? సైతాను ఎక్కడ? అని! క్రీస్తు పాపజనోద్ధరణ కోసం ఈ లోకంలో నరావతారం ధరించి జన్మిస్తే, సాతాను అందరినీ పాప కూపంలో పడవేస్తాడు. సైతాను అసత్యవాది. అబద్ధాలకు జనకుడు. క్రీస్తే సత్యం! క్రీస్తు అందరికీ ఉపకారి. క్రీస్తు రక్షకుడు, సైతాను భక్షకుడు. క్రీస్తు విమోచకుడు, సైతాను ఉరులొడ్డేవాడు. ఈ విధంగా వెలుగునకు చీకటికిని ఉన్నంత తారతమ్యం క్రీస్తునకు సైతానునకు ఉంది.

నక్కను కుయుక్తిపరునికి, నాకలోకాన్ని సజ్జనునికి సాదృశ్యాలుగా చెబుతారు. సైతానును మరణానికి, క్రీస్తును నిత్యజీవానికి ప్రతీకలుగా నిలుపుతారు. కాగా నక్కెక్కడ, నాకలోకమెక్కడ అనే తెలుగు సామెత, క్రీస్తెక్కడ, సాతాను ఎక్కడ అనే బైబులు సామెత ఉపమాలంకార శోభితాలు! సర్వకాలీన సమానార్థకాలు!

## 2

తెలుగు సామెత : నవరత్నాలన్నీ ఒకచోట, నత్త గుల్లలన్నీ ఒకచోట

బైబులు సామెత : మంచి చేపలొకచోట చెడు చేపలింకొక చోట (మత్తయి 13:48)

నవరత్నాల విలువ వేరు, నత్త గుల్లల విలువ వేరు. వాటి వాటి స్థానాలు కూడా వేరు. అంటే మంచివారు మంచివారితో కలిసి ఉంటారు. చెడ్డవారితో కలిసిమెలిసి ఉండలేరు. అలాగే చెడ్డవారంతా తత్సమానుల దగ్గరే ఉంటారు కాని వేరొకరితో కలిసి ఉండలేరు. 'కాకి కోకిల అవుతుందా', 'వెలయాలు ఇల్లాలు అవుతుందా', 'ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది' అనే తెలుగు సామెతలు కూడా ఇదే భావాన్ని తెలియజేస్తున్నాయి. నవరత్నాలు నత్తగుల్లలలోనికి గాని, నత్త గుల్లలు నవరత్నాలలోనికి గాని రాలేవు. మంచివారు చెడ్డవారితో గాని, చెడ్డవారు మంచివారితో గాని కలసి జీవింపలేరు. అటువంటి సన్నివేశాలను వ్యక్తీకరించడానికి ఈ తెలుగు సామెతలను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని తెలుపుతుంది. మంచి చేపలన్నీ ఒకచోట ఉంటాయి. చెడు చేపలన్నీ వేరొక చోట ఉంటాయని వివరిస్తుంది. రైతు కళ్ళంలో గింజలను తూర్పారబట్టిన తరువాత గింజలొక చోటికి, పొట్టు మరొక చోటికి పోతుంది. అవి కలిసి ఉండడానికి వీలు పడదు. అదే విధంగా నీతిమంతులు అవినీతు పరులతో గాని, అవినీతిపరులు నీతిమంతులతో గాని కలువలేరు. పరిశుద్ధత, అపరిశుద్ధత విషయం కూడా అంతే. 'నీతిమంతుల సభలలో పాపులును, న్యాయవిమర్శలో దుష్టులును నిలువలేర'ని మరొక బైబులు సామెత దీనికి సమానార్థకంగా వినికిడిలో ఉంది. కాగా నవరత్నాలన్నీ ఒకచోట, నత్తగుల్లలన్నీ వేరొక చోట అనే తెలుగు సామెత మంచి చేపలొక చోట, చెడు చేపలింకొక చోట అనే బైబులు సామెత సమాన భావార్థకాలు.

# 3

తెలుగు సామెత : పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం

బైబులు సామెత : గాలికి ఎగిరిపోవు ఆకునా నీవు భయపెట్టునది
ఎండిపోయిన తాలునా నీవు వెన్నాడునది? (యోబు 13:25)

పురాణేతిహాసాలలో తారసపడే పాశుపత సమ్మోహన నాగాస్త్రాదుల కోవకు చెందిన ఆయుధ విశేషం బ్రహ్మాస్త్రం. ఇది అమేయ శక్తిపూరితం. లంకా నగరాన్ని అతలాకుతలం చేస్తున్న మారుతిని బంధించడానికి ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రమిది. పిచ్చుక మన పల్లెల్లో కనిపించే అల్పజీవి. పులుగులలోకెల్లా అబల. ఈ అంతరాన్ని బట్టి బలహీనులపై బలవంతులు ప్రయోగించే అనవసర బలప్రయోగాన్ని సూచించడానికి ఈ సామెతను ఉపయోగిస్తారు.

బైబులులో ధర్మాత్ముడు యోబు చరిత పరమపావనం. స్వర్గపురిలో ఒక జగన్నాటకానికి ప్రథమాంకం తెర లేచింది. విశ్వనాథుడే సూత్రధారి. ఒక్క రోజులో మహా భాగ్యవంతుడు, భక్తిపరుడైన యోబు బికారియైనాడు. ఆరోగ్యం దేహాన్ని విడిచిపోగా, మాయరోగాలు కమ్మి తనువును మనసును క్రుంగదీయగా, పెంటకుప్పపై కూర్చుండి నిర్వేదనం చెందుతున్న సమయంలో ఊరడించడానికి మిత్రులు వచ్చారు. అతడు ఒడిగట్టిన మహా పాతకానికి శిక్షగా దేవుడతనికి ఈ గతి పట్టించాడని ఈసడించుకొంటున్నారు. ఈ తరుణంలో భక్తవరేణ్యుడు యోబు విధాతనుద్దేశించి ఆవేదనాత్మకంగా పలికిన పలుకులు బైబులు సామెతగా రూపొందాయి.

సర్వాంతర్యామి, సర్వద్రష్టయైన జగన్నాథుడు మానవుల ప్రతి తలంపును, మాటను, నడతను పట్టి పట్టి పరిశీలిస్తూ, ప్రతిదానికీ తగిన శాస్తి చేస్తూ శిక్షిస్తూ కూర్చుంటే ఇక మానవులు మనగలిగేదెలా? అఖండ పవిత్రత, పరిపూర్ణత రూపుదాల్చిన పరమేశ్వరుడు మంటిపురుగుల వంటి మానవమాత్రులపై కనికరం లేక నిష్కర్షగా తన ప్రతాపం చూపుతూ ఉంటే మానవుడెలా నిలువగలడు. యోబు మిత్రుడు ఎలీఫజు మాటల్లో 'శుద్ధుడగుటకు నరుడు ఏపాటివాడు? నిర్దోషుడగుటకు స్త్రీకి పుట్టినవాడు ఏపాటివాడు?' (యోబు 15:14).

పరమ పునీత జగత్ప్రభువు కటాక్షం లేకుంటే మనిషి క్షణమాత్రమైనా బ్రతికి బట్టకట్టగలడా? దేవుడు తన మహా పవిత్రతా ప్రమాణాలతో నిశితంగా మానవ ప్రవర్తనను పరిశీలించడాన్ని పిచ్చుకపై బ్రహ్మాస్త్రంగానే అభివర్ణించవలసి ఉంటుంది.

## చిన్నచూపు

**1**

తెలుగు సామెత : పెరటిచెట్టు వైద్యానికి పనికిరానట్టు

బైబులు సామెత : ప్రవక్త స్వదేశములో ఘనత పొందదు (యోహాను 4:44)

సాధారణంగా అందుబాటులో ఉన్నవాటిని అలక్ష్యం చేస్తాము. ఏవైతే అందీ అందకుండా ఆటాడిస్తూ ఉంటాయో వాటిని ఎక్కువగా అభిమానిస్తూ, అవే కావాలని కోరుకుంటూ ఉంటాం. ఆ సమయంలో ఈ సామెతను ఉపయోగిస్తారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి, 'చేతికందే పూలు దగ్గరగా ఉన్నాయని వలదన్నాను. చుక్కలు దూరంగా పున్నాయని వాటిని కోరుకున్నాను. చివరకు పూలు వాడిపోయినాయి, చుక్కలు మాయమయినాయి. నాకు నిరాశే మిగిలింద'ని "చుక్కలు" అనే కవితా ఖండికలో వాపోతాడు.

మన చెంతనే ఉన్న గొప్పవారిని, మంచివారిని ప్రతిరోజూ చూస్తూ ఉండడంవల్ల వారిని చులకన భావంతో నిరాదరిస్తాము. ఎక్కడో దూరాన ఉన్నవాణ్ణి అతడు ప్రవీణుడు కాకపోయినా గౌరవిస్తాము. మన పరిసరాలలో అనేక తరువులు, గుల్మాలు, మొక్కలూ, వైద్యానికీ, వంటకాలకు ఉపయోగపడతాయి. అయితే వాటిని మనం సాదరంగా స్వీకరించలేము. ఎందుకంటే రోజూ కనిపిస్తూ, అందుబాటులో ఉండడమే కారణం. ఇది మానవ నైజం!

ఇదే పరిస్థితి యేసుక్రీస్తు కాలంలో కూడా ఉంది. ఆయన సొంత ఊరిలో నిరాదరణకు గురైనాడు. తన స్వదేశ ప్రజల చేత సిలువ వేయబడ్డాడు. అందుకే తన స్వదేశంలో ఏ ప్రవక్తా ఘనత పొందడనే సామెతను తనకు అన్వయించుకొన్నాడు.

"దూరపు కొండలు నునుపు" అనే సామెత కూడా ఈ కోవకు చెందినదే. మనకు దగ్గరగా ఉన్న కొండలు గుట్టలతో, రాళ్ళతో, చెట్లతో ఎగుడుదిగుడుగా ఉంటాయి. దూరంగా ఉన్న కొండలు నునుపుగా, అందంగా, నాజూకుగా ఎగుడుదిగుడు లేనట్లుగా కనిపిస్తాయి. తీరా అక్కడకు మనం వెళ్ళితే అవి కూడా గుట్టలతో రాళ్ళతో వికారంగా కనిపిస్తాయి. దగ్గరగా ఉన్నవాటిని చులకన భావంతో దూరం చేసుకోకూడదు. దూరాన ఉన్నవన్నీ గొప్పవని ఆశపడి ఉన్నవాటిని పోగొట్టుకొనకూడదు అని ఈ సామెతలు చెబుతున్నాయి.

## 2

తెలుగు సామెత : సేద్యగానికీ / జీతగానికీ మగబిడ్డా?

బైబులు సామెత : సౌలు కూడా ప్రవక్తలలో చేరెనా? (1 సమూయేలు 10:12)

'చక్కదనము లేల సంపదలేలను
విద్యయేల? భూమి విరివియేల
పుత్ర పదవి కంటె బుట్టునె పదవులు'

అని వేమన వాక్రుచ్చిన రీతిగా పుత్ర సంతానం అదృష్టభాగ్యంగా ఎంచే సంస్కృతి మనది. ఒక భూస్వామికి వరుసగా ఆడపిల్లలే పుడుతున్నారు. అతని వద్ద పనిచేసే పాలేరుకు కొడుకు పుడితే ధనికుడైనప్పటికీ ఆ యజమాని తన బంటుపై ఈర్ష్య చెందడం సహజం. లోకులది ఒక విచిత్రమైన మనస్తత్వం. సహజంగా దక్కే వరాలైనా పేదకు అలాటివి లభ్యమైనపుడు ఈసడించుకొంటూ, ఈర్ష్య చెందేవారుంటారు. ధనికులకు సిరిసంపదలు, అదృష్టాలు పోగులు పడినా, వారికేమి, మారాజులు, వారికిగాక మరెవరికి దక్కుతాయి ఇలాటివి అంటూ అబ్బురపడడం లోక సహజం. తెలుగు సామెత ఈ కోవకు చెందిన మానవ స్వభావాన్ని వర్ణిస్తున్నది.

ఇక బైబులు సామెత నేపథ్యం ఆసక్తికరమైనది. ఇశ్రాయేలు వారు దైవస్వామ్య వ్యవస్థతో విరక్తి చెంది ఇతర జాతులవలె తమకూ రాజుండాలని పట్టుపట్టారు. వారి మధ్య దైవప్రతినిధిగా ఉన్న సమూయేలు ప్రవక్త దైవాజ్ఞ ప్రకారం సౌలు అనే యువకుణ్ణి రాజుగా తైలంతో అభిషేకించాడు. దైవ నిర్ణయం జరిగిపోయింది. ఇక ప్రజలే అతణ్ణి రాజుగా గుర్తించాలి. ఈలోగా ఒక విచిత్రం జరిగింది. అభిషిక్తుడైన సౌలుపై దైవాంశ, దైవాత్మ నిలిచి ఉన్న కారణాన అతడొక పర్యాయం దైవజ్ఞులున్న వాటికలో వారితోబాటు ఉన్నాడు. పరవశులై వారంతా దేవోక్తులు పలుకుతూ ఉన్న సమయంలో సౌలు సైతం ఆత్మవశుడై ప్రవచనాలు పలికాడు. ఈ వైనం ఆనోటా ఈనోటా ప్రజానీకంలో వ్యాపించింది. సౌలు నెరిగినవారికి అతడు ఆధ్యాత్మిక చింతన గలవాడు కాదని బాగా తెలుసు. వారు కొంత ఎక్కసంగా, కొంత ఆశ్చర్యంగా, హాస్యాస్పదంగా, ఏమి? సౌలు కూడా ప్రవక్తలలో చేరాడా?' అంటూ ప్రశ్నిస్తూ నవ్వుకొన్నారు.

సాధ్యమా అసాధ్యమా అన్న మీమాంసతో పనిలేకుండా, ప్రజల అభిప్రాయంలో దేనికైనా ఒక వ్యక్తి అర్హుడా కాదా అన్న దృష్టితో పలికే మాటలకు ఈ సామెతలు ప్రతినిధులు.

మొత్తమ్మీద తెలుగు, బైబులు సామెతలు రెండూ కల్ల నిజాలెరుగని సామాన్య జనులు వారి అభిప్రాయలను బట్టి హాస్యానికో, ఈసడింపుకో చేసే వ్యాఖ్యానాలు.

## అహం

**1**

తెలుగు సామెత : బలవంతమైన సర్పము చలిచీమల చేత జిక్కి చావదె

బైబులు సామెత : పొగరుబోతునకు అవమానము తప్పదు (సామెతలు 11:2; 16:18)

యౌవన మదంతోనో, బలగర్వంతోనో, కలిమి వల్ల కలిగిన కైపుతోనో పదుగురిని దూషిస్తూ తిరస్కరిస్తూ చరించడం దుర్గుణమనీ, నాశహేతువనీ ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి. 'బలవంతుడ నాకేమని పలువురితో నిగ్రహించి' పలకడం వల్ల తనకు హాని కలిగించుకొంటున్నాడు. అలాటి పొగరుబోతు కాలం దాపురించినపుడు అల్పజీవుల చేతిలో భంగపడతాడని ఈ సామెతల సారాంశం. వేమన కూడా ఏకీభవిస్తున్నాడు –

'లక్ష్మి యేలినట్టి లంకాధిపతి పురి
పిల్ల కోతి సేన కొల్లబెట్టె'

కాలం కలసి రాకుంటే ఘనులు సైతం అల్పులౌతారు, మట్టి కరుస్తారు. ఇశ్రాయేలులో సింహబలుడు సంసోను చరిత్ర లోకప్రసిద్ధం. అతని చారుకేశ విలాసగాథ విషాదాంతం. తన కండబలంతో అహంకరించి కన్నూ మిన్నూ కానక శత్రుసీమలో వేశ్య పంచన చేరాడు. దేవుని పవిత్రాజ్ఞను నిర్లక్ష్యపెట్టి తన కేశ ఖండన రహస్యాన్ని శత్రువులకు అందే పరిస్థితిని కొనితెచ్చుకున్నాడు. తుచ్ఛులు, అర్భకులు అయిన శత్రుమూకల చేజిక్కి నిస్సహాయుడై కంటిచూపు పోగొట్టుకొని బానిస తొత్తుగా మారాడు. రావణ బ్రహ్మదీ అదే ధోరణి. లంకాపురి అభేద్యమనీ, తన భృత్యులు అనితర సాధ్య పరాక్రమశాలురనీ, తాను ఈశ్వర వరప్రసాదిననీ గర్వించి కానిపనులకు పాల్పడ్డాడు. చివరికి వానరుల వంటి అల్పజాతి లంకకు చేటు తెచ్చిపెట్టింది.

ఎంత బలమైన కాలసర్పమైనా చలిచీమల దండు తన దేహంపై దాడి చేసినపుడు చురుకుగా విదిలించుకొని సురక్షిత ప్రదేశానికి వెళ్ళకుండా, మన్నుదిని మత్తుగా పడియుండి, ఈ అల్పజీవులేమి చేస్తాయిలే అని అహంకరిస్తే వేలకొలదిగా చలిచీమలు దానిని లొంగదీసుకొని ప్రాణాలు తోడి తమకు ఆహారంగా చేసుకుంటాయి. ఎంతటివారికైనా అహం పనికి రాదని ఈ దృష్టాంతాల ద్వారా నేర్చుకోవచ్చు.

బొట్టు బొట్లుగా పడే నీటి బిందువులు ఎట్టకేలకు కఠిన పాషాణాన్ని సైతం కరగతీస్తాయి. బలగర్వమున్నవాడు అవమానాలను కొనితెచ్చుకుంటాడని ఈ సామెతల ఉపదేశం.

## ద్వంద్వ ప్రమాణం

**1**

తెలుగు సామెత : పేదవాడు పెంట తింటే ఆకలని, మారాజు తింటే మందుకని అన్నట్టు

చక్రవర్తి చేస్తే శృంగారం, చాకలి చేస్తే వ్యభిచారం

బైబులు సామెత : ధనికుడు తప్పు పలికినచో చాలామంది అతని సమర్ధింతురు, పేదవాడు తప్పు పలికినచో అందరు అతని నిందింతురు (సీరా 13:22)

ధనికులకు ఒక రకం విలువలు, దరిద్రునికి వేరు రకం విలువలు ఆపాదించే లోకం తీరును తెలుగు సామెతలు, బైబులు సామెత కూడా ఆక్షేపిస్తున్నాయి.

తెలుగు సామెతలు లోకం చూపే పేద, గొప్ప తారతమ్యాన్ని తీవ్రంగా ఈసడిస్తున్నాయి. లక్ష్మీ కటాక్షం పొందిన వ్యక్తిని, రాజ్య రమ వరించిన వ్యక్తిని లోకం ఎప్పుడూ ప్రత్యేకంగానే చూస్తుంది. వారెలాంటి వికృత కృత్యాలు జరిగించినా ఏదో ఒక రకంగా సమర్ధించడానికే చూస్తుంది లోకం. ఉచ్ఛిష్టం తినడమంత నీచ కార్యమైనా సరే ఆ ధనికుని ప్రాపు కోసం, మెప్పు కోసం దానికేదో విలువను, ఉత్తమత్వాన్నీ లోకులు ఆపాదిస్తారు. రాజులు నైతికమైన విలువలు, ఏక పత్నీవ్రతాలను తుంగలో తొక్కినా లోకం వేలెత్తి చూపదు సరికదా, మారాజులు వారేం చేసినా చెల్లుతుంది అనుకుంటుంది. ఒక సామాన్యుడు లేశమాత్రం హద్దుమీరినా రచ్చకీడ్చి

నానా రభసా చేస్తారు. నీతులు సార్వజనీనమైనా నీతి దప్పినవాడిని నిలదీయడానికి అవకాశమున్నదా లేదా అన్నదే ఇక్కడ ముఖ్యమైన విషయం. కాలక్రమంలో రాజులను, బలవంతులను ఏమీ అనలేము గనక ఒక నిర్లిప్తత, అందులోనుంచి పుట్టిన వ్యంగ్యం, మరికొంత దూరం పోయి వారు ఏమి చేసినా ఫరవాలేదు అనే ధోరణి పెంపొందింది.

ఇదే లోక సత్యాన్ని కవి సార్వభౌముడు శ్రీనాధుడు దాహార్తితో తపిస్తున్న సమయంలో చమత్కారంగా చెప్పాడు.

'సిరిగలవానికి చెల్లును
తరుణులు బదియారు వేలు దగ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా
పరమేశా గంగ నిడుము పార్వతి చాలున్' **(చాటువులు – శ్రీనాధుడు)**

"సిరి గలవాడు" రమేశుడు, విష్ణుమూర్తి. కృష్ణావతారంలో పదహార వేలమంది గోపికలను అతడు చేపట్టాడు. డబ్బున్నవాడికి అది చెల్లుతుంది. భిక్షగాడు, జంగం దేవర అయిన శంకరునికి ఇద్దరు పెండ్లాములు ఎందుకని అడుగుతూ 'పార్వతిని ఉంచుకో, గంగని విడిచిపెట్టు, మా గొంతులు ఒకింత తడుపుకుంటాం' అని కవి గడుసుతనంగా ప్రార్థించాడు. పై సామెతలు ఇందులో ప్రతిబింబిస్తున్నాయి.

బైబులు సామెతలో ఇదే భావం కొంత మృదువుగా ధ్వనిస్తున్నది. రాజెంత మూర్ఖుడైనా, అహంకారి అయినా, నోటికేది వస్తే అది ప్రేలినా అమృతవాక్కులు అంటూ అందరూ అతణ్ణి స్తుతిస్తారు. వంశపారంపర్యంగానో, అడ్డదారులు తొక్కడం వల్లనో రాజ్యం సిద్ధించినంత మాత్రాన రాజు పండితుడు కానవసరం లేదు. సొలొమోను వంటి మేధావి, శ్రీ కృష్ణ దేవరాయలు వంటి సాహితీ సమరాంగణ సార్వభౌముడు నూటికి కోటికి ఒక్కరు. నిరంకుశాధికారం హస్తగతం గనక నిరక్షరకుక్షి యైన రాజు ఏదైనా చెప్పి చెల్లించుకుంటాడు. అదే పొరపాటు మాట పేద నోట పలికితే దాని పరిణామాలు వేరుగా ఉంటాయి.

రాజుల కాలం పోయినా ఇదే పక్షపాతం నేటి సమాజంలో పేద గొప్ప తారతమ్యంలో గోచరమవుతున్నది. ధనికుడు ఎంత కాని మాట పలికినా అతనినెవరూ ఆక్షేపించరు. పేదవానిపై విరుచుకుపడతారు. ఈ వాస్తవాన్నే ఈ సామెతలు తెలుపుతున్నాయి.

# భోజన ప్రియత్వం

**1**

తెలుగు సామెత : కడుపే కైలాసం

బైబులు సామెత : కడుపే వారి దేవుడు (ఫిలిప్పీ 3:18)

కేవలం కడుపుకు తినడానికే పుట్టినట్టు భావించి, తిండిబోతులైన వారిని గురించి చెప్పడానికి ఈ సామెతలను ఉపయోగిస్తారు. ప్రపంచంలో కొందరికి తిండి తప్ప మరేదీ కనిపించదు, కనిపించినా అది వారికి అక్కరలేదు. తినడానికే బ్రతుకుతున్నామని వీరు భావిస్తారు గాని, బ్రతకడానికి తింటున్నామని అనుకోరు. కడుపు నిండితే చాలు, కైలాసం ప్రాప్తించినట్లే వీరు భావిస్తారు. సమస్తాన్ని సాధించినట్లే వీరు సంతృప్తి పడతారు. తన ఇంటివారు, ఇరుగుపొరుగువారు, తోటివారు తిన్నారా? లేదా అనే సంగతి కూడా వీరికి పట్టదు. జీవితంలో ఇంకేదో సాధించే తలంపు కూడా వీరికి ఉండదు. అటువంటివారి స్వభావాన్ని చిత్రీకరించడంలో ఈ సామెతలను ఉపయోగిస్తారు.

తెలుగు సామెతకు, బైబులు సామెతకు ఇసుమంతైనా భేదం లేదు. నిజానికి ఈ తిండిబోతులు ఇక దేనికీ పనికిరారు. ఏమీ సాధించనూ లేరు. ఆలోచనా జ్ఞానం అసలుండదు. తిండిగింజలు దండుగ తప్ప వీరివల్ల కలిగే లాభం రవ్వంతైనా ఉండదు. ఇంకా వివరంగా చెప్పాలంటే ఇటువంటి వారికి కైలాసంకన్నా, దేవునికన్నా వారి కడుపే మిన్న. తిండి ఉంటే చాలు, వీరు మిగిలిన దేనినైనా తృణప్రాయంగా భావిస్తారు. బైబులు, తెలుగు సామెతలు రెండూ ఇదే విషయాన్ని ముక్త కంఠంతో సమానంగా చాటుతున్నాయి.

నీవు తిండిబోతువైతే, నీ గొంతును కత్తితో ఖండించుకో అని ఇంకొక బైబులు సామెత తెలుపుతుంది. కారణం? ఈ తిండిబోతులు సోమరిపోతులవుతారు. వీరి వల్ల ఒరిగేదేమీ ఉండదు. ఇదే సత్యాన్ని ఈ రెండు సామెతలు బోధిస్తున్నాయి.

మానవ స్వభావ వివిధ ఛాయల విన్యాసం ఇంతవరకు పరిశీలించిన సామెతలలో గమనించాము. మానవ స్వభావంలోని సహనశీలత, స్నేహాల మాధుర్యాన్ని చవిచూపించి, పుడకలతో గానీ పోని సహజాతమైన బుద్ధులెన్నిటినో ఈ తెలుగు, బైబులు సామెతల జతలు మన కళ్ల ఎదుట గజ్జె కట్టించి ఆడించాయి. కూర్చున్న కొమ్మను నరుకుకొనేవాడు ఒకడైతే, కొండను త్రవ్వి ఎలుకను పట్టేవాడు వేరొకడు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటాడొకడు, చెప్పినదంతా విని ఇంతకీ నీవనేదేమిటి? అంటాడు మరొకడు. ఉలిపికట్టె దారి, కొండేల వల్ల చట్టుబండలైన పండంటి కాపురం, చెడిన కోతి చెరిచిన వనం వీటిలో కనిపించాయి. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది కాబట్టి నాలుకను అదుపు చేసుకోవాలని గ్రహించాము. ఇతరుల తప్పులెన్నుతూ తాము మాత్రం కేవలం శిరోముండనం చేతనే విరాగులమయ్యామనుకొనేవారు, మేక వన్నె పులులు, బద్ధకం మూలంగా బానిసైపోయినవాడు, దురాశాపరులు, ఆలుబిడ్డల నోటి వద్ద కూడు తెచ్చి వెలయాలికిచ్చే మూఢుడు, మీసాలకు సంపెంగ నూనె రాసిన పేద డాంబికుడు, పిల్లికి బిచ్చం పెట్టని పిసినిగొట్టు ఈ సామెతలలో దర్శనమిచ్చారు. కంచు గణగణా మ్రోగుతుండగా ధీర గంభీరంగా మ్రోగే కనకం, ఎగిరెగిరిపడే ఖాళీ విస్తరి, చలిచీమల చేతుల్లో చచ్చిన పాము, పిచ్చుకపై వదిలిన బ్రహ్మాస్త్రం వీనిలో తారసపడ్డాయి. ఇలా ప్రస్తుతం పరిశీలించిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలు మానవ స్వభావాన్ని కూలంకషంగా స్పృశించాయి, విశ్లేషించాయి. మానవ నైజం పట్ల రసవత్తరమైన రీతిలో అవగాహనను కలిగించాయి.